ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 4 మే 2026 | సంపుటి: 22 | సంచిక: 215 | వెల: రూ.7 | పేజీలు: 12+8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## కరీంనగర్‌లో కాల్పుల కలకలం

**పగటి పూట నగరాన్ని కుదిపేసిన పీఎంజే జ్యువెలరీ ఘటన**

- చొరబడిన ఐదుగురు సాయుధ దుండగులు
- సిబ్బంది ఒకరు మృతి
- భారీ మొత్తంలో ఆభరణాలను దోచుకెళ్లిన దుండగులు

2




## సంబరాలకు సన్నాహాలు

**కేరళలో విజయన్‌కు ఓటమి తప్పదన్న సర్వేలు..**

**కాంగ్రెస్ బిర్యానీ, బీజేపీ లడ్డూలు సిద్ధం**



కేరళ, అస్సాం, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో ఆయా పార్టీలు గెలుపు తమదేనన్న ధీమాలో ఉన్నాయి. ఈ క్రమంలోనే కేరళలో యూడీఎఫ్, భాజపా శ్రేణులు సంబరాలకు సన్నాహాలు ప్రారంభించాయి. - త్రివేండ్రం (నినాదం)

2



పశ్చిమబెంగాల్‌లో కౌంటింగ్‌కు

## సర్వం సిద్ధం

**11 జిల్లాల్లో హైఅలర్ట్**

కౌంటింగ్ ఏర్పాట్లపై కేంద్ర హోం శాఖ ఉన్నత స్థాయి భద్రతా సమీక్షా సమావేశం

2

**ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం**

అర్ధరాత్రి పేలిన ఏసీ..

## గాల్లో కలిసిన 9 ప్రాణాలు

**ఏడాదిన్నర చిన్నారి సహా 9 మంది సజీవదహనం**

**12 నుంచి 15 మందిని సురక్షితంగా కాపాడిన రెస్క్యూ సిబ్బంది**

దేశ రాజధానిలో ఆదివారం తెల్లవారుజామున ఘోర విషాదం చోటుచేసుకుంది. తూర్పు ఢిల్లీలోని సంపన్న ప్రాంతమైన వివేక్ విహార్‌లోని ఒక నాలుగు అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఏడాదిన్నర పసికందుతో సహా మొత్తం తొమ్మిది మంది సజీవ దహనం అయ్యారు. – న్యూఢిల్లీ (నినాదం)



2

## ఫైల్ పెట్టుకో.. ర్యాంపు తెచ్చుకో...

# అమ్ముకో

**భద్రాద్రి జిల్లాలో రాజకీయ నాయకుల ఇసుక వ్యాపారం**

**పైసల కోసం పచ్చని పల్లెల్లో చిచ్చు**

**భద్రాద్రి ఏజెన్సీ ప్రతినిధి (నినాదం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక ర్యాంపులు రాజకీయ వ్యాపారమైనాయి. అధికారంలో ఉన్నప్పుడే అందినకాడికి సంపాదించుకోవాలనే ఆలోచనతో నాయకులు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. అందులో భాగంగా మేము ఫలానా మంత్రుల అనుచరులం.. ఎంపి, ఎమ్మెల్యేలకు కుడి భుజాలం.. మేము ఏది చెబితే అదే వేదం అంటూ అధికారుల దగ్గర గొప్పలు చెప్పకొని పనులు చేయించుకోవడానికి అలవాటు పడిన కొందరు నాయకులు ప్రజలకు ఉపయోగపడే రాజకీయం మానేసి ఇసుక ర్యాంపుల ద్వారా సంపాదన పెంచుకునే రాజకీయం మొదలు పెట్టారు. ఈ సంపాదన నాటకంలో రాజకీయ నాయకులు, రైజింగ్ కాంట్రాక్టర్లు కలిసి తమ స్వార్థప్రయోజనాల కోసం ఏజెన్సీ గ్రామాలలో చిచ్చుపెట్టి అమాయక గిరిజనులను బలి పశువులను చేస్తున్నారని సాక్షాత్తు ఆదివాసి గిరిజన సంఘాల నాయకులే ఆరోపణలు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. స్వార్థపరులు సొసైటీల పేరుతో గ్రామాల్లో చిచ్చు రగిలించి పచ్చని పల్లెలను కలుషితం చేస్తున్నట్లుగా ఆరోపణలు కోకొల్లలు. ఇసుక ర్యాంపుల నిర్వాహకులం... రైజింగ్ టీమ్ వాటాదారులం (ఓనర్లం) అని బిల్డప్ ఇస్తూ కొందరు బినామీలు పెట్టుబడిదారుల సొమ్ముతో జల్సా చేస్తున్నట్లు ప్రచారం లేకపోలేదు. రాజుల సొమ్ము రాళ్ళపాలు అన్నట్లుగా వాళ్ళ సొమ్ము వాళ్ళిష్టం. అయితే ఇలాంటి షోకిళ్ళారాయుళ్ళ మూలంగా కొన్నిచోట్ల పచ్చని సంసారాల్లో సైతం చిచ్చు రగులుతున్నట్లుగా పల్లెల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.





### నాయకుల ఇజ్జత్ తీస్తున్న ఇసుక ర్యాంపులు

ఒకప్పుడు కాస్తోకూస్తో అందరికి ఆదాయం సమకూర్చిన ఇసుక ర్యాంపులు ఇప్పుడు ప్రభుత్వానికి, కాంట్రాక్టర్లకి తప్ప జనానికి అంతగా ఉపయోగపడటం లేదనే టాక్ వినిపిస్తోంది. అయినప్పటికీ ఇసుక ర్యాంపుల కోసం పోటీ తగ్గడం లేదు. దానికి ప్రధాన కారణం ఇసుక ర్యాంపులు అమ్ముకోవడమే. కొందరు నాయకులు తమ రాజకీయ పరపతి పలుకుబడి ఉపయోగించి అధికారులకు వాటాలు లేదా భారీగా ముడుపులు ఇచ్చి ఇసుక ర్యాంపులు తెచ్చుకొని ఖర్చుల పేరుతో లాభాలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ లోగుట్టు తెలియక ఆదివాసీ మహిళలు నాయకులను నమ్మి మోసపోతున్నారు. మన్యంలో పరిస్థితి చూస్తుంటే అమ్మకానికే ఇపుడు ఇసుక ర్యాంపులు అన్నట్లుగా కనిపిస్తోంది. ఈ తరహా దళారీ వ్యవస్థని నిర్మూలించి షెడ్యూల్ (ఏజెన్సీ) ప్రాంతంలో ఆదివాసీ కుటుంబాలకు వంద శాతం లాభం చేకూరే విధంగా ఐటిడిఏ ద్వారా ప్రభుత్వం ఇసుక ర్యాంపు సొసైటీలకు ఆర్థిక సహాయం అందించి రైజింగ్ కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా ర్యాంపులు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఫైల్ పెట్టుకో... ర్యాంపు తెచ్చుకో... లాభాలకు అమ్ముకో... అనే దొడ్డిదారి విధానానికి స్వస్తి పలకాలని ఆదివాసీ సంఘాల నాయకులు ప్రభుత్వానికి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేస్తున్నారు

### ఇసుక ర్యాంపుల వార్తలపై నాయకుల కన్నెర్ర

ఇసుక ర్యాంపులపై వార్తలు వస్తే కొందరు జీర్ణించుకోలేక పోతున్నారు. వార్తలు రాసిన విలేకరులపై కస్సుబుస్సుమనడం చూస్తుంటే సదరు నాయకులకు ఆవేశం తప్ప కనీస అవగాహన లేదని తేటతెల్లమౌతోంది. ప్రజలు ఆసక్తి కనపర్చే అంశాలపై సమాచారం సేకరించి ప్రజలకు వార్తలుగా అందించడం విలేకరుల విధి. అలా ప్రచురించిన వార్తలలోని సమాచారం సరియైనది కాదనిపించినా లేదా వ్యక్తిగతంగా తమకు నష్టం కలిగించేదిగా అనిపించినా దానిపై వివరణ ఇస్తూ ఆ వార్తలకి ఖండన రాయించుకోవచ్చు. అది సరైన ప్రజాస్వామ్య పద్ధతి. కానీ నాయకుల పేరు లేదా సొసైటీ పేరు వార్తలో లేకున్నా ఎవరో రెచ్చగొట్టారనో లేదా తమకి రాజకీయ అండదండలు ఉన్నాయనో రెచ్చిపోయి అట్టి వార్తలు రాసిన విలేకరికి ఫోన్ చేసి బెదిరించడం... ఆ తప్పుని కవర్ చేసుకోవడానికి శాండ్ రీచ్ సొసైటీ మహిళలను సదరు విలేకరి పైకి రెచ్చగొట్టడం నాయకుల అవగాహనలేమికి నిదర్శనం. సమాచారం ఇచ్చిన వారి పేరు బహిర్గతం చేయరనే ప్రెస్ నిబంధన గురించి బహుశా వీరికి తెలియదు. ఈ తరహా బెదిరింపు వైఖరి సరైనది కాదని, ఇలాంటి ఆవేశపరులు లొసుగులకు నిలయమైన ఇసుక ర్యాంపులు నిర్వహించడం కష్టమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమౌతోంది. సహనము, సమన్వయమే ఇసుక ర్యాంపుల విజయానికి కారణమని తెలియక చేతికాడికి వచ్చిన ర్యాంపులను కొందరు అహం, ఆగ్రహం, ఆవేశాలతో చేజార్చుకుంటున్నారని జనం బహిరంగంగా చర్చించుకుంటున్నారు.



రాష్ట్ర మంత్రి వర్గంలో

## మార్పులు

**కొత్త వారికి అవకాశం కల్పించడంపై కొనసాగుతున్న సస్పెన్స్**

**కేబినెట్ విస్తరణ మరింత ఆలస్యం..**

**రెండు ఖాళీల్లో ఒకటి ఎస్టీలకు**

**పలువురు మంత్రులకు ఉద్వాసన!**

తెలంగాణలో ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న కేబినెట్ విస్తరణ మరింత ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రానుండటంతో.. ఆ తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో.. మంత్రి వర్గాన్ని విస్తరించడం ఇంకొంత లేట్ కానున్నట్లు తెలుస్తోంది. ఇక ఖాళీగా ఉన్న రెండు కేబినెట్ పోస్టుల్లో ఒకరికి ఎస్టీ వర్గానికి కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఇక ఉన్న మంత్రుల్లోనూ కొందరికి ఉద్వాసన తప్పదనే వార్తలు వినిపిస్తున్నాయి.

- హైదరాబాద్, మే 3 (నినాదం)

2



ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు

## ప్రభుత్వం కుట్ర

కేటీఆర్ ఆరోపణ



- సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బహిరంగ లేఖ
- జీవో 7ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- 10 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా పథకానికి ఎసరు పెడుతున్నారని విమర్శ
- విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరిక

2



ధాన్యం కొనుగోలు చేయడంలో

## ప్రభుత్వం విఫలం

**ప్రభుత్వానికి రైతులే గుణపాఠం చెబుతారు: హరీష్ రావు**

**సిద్దిపేట, మే 3 (నినాదం)**

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి హరీష్ రావు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వానికి రైతులే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని మల్లారం స్టేజ్ వద్ద రాజీవ్ రహదారిపై రైతులతో కలిసి హరీష్ రావు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిబంధనల పేరుతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. పేరుకే కొనుగోలు కేంద్రాలు ...మిగతా 2లో

## కొత్తగూడెంలో నకిలీ సామ్రాజ్యం

**బడా బజార్ల మాటున భారీ మోసం!**

- బ్రాండెడ్ మాటున విచ్చలవిడిగా నకిలీ అమ్మకాలు
- బ్లాక్‌తో తక్కువకు కొని ఎక్కువ మార్జిన్‌కు విక్రయం
- వినియోగదారులకు కుచ్చుటోపి పెడుతున్న వ్యాపారులు
- దో నెంబర్ దందాపై టాక్స్‌ఫోర్స్ దృష్టి సారించేనా..?

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మే 3 (నినాదం)**

ఆ పేరు చూసి మోసపోకండి.. ఆ ప్యాకింగ్ చూసి నమ్మకండి! మీరు వాడుతున్న బ్రాండెడ్ సబ్బు, ఉదయాన్నే తాగే టీ పొడి, పళ్ళు తోముకునే పేస్ట్.. అన్నీ 'నకిలీ' కావొచ్చు. కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన వ్యాపార కేంద్రాలైన పెద్ద బజార్, చిన్న బజార్‌లు ఇప్పుడు ...మిగతా 2లో




**ఒకరిని మించి ఒకరు అజ్ఞాత స్మగ్లర్లు**

బావ ఆఫ్ స్క్రీన్..

## బావమరిది ఆన్ స్క్రీన్



- చిక్కిన బావమరిది..కాపాడే పనిలో బావ
- డీజిల్ ఖాళీ అయి చిక్కిన ఓ లారీ
- డ్రైవర్లతో సరిపెట్టి ఎస్కేపింగ్ కు ప్లాన్
- ఓ వేబిల్లు సృష్టించే పనిలో ఖాన్‌లు!
- సిద్దిపేట ఘటనతో కదిలిన డొంక
- తెరపైకి యూనస్ ఖాన్, ఫారూక్‌లు
- లోతుగా విచారించాలని పోలీసులకు రాస్తాం: డిసిఎస్‌ఓ - తనూజ

ఇంతకాలం కోట్ల విలువైన పేదల బియ్యాన్ని కొల్లగొట్టిన బావా బావమర్దుల విధ్వంసం ఇక ఆగిపోతుందా,నకిలీ యాక్షన్ పత్రాలతో అందరి కళ్లుగప్పి దేశవ్యాప్తంగా సాగించిన నకిలీ నాటకానికి తెరపడనుందా అంటే సిద్దిపేట నుండి కాస్త ఆశాజనకమైన ఆన్సరే వస్తోంది. నాలుగురోజుల క్రితం అక్కడ పట్టుబడ్డ బియ్యం లారీ విష యంలో అటు సివిల్ సప్లైస్,ఇటు పోలీసులు తగ్గేదేలే అంటు న్నారు. అసలు నేరస్తులను పట్టుకుని తీరుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

2

- సిద్దిపేట ప్రతినిధి, మే 3 (నినాదం)

తెలుగు రాష్ట్రాల్లో

## భారీ వర్షం

2

ఎండలతో అల్లాడుతున్న తెలుగురాష్ట్రాలను వరుణుడు కాస్త చల్లబరిచారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో ఆదివారం భారీ వర్షాలు కురిశాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. తిరుమల తిరుపతిలో ఈదురు గాలులతో కూడిన జల్లులు కురిశాయి. కోనసీమ జిల్లాల్లోనూ భారీ జల్లులు పడ్డాయి.

- హైదరాబాద్, మే 3 (నినాదం)



## ఉద్రిక్తతల నడుమ..

**ఆకివీడు రామాలయానికి శంకుస్థాపన**

పరిసరాల్లో 144 సెక్షన్ అమలు

2



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ఆదివారం ఉద్రిక్తతల నడుమ రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కె రామకృష్ణంరాజు పట్టణంలోని పెదపేటలో రామ మందిర పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. - ఆకివీడు, మే 3 (నినాదం)

# రాష్ట్ర మంత్రి వర్గంలో మార్పులు

రాష్ట్రంలో మంత్రి వర్గంలో మార్పులు, కొత్త వారికి అవకాశం కల్పించడంపై కొనసాగుతున్న సస్పెన్స్.. మరికొన్ని రోజులు సాగనుంది. త్వరలోనే తెలంగాణ మంత్రి వర్గ విస్తరణ, ప్రక్షాళన ఉంటుందనే వార్తలు వస్తున్న వేళ.. అది ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం 5 రాష్ట్రాల ఎన్నికలు పూర్తి కాగా.. సోమవారం ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఈ నేపథ్యంలోనే కేరళలో కాంగ్రెస్ కూటమి యూడీఎఫ్‌కు మెజార్టీ వస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనాల మధ్య.. హస్తం పార్టీ హైకమాండ్.. అటు వైపు దృష్టి పెట్టనుంది. ఈ క్రమంలోనే తెలంగాణ కేబినెట్ విస్తరణ ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇక కేబినెట్ విస్తరణలో.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన వారికే కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోద ముద్ర వేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అదే సమయంలో ఇప్పటికే కేబినెట్‌లో ఉన్న పలువురు మంత్రుల వ్యవహార శైలిపై హైకమాండ్ అసంతృప్తితో ఉన్న నేపథ్యంలో వారిని తప్పించి.. కొత్తవారికి అవకాశం కల్పించే సూచనలు కూడా కనిపిస్తున్నాయి. ఇక ఇప్పటికే మంత్రివర్గంలో రెండు ఖాళీలు ఉండగా.. మంత్రులను తప్పిస్తే మరింత మందికి అవకాశాలు రానున్నాయి. ఇక ఇప్పటికే ఉన్న 2 ఖాళీల్లో ఒకటి ఎస్టీలకు కేటాయించే సూచనలు ఉన్నాయి. దీంతో బాలూ నాయక్, రామచంద్రు నాయక్ వంటి వారు ఆ కేటగిరీలో మంత్రి పదవి కోసం ఎదురుచూస్తున్నారు. డిప్యూటీ స్పీకర్ పోస్టుకు గతేడాది రామచంద్రునాయక్‌ను కాంగ్రెస్ పార్టీ ఫైనల్ చేసినా అది అసెంబ్లీలో ఎంపిక జరగకపోవడంతో ఎటూ తేలలేదు. అంతేకాకుండా గత అసెంబ్లీ సమావేశాల్లో అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్ ఆఫీసును రెడీ చేసినా ఆ ప్రక్రియ మాత్రం ముందుకు సాగలేదు. ఇక మిగిలిన సీటు కోసం ఎవరిని ఎంపిక చేస్తారనేది ఇప్పుడు తీవ్ర ఆసక్తికరంగా మారింది. కేబినెట్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం లేకపోవడంతో వారికి అవకాశం దక్కుతుందనే ప్రచారం జరుగుతోంది. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుకు సలహాదారుగా కేబినెట్ మంత్రి హోదాలో మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి ఉన్నారు. కేబినెట్ భేటీలకూ ప్రత్యేక ఆహ్వానితునిగా ఉన్నారు. ఆయనను కేబినెట్‌లోకి తీసుకోవాలనే ప్రయత్నం ఎప్పటినుంచో జరుగుతుండటంతో మళ్లీ ఆయన పేరు తెరపైకి వస్తోంది.

ఇక అదే జిల్లాకు చెందిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు మంత్రివర్గంలో స్థానం దక్కొచ్చనే ప్రచారం జరుగుతున్న వేళ.. తమ ఇద్దరి ఆధ్వర్యంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొనడం గమనార్హం. గతంలో వైఎస్–డీఎస్‌లాగా రేవంత్–మహేష్ కుమార్‌గౌడ్ జోడి పని చేస్తుందని సీఎం పలు సభల్లో స్పష్టం చేశారు. దీంతో మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ చీఫ్‌గానే కొనసాగించనున్నట్లు తెలుస్తోంది.

ఇక కాంగ్రెస్ పార్టీకి అధికారం వచ్చినప్పటి నుంచి మంత్రి పదవిపై ఆశగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా రేసులో ఉన్నారు. ఈసారి ఆయన ఆశగా కూడా ఉన్నారు. అయితే కోమటిరెడ్డి బ్రదర్స్ విషయంలో హైకమాండ్‌దే ఫైనల్ నిర్ణయం కానుంది. మంత్రి పదవి కోసం చూస్తున్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు కేబినెట్ హోదాతో.. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చినా బాధ్యతలు చేపట్టలేదు. వీరితోపాటు.. మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు కేబినెట్‌లో చోటుకోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక ఇప్పటివరకు మంత్రులుగా ఉన్నవారిలో పలువురి పనితీరుపై కాంగ్రెస్ హైకమాండ్ అసంతృప్తితో ఉందని.. ఈ నేపథ్యంలోనే ఒకరిద్దరికి కేబినెట్ నుంచి ఉద్వాసన పలికి.. వారి స్థానంలో కొత్త వారిని తీసుకువస్తారనే చర్చ జరుగుతోంది. అదే జరిగిందే.. ఎవరినైతే తొలగిస్తారో.. అదే సామాజిక వర్గం నుంచి ఇంకొకరికి అవకాశం కల్పించనున్నారు. ఇక కీలక శాఖలు కూడా ఒకరి నుంచి మరొకరికి మార్చే అవకాశాలు కూడా ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. హోం మంత్రిత్వ శాఖను ఒక సీనియర్ మంత్రికి అప్పగించే అవకాశాలు ఉన్నాయని.. ఇతర శాఖల్లో కూడా కొన్ని మార్పులు, చేర్పులు ఉంటాయని తెలుస్తోంది. అయితే ఒక శాఖను మార్చితే.. దాన్ని సర్దుబాటు చేసేందుకు చాలా మార్పులు చేయాల్సి వస్తుందని.. అలా చేయడం వల్ల మరింత గందరగోళం తలెత్తుందనే భయాల నేపథ్యంలో ఆ ప్రయత్నం జరగకపోవచ్చని సమాచారం. ఈ నేపథ్యంలోనే తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం దృష్టిపెట్టేందుకు కాస్త సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి.



# సంబరాలకు సన్నాహాలు

విందులే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలకూ ఏర్పాట్లు చేస్తున్నాయి. మలప్పురం జిల్లాలోని పాండిక్కడ్‌లో విజయం ఖాయమని భావిస్తూ.. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కార్యకర్తలు దాదాపు 5,000 మంది కోసం బిర్యానీని సిద్ధం చేస్తున్నారట. బిర్యానీని వండేందుకు 16 భారీ పాత్రలు తీసుకొచ్చామని హస్తం పార్టీ నేతలు తెలిపారు. బిర్యానీని పంచిపెట్టేందుకు పట్టణంలో భారీ టెంటును కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. "రాష్ట్రంలో ఎల్డీఎఫ్ పదేళ్ల పాలనకు తెరపడనున్న నేపథ్యంలో.. పెద్దఎత్తున సంబరాలు నిర్వహించనున్నాం. సీపీఎం కార్యకర్తలు సహా అందరినీ స్వాగతిస్తున్నాం" అని ఓ కాంగ్రెస్ నేత మీడియాతో అన్నారు. మలప్పురం జిల్లా ఎప్పటి నుంచో యూడీఎఫ్‌కు కంచుకోటగా ఉందని, ఈసారి కూడా అవే ఫలితాలు వస్తాయని తెలిపారు. మరోవైపు.. కొచ్చిలో వేడుకలకు భాజపా సన్నద్ధమవుతోంది. ఇందుకోసం పార్టీ నేతలు ఇప్పటికే వందలాది లడ్డూలను ఆర్డర్ చేశారు. ఈసారి రాష్ట్రంలో కచ్చితంగా ఖాతా తెరుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. నేమం, కాళకూటం, మంజేశ్వర్, పాలక్కడ్, తిరువల్ల సహా పలు స్థానాలను కైవసం చేసుకుంటామన్నారు. గెలుస్తారని భావిస్తున్న అభ్యర్థుల చిత్రాలతో కూడిన ప్లకార్డులను కూడా సిద్ధం చేశారు.

పినరయి విజయన్ నేతృత్వంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన ఎల్డీఎఫ్‌కు ఈసారి ఎన్నికల్లో ఎదురుగాలి తప్పదని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ సంస్థలు అంచనా వేశాయి. యూడీఎఫ్‌కు ఈసారి ఓటర్లు పట్టం కట్టనున్నట్లు అభిప్రాయపడ్డాయి. భాజపా ఖాతా తెరిచే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నాయి.



## కరీంనగర్‌లో కాల్పుల కలకలం

**కరీంనగర్, మే 3(నినాదం )**

కరీంనగర్ నగరంలో ఆభరణాల దుకాణంలో జరిగిన కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. ఆదివారం పగటి పూట ఐదుగురు సాయుధ దుండగులు దుకాణంలోకి చొరబడి సిబ్బందిపై కాల్పులు జరిపి విలువైన నగలను దోచుకెళ్లారు. ఈ ఘటనలో ఒక సిబ్బంది అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. దుండగులు రెండు బైకులపై వచ్చి దాడి చేసినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆధారాల కోసం క్లూస్ బృందాన్ని రప్పించి సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నారు. దోచుకెళ్లిన నగల విలువ ఇంకా నిర్ధారణలో ఉంది.పట్టపగలు రద్దీ ప్రాంతంలో జరిగిన ఈ ఘటన నగర ప్రజల్లో భయాందోళనలు కలిగించింది.పోలీస్ ల విచారణ కొనసాగుతున్నది.

**నిందితుల జాడ తెలిపితే రూ.లక్ష బహుమతి**

కరీంనగర్‌లోని పీఎంజీ జ్యువెల్లరీ షాపులో కాల్పుల ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నగల దుకాణంలో చోరీకి పాల్పడ్డ నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఐదుగురు నిందితుల ఫొటోలను విడుదల చేశారు. వారి జాడ తెలిపిన వారికి రూ.లక్ష బహుమతి ఇస్తామని పోలీసులు ప్రకటించారు.

ఆదివారం ఉదయం బైకులపై వచ్చిన ఐదుగురు దుండగులు కస్టమర్లలా నగల దుకాణంలోకి ప్రవేశించారు. నగలు చూపించిన తర్వాత.. గన్‌తో బెదిరించారు. సిబ్బందిపై కాల్పులు జరిపి నగలను దోచుకెళ్లారు. దుండగుల కాల్పుల్లో ముగ్గురు సిబ్బందికి గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షం



అకాల వర్షాలతో పంట నష్టం ఉండే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో పలు జిల్లాల్లో భారీగా వర్షం కురిసింది. నల్లగొండ, పెద్దవూర, తిప్పర్తిలో భారీ జల్లులు కురిశాయి. గుర్రంపూడి, సూర్యాపేట, కోదాడలో కుండపోతగా జల్లులు పడుతున్నాయి. భారీగా కురిసిన వర్షం దాటికి హుజూర్‌నగర్‌లో వృక్షాలు నేలకొరిగాయి. మిర్యాలగూడ, నకిరికేల్‌లో భారీ జల్లులు పడ్డాయి. సిద్దిపేటలో భారీగా వర్షం కురవడంతో ఐకేపీ కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసింది. ఇన్నిరోజులు భానుడు భగభగలతో అల్లాడిపోయిన ప్రజలు ఒక్కసారిగా వరుణుడు కరుణించడంతో కాస్త సేద తీరారు.

# కొత్తగూడెంలో 'నకిలీ' సామ్రాజ్యం

**మొదటి పేజీ తరువాయి**

దో నంబర్ సరుకుకు అడ్డాలుగా మారాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. సామాన్యుడి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, కొందరు వ్యాపారులు నకిలీల దందాతో కాసులు కురిపించుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినబడుతున్నాయి. పక్కా ప్లాన్ ప్రకారం జరుగుతున్న ఈ దందా వెనుక పెద్ద నెట్‌వర్కే ఉందని సమాచారం. హైదరాబాద్, విజయవాడ వంటి నగరాల నుంచి తక్కువ ధరకే ఈ నకిలీ సరుకును బ్లాక్‌లో కొనుగోలు చేస్తున్నారు. ప్రముఖ కంపెనీల లోగోలు, ప్యాకింగ్‌లను అచ్చుగుద్దినట్లుగా తయారు చేసి, సాధారణ వినియోగదారుడు గుర్తుపట్టలేనంతగా మార్కెట్లోకి వదులుతున్నారన్న వందతులు వినిబడతున్నాయి.

**ప్రముఖ దుకాణాల్లోనే విచ్చలవిడిగా అమ్మకాలు..**

చిత్రమేమిటంటే, ఈ నకిలీ సరుకు కేవలం వీధి చివర చిన్న గల్లీల్లోనే కాదు, పట్టణంలోని చిన్న బజార్, పెద్ద బజార్ ప్రముఖ షాపుల్లోనూ విచ్చలవిడిగా దర్శనమిస్తోంది. నమ్మకమైన షాపులే కదా అని వచ్చే వినియోగదారులకు వ్యాపారులు 'కుచ్చుటోపి' పెడుతున్నారు. తక్కువకు కొని, ఎంఆర్‌పి ధరలకే విక్రయిస్తూ భారీ లాభాలను ఆర్జిస్తున్నారు. ఏ వస్తువు కావాలన్నా కొత్తగూడెం పట్టణ ప్రజలకే కాదు జిల్లాలోని నలుమOలల ఉన్న వారికి గుర్తొంచేది రెండే పేర్లు అవి చిన్న బజార్, పెద్ద బజార్. ఈ రెండు గల్లీల్లోనే దాదాపు 250 వరకు దుకాణాలు ఉన్నాయంటే ఈ ప్రాంతంలో జరిగే వ్యాపారం గురించి వేరే చెప్పనక్కర్లేదు. అతి సామాన్య ప్రజలకు కావాల్సిన అన్ని వస్తువులకు ఇవే కేంద్ర బిందువులుగా ఉన్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని వినియోగదారులకు దో నెంబర్ సరుకులు అంటగట్టి చేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**బిల్లుల్లేవు.. లెక్కల్లేవు!**

ఇంత పెద్ద వ్యాపార సామ్రాజ్యం ఉన్న ఈ చిన్న బజార్, పెద్ద బజార్‌లలో ఏ వస్తువు కొన్నా బిల్లులు ఉండవు. ఈ వ్యాపారమంతా రహస్యంగా, ఎలాంటి రికార్డులు లేకుండా సాగుతోంది. కొనుగోలు చేసేటప్పుడు గానీ, వినియోగదారులకు అమ్మేటప్పుడు గానీ ఎక్కడా బిల్లుల ప్రస్తావన ఉండదు. కొన్న సరుకులను ఏదో చిన్న చిట్టి మీద రాసి వారికి నచ్చిన రేట్లు వేసి ప్పనాలకు విక్రయాలు చేస్తుంటారు. దీంతో ప్రభుత్వం రావాల్సిన పన్నులకు కన్నం వేస్తూ, వైట్ అండ్ బ్లాక్ దందా సాగిస్తున్నారు. బ్రాండెడ్ వస్తువుల పేరుతో నాసిరకం సబ్బులు, పేస్ట్‌లను వాడటం వల్ల ప్రజలు చర్మవ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉందన్న విమర్శలు వినవస్తున్నాయి.

**టాస్క్‌ఫోర్స్ అధికారులు దృష్టి సారించేనా..?**

ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అడపా దడపా దాడులు చేయడం తప్ప, ఈ నకిలీ మOలాలను అరికట్టడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా టాస్క్ ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు రంగంలోకి దిగి పెద్ద బజార్, చిన్న బజార్‌లోని గోదాములపై దాడులు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కల్తీ రాయుళ్ల గుట్టురట్టు చేసి, వినియోగదారుల ఆరోగ్యాన్ని, జేబును కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు ప్రభుత్వం కుట్ర



తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై రాజకీయ దుమారం చెలరేగింది. ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘాటైన బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో 7ను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని అన్నారు. సీఎం, మంత్రులు రోడ్లపై తిరగలేరని ఆయన హెచ్చరించారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చారని కేటీఆర్ తన లేఖలో తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 7 ముమ్మాటికీ ఫీజుల పథకానికి పాతరేసేందుకు చేస్తున్న కుటిల ఎత్తుగడ. దీనివల్ల 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుంది. ఇది నిరుపేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే వెన్నుపోటు చర్య" అని కేటీఆర్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను వెంటనే వెనక్కి తీసుకుని, విద్యార్థి లోకానికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా కొనసాగించిందని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ పథకానికి గ్రహణం పట్టిందని విమర్శించారు. గత రెండున్నరేళ్లుగా సుమారు 10 వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలను చెల్లించలేదని, ఇప్పుడు విద్యార్థుల ఖాతాల్లో నేరుగా డబ్బులు వేస్తామంటే ఎవరూ నమ్మరని కేటీఆర్ అన్నారు. బకాయిలు పేరుకుపోవడంతో 2500కు పైగా కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. నిధులు అడిగిన వారిని వన్–టైమ్ సెటిల్మెంట్, టోకెన్ల పేరుతో మభ్యపెట్టారని, నిరసన తెలిపితే విజిలెన్స్ దాడులతో బెదిరించారని ఆరోపించారు.

ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే గురుకులాల్లో 142 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటికీ వేలాది మంది సరైన భోజనం లేక ఆసుపత్రుల పాలవుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు 3.75 లక్షల కోట్ల అప్పులు చేసిన ప్రభుత్వం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు మాత్రం ఒక్క రూపాయి విడుదల చేయకపోవడం దుర్మార్గం. రైతుబంధును మూడుసార్లు ఎగ్గొట్టి రైతులను దగా చేశారు. ఇప్పుడు ఫీజుల పథకానికి మంగళం పాడేందుకు దొడ్డిదారులు వెతుకుతున్నారు" అని కేటీఆర్ దుయ్యబట్టారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలుంటాయని కేటీఆర్ హెచ్చరించారు. "ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ చీకటి జీవోను వెంటనే రద్దు చేయాలి. లేదంటే 14 లక్షల మంది విద్యార్థులతో కలిసి కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరిస్తాం. ఇప్పటికే రైతుల ఆందోళనలతో రాష్ట్రం అట్టుడుకుతోంది. దీనికి విద్యార్థుల ఆగ్రహం కూడా తోడైతే ముఖ్యమంత్రి, మంత్రులు రోడ్లపై తిరగలేని పరిస్థితి వస్తుంది" అని కేటీఆర్ తన లేఖలో స్పష్టం చేశారు.

# ఉద్రిక్తతల నడుమ..

## ఆకివీడు రామాలయానికి శంకుస్థాపన

ఆకివీడు పెదపేటలో ఉన్న గొంతేనమ్మ గుడి స్థానంలో రామాలయాన్ని నిర్మించాలని డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు నిర్ణయించారు. ఆయన గత నెలలో ఆ ప్రాంతాన్ని సందర్శించినప్పుడు ఆ ప్రాంతంలో ఉన్న దళితులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేశారు. అయినా పట్టించుకోకుండా ఆయన గొంతేనమ్మ గుడిలో సీతారామ లక్ష్మణ సమేత విగ్రహాలను ప్రతిష్ఠించారు. దీంతో దళితులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసి డిప్యూటీ స్పీకర్‌ను అడ్డుకునే యత్నం చేస్తే పోలీసుల జోక్యంతో ఆయన గుడిలోకి వెళ్ళారు. ఆ తర్వాత మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రామాలయం నిర్మిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో మే 3 వ తేదీన ముహూర్తం నిర్ణయించారు. డిప్యూటీ స్పీకర్ రామాలయ శంకుస్థాపన చేస్తున్నారనే విషయం తెలియగానే బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్‌పీ) ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం అడ్డుకుని ధర్నాలుచేశారు. అయితే ఆందోళన చేస్తున్న నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆకివీడు పెదపేట లో రామాలయ నిర్మాణానికి అనుకూలమైన సమయాన్ని గుర్తించాలని వేణుగోపాలరావును కోరినట్లు రాజు పేర్కొన్నారు. మే 3వ తేదీ ఉదయం 7:14 గంటలకు అనువైన క్షణం అని అతనికి నిర్ధారించారు.. ప్రత్యామ్నాయాన్ని అడిగినప్పుడు, ఎటువంటి అడ్డంకులు ఉన్నా, ఈ నిర్దిష్ట సమయంలో పునాది వేయాలని పండితులు చెప్పారు. దళితుల నిరసనల మధ్య పోలీసు బందోబస్తు నడుమ ఆరారార్ శంకుస్థాపన చేశారు. చట్టపరమైన సవాళ్లు తదుపరి కేసుల బెదిరింపుల ద్వారా ప్రాజెక్టును అడ్డుకోవడానికి కొందరు చేస్తున్న ప్రయత్నాలను ఆయన విమర్శించారు, వెనక్కి తగ్గేది లేదన్నారు.

మరోవైపు పెదపేట రామాలయ పునర్నిర్మాణం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గతంలో జరిగిన వివాదాల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఏలూరు రేంజ్ పరిధి నుంచి సుమారు 600 మంది పోలీసులతో గస్తీ నిర్వహించారు. వీరిలో ఎస్పీతో పాటు ఇద్దరు ఏ ఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, 20 మంది సీఐ లు, 80 మంది ఎస్సై లు, సుమారు 500 మంది కానిస్టేబుళ్లు ఉన్నట్టు ఎస్పీ కార్యాలయం తెలిపింది. ఆకివీడు పట్టణం రెండు వైపులా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. 144 సెక్షన్ అమలులో వున్న నేపథ్యంలో ఎవరూ గుమిగూడి ఉండకూడదని, సభలు, సమావేశాలు, ఎటువంటి మీటింగ్‌లు పెట్టడానికి అనుమతు లు లేవని ఎస్పీ కార్యాలయం తెలిపింది. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే వారిపై చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిం చారు. ఆదివారం ఉదయం 7.14 గంటలకు డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు దంపతులు రామాలయ శంకుస్థాపనలో పాల్గొన్నారు.

**పోలీసు నిర్బంధాన్ని ఎత్తేయాలని నిరసన**

కాగా ఆకివీడు పెదపేట ప్రజలపై పెట్టిన పోలీస్ నిర్బంధాన్ని ఎత్తివేయాలని కేవీపీఎస్, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. భీమవరం ప్రకాశం చౌక్ వద్ద చేపట్టిన ఆందోళనలో సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాలన్ మాట్లాడుతూ కోర్టు పరిధిలో వున్న గొంతెనమ్మ గుడిని అక్రమంగా కూల్చివేశారన్నారు. 144 సెక్షన్ పేరుతో దళితులను వేధిస్తున్నారని, వారిపై పెట్టిన అక్రమ నిర్బంధాలను, కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఉండి నియోజకవర్గంలో దళితులపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు యుద్ధం ప్రకటించి వేధిస్తున్నారని కాంత్రి కుమార్ మండిపడ్డారు. ఆందోళనలో సంఘాల నాయకులు బి.వాసు దేవరావు, కె.రాజారామ్మోహన్‌రాయ్, జె.సత్యనా రాయణ తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమబెంగాల్‌లో కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో సోమవారం ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. బెంగాల్‌లో కౌంటింగ్ ఏర్పాట్లపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి భద్రతా సమీక్షా సమావేశం నిర్వహించింది. ఎన్నికల ఫలితాల సమయంలో హింస చెలరేగే అవకాశమున్న 11 జిల్లాలను అత్యంత సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించింది. ఆయా జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించి భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు వెల్లడించింది. ఈ జాబితాలో ముర్షిదాబాద్, ఉత్తర 24 పరగణాలు, దక్షిణ 24 పరగణాలు, కూచ్ బెహార్, మాల్డా, నాడియా, బీర్‌భూం, పశ్చిమ మేదినీపూర్, హుగ్లీ తదితర జిల్లాలు ఉన్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడే సమయంలో ఎటువంటి హింస, అల్లర్లు జరగకుండా ఉండేందుకు అన్ని కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలను హై అలర్ట్‌లో ఉంచినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 75 వేల మంది కేంద్ర పారామిలిటరీ దళాలను మోహరించినట్లు కేంద్ర హోంశాఖ అధికారులు పేర్కొన్నారు. బుల్లెట్లు, పేలుళ్లను తట్టుకోగల అధునాతన 'మార్క్స్‌మ్యాన్' సాయుధ వాహనాలను రంగంలోకి దించారు. బంగ్లాదేశ్‌ను ఆనుకుని ఉన్న సరిహద్దు జిల్లాల్లో అదనపు నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే కంటెంట్‌ను వ్యాప్తి చేయకుండా అడ్డుకునేందుకు రాజకీయ పార్టీల సోషల్ మీడియా అకౌంట్లు, వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని పలు ముఖ్యమైన ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఎన్ఐఏ అధికారులు నిఘా ఉంచారు. ఇదిలావుంటే అధికారిక లెక్కల ప్రకారం.. 2011 ఎన్నికల సమయంలో కౌంటింగ్ సందర్భంగా 25 మంది ప్రాణాలు కోల్పోయారు. 2016 ఎన్నికల సందర్భంగా 30 మంది మృతి చెందగా.. 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అత్యధికంగా 58 మంది మరణించారు. మళ్లీ అటువంటి హింస జరగకుండా నివారించేందుకు ఈ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలం

**మొదటి పేజీ తరువాయి**

ప్రారంభించారని, కానీ ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 28 రోజులు గడిచినా వడ్లు కొనడం లేదని రైతులు తన వద్దకు వచ్చి ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మొక్కజొన్న రైతులకు గన్నీ బ్యాగులు అందుబాటులో లేక రైతులే సొంత డబ్బులతో కొనుగోలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. సన్‌ఫ్లవర్ పంట 22 రోజులుగా కొనుగోలు కేంద్రాల్లోనే నిల్వ ఉందని, ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో మొక్కజొన్న, శనగలు, వడ్లు పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతుల గోస తగిలిన ప్రభుత్వం నిలబడదని



హెచ్చరించారు. వెంటనే కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసి ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు అది బోగస్‌గా మారిందన్నారు. ఎరువులు కొనాలంటే యాప్, వడ్లు అమ్మాలంటే ఆన్‌లైన్ అంటూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రాజీవ్ రహదారిపై రైతులతో కలిసి రాస్తారోక నిర్వహించడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న చిన్నకోదూరు ఎస్సై చంద్రమోహన్ అక్కడికి చేరుకుని హరీష్ రావుతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కూర మాణిక్యరెడ్డి, జంగిటి శ్రీనివాస్, కీసరి పాపయ్య, రేగుల దేవయ్య, సుంచు ఆంజనేయులు, లంకెల హరీష్, మధుసూదన్ రెడ్డి, ఉమేష్ చంద్ర, కొండం రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి పేలిన ఏసీ.. గాల్లో కలిసిన 9 ప్రాణాలు

గాయపడిన మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని గురు తేగ్ బహదూర్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు, అగ్నిమాపక శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో భవనంలోని రెండో అంతస్తులో మంటలు చెలరేగాయి. అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో మంటలు అంటుకోవడంతో.. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే అగ్నికీలలు మూడు, నాలుగో అంతస్తులకు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే 14 అగ్నిమాపక యంత్రాలు ఘటనాస్థలానికి చేరుకున్నాయి. సుమారు రెండు గంటలపాటు శ్రమించి ఉదయం 6 గంటల సమయంలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

**విషాదకరంగా మారిన ప్రాణనష్టం..**

ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల వారు మరణించడం అందరినీ కలిచివేసింది. ముఖ్యంగా రెండో అంతస్తులో ఉన్న 60 ఏళ్ల అరవింద్ జైన్, ఆయన భార్య 58 ఏళ్ల అనిత, కుమారుడు 35 ఏళ్ల నిశాంత్, కోడలు 33 ఏళ్ల ఆంచల్, ఏడాదిన్నర వయసున్న మనుమడు అకాశ్ మంటల్లో కాలిపోయారు. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అలాగే మూడో అంతస్తులోని 50 ఏళ్ల నితిన్ జైన్, ఆయన భార్య 48 ఏళ్ల శైలీ, కుమారుడు 25 ఏళ్ల సమ్యక్ ప్రాణాలు కోల్పోయారు. వీరు మాత్రమే కాకుండా మొదటి అంతస్తులోని 40 ఏళ్ల శిఖా జైన్ మరణించగా.. ఆమె భర్త నవీన్ జైన్ గాయాలతో చికిత్స పొందుతున్నారు. మొత్తంగా 12 నుంచి 15 మందిని అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా కాపాడి ఆస్పత్రిలో చేర్చారు. ఆపై 9 మృతదేహాలను స్వాధీనం చేసుకుని వాటిని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

**ఏసీ పేలుడే కారణమా?**

అగ్నిప్రమాదానికి ఖచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు. అయితే ఎయిర్ కండీషనర్ (ఏసీ) పేలడం వల్లే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయని స్థానికులు చెబుతున్నారు. "ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించింది. బహుశా ఏసీ పేలి ఉండవచ్చు.. ఆ వెంటనే భవనం మొత్తం పొగతో నిండిపోయింది" అని ఒక ప్రత్యక్ష సాక్షి మీడియాకు తెలిపారు. ఢిల్లీ పోలీస్ క్రైమ్ టీమ్, ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్నారు. అలాగే ఈ ఘటనపై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "వివేక్ విహార్ ప్రమాదం అత్యంత విషాదకరం. 9 మంది ప్రాణాలు కోల్పోవడం నన్ను తీవ్రంగా కలచివేసింది. బాధితులకు ఢిల్లీ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది" అని ఆమె ఎక్స్ వేదికగా ప్రకటించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆమె ఆదేశించారు.

# బావ ఆఫ్ స్క్రీన్.. బావమర్ది ఆన్ స్క్రీన్

**తెరచాటున యూనస్..తెరపైన ఫారూక్**

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే పద్దతులన్నీ సంబంధిత శాఖల అధికారులతోపాటు సాధారణ సమాజానికి సైతం తెలుసు.కాగా ఎవ్వరికీ అంతుచిక్కని సరికొత్త పద్దతిని ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన యూనస్,ఫారుక్ అనే ఇద్దరు ఆవిష్కరించారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల డిసిఎస్‌ఓలను ఆకట్టుకుని పెద్దమొత్తంలో రవాణా సాగిస్తున్నరు.ఆయా జిల్లాల్లో సీజ్ అయిన బియ్యాన్ని యాక్షన్ లో పాడుకుంటారు.తద్వారా వచ్చిన సంబంధిత ధృవపత్రాలను తనిఖీల సమయంలో పదే పదే వాడుతుంటారు.ఈ టెక్నిక్‌తో ప్రతినెలా వీరు 30 ఆపై టన్నుల వెయిట్ గల 20 నుండి 30 లారీలను వివిధరాష్ట్రాలకు తరలిస్తారు. ఇదంతా పట్టపగలే జరిగినా నరుడేకాదు ఈశ్వరుడైనా పసిగట్టలేని విధంగా ఉంటుంది.సిద్దిపేట ప్రాంతంలో డీజల్ నిండుకుని ఉండకపోతే ఆ లారీ కూడా పట్టుబడేదేకాదని స్థానికులు చెబుతున్నారు.అదీ పట్టపగలే కావటం గమనార్హం.

**డ్రైవర్ల కాల్ డైరెక్ట్రీ (సిడిఆర్) తీయిస్తాం: డిసిఎస్ఓ - తనూజ**

ఈ విషయమై నినాదం ప్రతినిధి వివరణ కోరగా డిసిఎస్ఓ తనూజ ఆసక్తికర అంశాలను వెల్లడించారు. ఇలాంటి ఆర్గనైజ్డ్ క్రిమినల్స్ పై చర్యల విషయంలో రాష్ట్ర కమిషనర్ తమకు నిర్దిష్టమైన ప్రత్యేక నియమావళి ఇవ్వటం జరిగిందని,దాని ప్రకారం పట్టుబడ్డ లారీ తాలూకు డ్రైవర్ల మొబైల్ నంబర్లకు సంబంధించి (సిడిఆర్)తీయిస్తామన్నారు.తద్వారా వీరి వెనకున్న అసలు నేరస్తులపై తగిన క్రిమినల్ చర్యలు తీసుకునే విధంగా పోలీసువారికి రాస్తామని చెప్పారు. జిల్లా సివిల్ సప్లైస్ అధికారి వివరణ ప్రకారం సదరు లారీ డ్రైవర్ల కాల్ డాటా తీయిస్తే ఖచ్చితంగా అసలు దోషులు బయటపడతారని,అప్పుడే స్టేట్ టాస్క్ ఫోర్స్ అధికారుల శ్రమకు ఓ అర్ధం పరమార్ధం ఉంటుందని సామాజికవాదులు అభిప్రాయపడుతున్నారు. మరి వేచి చూడాలి పోలీసులు ఇందులో ఏమేరకు వర్కవుట్ చేస్తారనేది.

# పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు.!

**అడ్డుకునేవారు కరువు**

**నోటీసుల తర్వాత**

**కొనసాగుతున్న నిర్మాణాలు**

**అక్రమ కట్టడాలకు అండగా**

**టౌన్ ప్లానింగ్ అధికారులు**

**పర్మిషన్ ఒకటి నిర్మాణం మరొకటి**

**అల్వాల్, మే 3 (నినాదం):** అల్వాల్ మున్సిపల్ పరిధిలో మచ్చ బొల్లారం. వెంకటాపురం. అల్వాల్ డివిజన్ లో అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పుట్టగొడుగులు వెలుస్తున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు అధికారుల నిర్లక్ష్యం. నిర్మాణ దారుల దుర్వినియోగం కారణంగా పర్మిషన్ ఒకటి నిర్మాణం మరొకటి అనే పరిస్థితి నేల కొంది. ఇంటి నిర్మాణానికి మాత్రమే అనుమతి తీసుకుని కమర్షియల్ భవనాలు నిర్మించడం. జి ప్లస్ అనుమతి తీసుకొని అనుమతికి మించి అదనపు అంతస్తులు కట్టడం వంటి ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెట్ బ్యాక్ నిబంధనలు పాటించకపోవడం. పార్కింగ్ సౌకర్యం లేకుండా భవనాలు నిర్మించడం వంటి అక్రమాలు కూడా అధికంగా కనిపిస్తున్నాయి. నిర్మాణాల విషయంలో అధికారులు సామాన్యుల పట్ల ఒక్కల పెద్దలపట్ల మరొకల వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ అన్నింటిని చూసి చూడనట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. చర్యలపై జాప్యం ఎందుకు అక్రమ నిర్మాలపై అధికారులు చర్యలు చేపట్టడం జాప్యం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే చాలా చోట్ల అనుమతులు ఒక్కల తీసుకొని అదనపు అంతస్తులు చేపడుతున్నారు. వీటిని పరిశీలించి తనిఖీలు నిర్వహించి. చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి. క్షేత్ర స్థాయి తనిఖీలు చేపట్టడంలో అధికారులు తగిన విధంగా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడంతో నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. నోటీసులు ఇచ్చినప్పటికి నిర్మాణాలు కొనసాగిస్తున్నారంటే అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





# అన్నదాతలకు భరోసా - చివరి గింజ వరకు కొనుగోలు

**ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం**

**దళారులను నమ్మొద్దు**

**వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**పెబ్బేరు మే 03 (నినాదం):** అన్నదాతలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, వారు సాగుచేసిన వరి, మొక్కజొన్న పంటలను చివరి ధాన్యపు గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. పెబ్బేరు మార్కెట్ యార్డుల్లో పిఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ పంటను విక్రయించాలని, ప్రభుత్వం రైతులకు పూర్తి మద్దతు అందిస్తుందని తెలిపారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను వెంటనే నమోదు చేసి, వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము త్వరితగతిన జమయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు.





**ఉపాధ్యాయులు దేశ నిర్మాతలు: ఎమ్మెల్యే**

ఉపాధ్యాయులు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, అన్ని వృత్తులకు మూలం ఉపాధ్యాయ వృత్తేనని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. అయ్యవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా సేవలందించి ఇటీవల పదవీ విరమణ పొందిన బచ్చలకూర స్వామినాథ్, సు తన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వామినాథ్ దాదాపు మూడు దశాబ్దాల పాటు వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా విశేష సేవలందించారని కొనియాడారు. ఆయన సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. పదవీ విరమణ ప్రయోజనాలు త్వరగా అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠ శాలలకు మించిన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించి విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మార్కెట్ యార్డు అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, శ్రీరంగాపురం మండల నాయకులు శ్రీహరి రాజు, శ్రీహరి రాజు, దయాకర్ రెడ్డి, పెద్ద రాములు, పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు చిన్నరాములు, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, అధ్యక్షుడు వసంతపురం రాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా
# నీట్ పరీక్షలు
**కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హనుమకొండ: 3 మే,(నినాదం):** జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు.జిల్లా వ్యాప్తంగా 8 పరీక్షా కేంద్రాల్లో నమోదైన 4,260 మంది అభ్యర్థుల్లో 4,165 మంది హాజరయ్యారు. 95 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మొత్తం హాజరు శాతం 97.76గా నమోదైనట్లు కలెక్టర్ వెల్లడించారు.పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముందస్తుగా చేపట్టి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని ఆమె తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పరీక్షల ప్రక్రియను సాఫీగా పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియ విజయవంతానికి కృషి చేసిన అధికారులు, పోలీస్ సిబ్బంది, సంబంధిత శాఖల సిబ్బందికి ఆమె ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

# నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని**

**ప్రారంభించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



**హన్మకొండ,మే3 (నినాదం):** హన్మకొండ వడ్డేపల్లి 60వ డివిజన్ లో రూ1 కోటి 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ పట్టణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. వడ్డేపల్లి ప్రాంతంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం కావడం స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. సాధారణ వైద్య సేవలతో పాటు తల్లి-శిశు సంరక్షణ, టీకాలు, నిర్ధారణ పరీక్షలు వంటి సేవలు ఒకే చోట అందుబాటులోకి రావడం వల్ల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండబోదని ఆమె స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి వార్డులో అవసరమైన ఆరోగ్య సదుపాయాలను మెరుగుపరచేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీ తెలిపారు. ప్రజలకు ఎలాంటి వైద్య సమస్యలు ఉన్నా సమీపంలోని ఈ కేంద్రాన్ని ఆశ్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, డీ ఎం ఉ హెచ్ ఓ డాక్టర్ అల్లెం అప్పయ్య,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది, ప్రాంత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా ప్రశాంత్ కుమార్

**చింతపల్లి, మే 3 (నినాదం):** మండల పరిధిలోని అంబేద్కర్ యువజన సంఘం కొత్త నియమావళితో పాటు కమిటీ నిర్మాణాన్ని సభ్యులు ఆదివారం ప్రకటించారు. సంఘం అభివృద్ధి, యువత సేవా కార్యక్రమాల పురోగతిని దృష్టిలో ఉంచుకుని కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.సంఘ అధ్యక్షులుగా చెట్టిమల్ల ప్రశాంత్ కుమార్, ఉపాధ్యక్షులుగా బండి కార్తిక్, ప్రధాన కార్యదర్శిగా నల్లవెల్లి సైదులు, సహాయ కార్యదర్శిగా పంబలి యాదగిరి , గౌరవ అధ్యక్షులుగా గాదరి జంగయ్య, నల్లవెల్లి యాదయ్య, నల్లవెల్లి సుదర్శనం లు ఎన్నికయ్యారు.గౌరవ సలహాదారులుగా నల్లవెల్లి ప్రభాకర్, నల్లవెల్లి రామకృష్ణ, నల్లవెల్లి సైదులు నియమితులయ్యారు. గౌరవ సభ్యులుగా బండి లక్ష్మీకాంత్, ఆనంద్ కుమార్, నల్లవెల్లి యాదగిరి వ్యవహరిస్తుండగా, అడ్వైజర్ కమిటీ సభ్యులుగా గంటెల ఆంజనేయులు, తవ్వల మల్లయ్య, పంబలి వెంకటయ్యలను ఎంపిక చేశారు. కార్యనిర్వహణ, ఫౌండర్ సభ్యునిగా నల్లవెల్లి సంజీవ



నియమితులయ్యారు. సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు చెట్టిమల్ల ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి నిరంతరం కృషి చేయడమే తన లక్ష్యమన్నారు. సంఘ అభివృద్ధితోపాటు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనడం జరుగుతుందన్నారు. తనను ఎన్నుకున్న సంఘ సభ్యులందరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఘనంగా సాంబరాజు రవి 42వ జయంతి

- **రజక రిజర్వేషన్ల కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయం**

**జవహర్ నగర్, మే 3 (నినాదం):** తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, దివంగత నాయకులు సాంబరాజు రవి 42వ జయంతి వేడుకలు ఆదివారం జవహర్ నగర్‌లోని అంబేద్కర్ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శాగంటి వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అంబేద్కర్ నగర్ కాలనీలోని రజక మినీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నేతలు సాంబరాజు రవి ఆశయాలను స్మరిస్తూ, ఆయన సమాజానికి చేసిన సేవలను నాయకులుకొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్దార్ గోపి రజక రాష్ట్ర అధ్యక్షులు కొలిపాక లక్ష్మణ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిసాంబరాజు కుమార్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శాగంటి వెంకటేష్ మాట్లాడుతూ, రజక రిజర్వేషన్ల సాధన కోసం సాంబరాజు రవి నిరంతరం శ్రమించారని గుర్తుచేశారు. రజక సామాజిక వర్గ అభ్యున్నతి కోసం ఆయన పడిన



తపన, చేసిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన అసంపూర్తిగా వదిలిన ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సాంబరాజు రవి రజక జాతి గర్వించదగ్గ నాయకుడు. ఆయన ఆశయ సాధన కోసం మనమంతా ఐకమత్యంతో ముందుకు సాగాలి."అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ మీడియా సెక్రటరీ రాపర్తి అజయ్, మేడ్చల్ యూత్ అధ్యక్షులు పోలాస సాయి కుమార్,కాప్రా అధ్యక్షులు కిరణ్, ప్రసాద్,సభ్యులు, చిట్యాల సత్తయ్య, ఇటిక్యాల సిద్దయ్య,అల్లుగునూరిదశరథ్,రుద్రాక్ష సత్యనారాయణ,వడ్లకొండ రమేష్,చీమల కొండూరు క్రాంతి,కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విరమణ ఉద్యోగానికే.. సేవలకు కాదు...

- **విధుల పట్ల అంకితభావంతో పనిచేసిన భవాని**
- **రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు**

**పాలేరు, మే 03( నినాదం):** పదవి వీరమణ ఉద్యోగాలకే కానీ సేవలకు కాదని...రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలం లోని అప్పలనరసింహాపురం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.ఎన్.వి.ఎల్. భవాని ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం అదివారం మండల కేంద్రం లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ఉపాధ్యాయురాలు గా అనేక మంది విద్యార్థుల జీవితాలను మార్చారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తితో పాటు అనేక ' సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. అమె ఉద్యోగం విరమణ పొందినప్పటికీ సేవలు కొనసాగించాలని సూచించారు. అమె 'భర్త దుర్గారావు ఉపాధ్యాయుడు గా, సంఘం ప్రతినిధిగా అనేక ఉద్యమాలు నిర్వహించారని అన్నారు. ఇరువురు ప్రజా సేవలో మరింత



సేవలు అందించాలని కోరారు. ఈ సభలో వివిధ ఉపాధ్యాయ సంఘాల,ప్రతినిధులు పాల్గొని ఆమె చేసిన సేవలను ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, రాష్ట్ర యువజన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తొర్తి సురేష్. టి.రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానికుల అప్రమత్తతతో 108 సిబ్బంది రక్షణ

- **మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు**

**పెబ్బేరు మే 03 (నినాదం):** మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం తిరుపతి దేవస్థానాన్ని దర్శించుకుని లత్తూరు వైపు తిరుగు ప్రయాణంలో అపశృతి చోటుచేసుకుంది. ఆదివారం మధ్యాహ్నం విశ్రాంతి కోసం వనపర్తి జిల్లా పరిధిలోని తొమలపల్లె కాలువ వద్ద ఆగిన కుటుంబ



సభ్యులు సేదతీరుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. కుటుంబానికి చెందిన హర్షిద్ (21) అనే యువకుడు కాలువలోకి దిగిన క్రమంలో అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో నీటిలో కొట్టుకుపోయాడు. ఈ దృశ్యాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడిని కాలువలో నుంచి బయటకు తీసి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం అతడిని వనపర్తి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించిన అనంతరం మెరుగైన వైద్యం అవసరమని సూచించడంతో హర్షిద్‌ను హైదరాబాద్‌లోని పెద్ద ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిసింది. స్థానికుల అప్రమత్తత, 108 సిబ్బంది వేగవంతమైన స్పందనతో యువకుడి ప్రాణాలు కాపాడినట్టు స్థానికులు అన్నారు.

केनरा बैंक కెనరా బ్యాంక్
బ్రాంచ్: మెహిదీపట్నం (13007)
నెం. 3-5-168/1234, 1వ అంతస్తు, శాంతి టాకీస్ ఎదురుగా, నారాయణగూడ, హైదరాబాద్-500029

అనుబంధం-10
**స్వాధీనతా ప్రకటన** (సెక్షన్ 13(4))
(స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 2002 యొక్క 54) (ఇకముందు "చట్టము"గా వ్యవహరించబడును) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ **కెనరా బ్యాంక్** వారి అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకందారు **తేది: 19.12.2022**తో జారీ చేసిన **డిమాండ్ నోటీసు** ప్రకారము రుణగ్రహీతలైన **శ్రీ శివరాత్రి విజయ్ కుమార్ తండ్రి ఎస్.కిష్టయ్య మరియు శ్రీ ఉర్సు రాములు తండ్రి ఓ. వెంకటయ్య** వారిని నోటీసు నందు తెలియజేయబడిన రుణ బకాయి మొత్తము **రూ. 19,15,501.50 (రూపాయలు పంతొమ్మిది లక్షల పదిహేను వేల ఐదు వందల ఒకటి మరియు పైసలు యాభై మాత్రమే)** ను నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది.
కాని సదరు రుణగ్రహీతలు బకాయి మొత్తమును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సదరు రూల్‌లోని రూల్ 8&9 తో చదవబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతడు/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ దిగువ సంతకముదారు క్రింద తెలిపిన ఆస్తిని **02 మే, 2026**న స్వాధీనం చేసుకోవడమైనదని రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.
కావున ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదనియు ఒకవేళ జరిపినట్లయితే **కెనరా బ్యాంక్** వారికి చెందిన బకాయి మొత్తము **రూ. 26,60,749.23 (రూపాయలు ఇరవై ఆరు లక్షల అరవై వేల ఏడు వందల నలభై తొమ్మిది మరియు పైసలు ఇరవై మూడు మాత్రమే)** మరియు దానిపై వడ్డీ మరియు ఇతర అపరాధ చార్జీల క్రింద వర్తించును.
సదరు చట్టములోని సెక్షన్ 13(8)లోని సదుపాయముల క్రింద మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు ఇదియే సరియైన సమయమని భావించమని రుణగ్రహీతలను కోరడమైనది.

**స్థిరాస్తి వివరణ:**
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కీసర మండలం, గోధుమకుంట గ్రామం మరియు గ్రామ పంచాయతీ, "టిపిఎస్ కృష్ణా నగర్ కాలనీ ఫేజ్-3" వద్ద ఉన్న సర్వే నెం.లు 157, 163, 164, 165, 166, 167లలోని 79.33 చ.గ.ల లేదా 66.31 చ.మీ.ల విస్తీర్ణము గల ప్లాట్ నెం. 65 భాగములో నివాస ఇండిపెండెంట్ గృహము యావదాస్తి. **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం.66, **దక్షిణం:** 12 వెడల్పు రోడ్డు, **తూర్పు:** ప్లాట్ నెం. 65 భాగము (తూర్పు పోర్షన్), **పడమర:** ప్లాట్ నెం. 65 భాగము (పడమర పోర్షన్).

తేది: 02.05.2026, ప్రదేశము: హైదరాబాద్ — అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

SBI **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
రిటైల్ అస్సెట్స్ & స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సిటీ క్రెడిట్ సెంటర్
హెచ్.నెం. 1-7-1276/3, మెయిన్‌రోడ్డు, అడ్వకేట్స్ కాలనీ,
హన్మకొండ. ఫోన్: 0870-2424705 Email: Sbi.21018@Sbi.co.in

**సంక్షిప్త డిమాండ్ నోటీసు**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **RASMECCC- 21018,** హన్మకొండ నుండి ఈ దిగువ రుణగ్రహీతలు: **శ్రీ ఇమ్మడి కిరణ్, తండ్రి: సుధాకర్** పొందిన రుణసౌకర్యాలకు సంబంధించిన **Housing Loan A/c. No.: 32630600345, Home Top-up A/c. No.: 37842724080** అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, మీ రుణఖాతాలు నిరర్థక ఖాతాలు (NPA)గా వర్గీకరించబడినవని, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము బ్యాంకుకు చివరిగా తెలిసిన మీ చిరునామాలకు నోటీసులు జారీచేయడమైనది, కానీ అవి బట్వాడా కాకుండా తిరిగి వచ్చినవి. అందువలన ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

**ఋణగ్రహీత యొక్క పేరు: శ్రీ ఇమ్మడి కిరణ్, తండ్రి: సుధాకర్,** ఇంటి నెం. 2-8-292, రాఘవేంద్రనగర్, వడ్డేపల్లి, హన్మకొండ, వరంగల్ జిల్లా-506001.

| | |
|---|---|
| **డిమాండ్ నోటీసు తేది: 13-04-2026** | **NPA యొక్క తేది: 10-04-2026** |

**చెల్లించవలసిన బకాయి మొత్తము : ది.13.04.2026 నాటికి రూ.22,65,489/-(అక్షరాల ఇరవై రెండు లక్షల అరవై ఐదు వేల నాలుగు వందల ఎనభై తొమ్మిది రూపాయలు మాత్రమే)** + జమకూడని వడ్డీ మరియు భవిష్య వడ్డీ, అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు మొ॥

**అమలుచేయవలసిన సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరాలు / ఆస్తుల వివరాలు:**
వరంగల్ అర్బన్, రిజిష్ట్రేషన్ జిల్లా మరియు సబ్-జిల్లా, హన్మకొండ, సెయింట్ పాల్స్ స్కూల్ దగ్గర, కంచరకుంట, ట్యాంక్‌బండ్ దగ్గర, వార్డు నెం.6, బ్లాక్ నెం.1, మునిసిపల్ కార్పొరేషన్ నెం. 6-1-209/జి/4 నందు రాయల్ టవర్స్ అపార్ట్‌మెంట్ నందు, బ్లాక్-ఎ నందు గ్రౌండ్ ఫ్లోర్‌లో 13-10-2012 తేదీగల దస్తావేజు నెం. 9408/12 ద్వారా **శ్రీ ఇమ్మడి కిరణ్, తండ్రి: సుధాకర్ పేరునగల** కామన్ ఏరియాతో కలుపుకొని 1085.0 చ॥అ॥ విస్తీర్ణములోని బాల్కనీ/బాల్కనీలతో పాటు అన్ని ఫిక్చర్ మరియు ఫిట్టింగ్స్ మరియు అన్ని హక్కుల అపార్ట్‌మెంట్ మరియు దానికి అనుబంధంగా ఫ్లాట్ నెం.4 మరియు మొత్తం 750 చ॥గ॥ లేదా 627.00 చ॥మీ॥ విస్తీర్ణముగల మొత్తం స్థలములో అవిభాజ్యపు భాగమైన 37.00 చ॥గ॥ విస్తీర్ణముగల స్థలముతో సహా యావదాస్తి. AP అపార్ట్‌మెంట్స్ (నిర్మాణం మరియు యాజమాన్యాన్ని ప్రోత్సహించడం) చట్టం 1987 సెక్షన్ (3)'d' లో నిర్వచించబడిన ఉమ్మడి ప్రాంత సౌకర్యాలలో చేరడం మరియు అవిభక్త ప్రకాశాలు మరియు ఆసక్తులతో సహా. కానీ అన్ని హక్కులను మినహాయించి, పేర్కొన్న అపార్ట్‌మెంట్ యొక్క పై అంతస్తులోని టెర్రస్‌లన్నింటిలో మరియు **"రాయల్ టవర్స్"** విక్రేత తనకు ఫ్లాట్ నెం.4 కు యజమానిగా మరియు అతని స్వంత హక్కులో ప్రత్యేకంగా రిజర్వ్ చేయబడింది. సాధారణ కారిడార్‌లు, మార్గాలు, మెట్లు, లిఫ్టులు మరియు నీరు, డ్రైనేజీలు, విద్యుత్ మొదలైనవి, ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంప్ మరియు సెప్టిక్ ట్యాంక్‌లతో సహా సరఫరా మరియు సహాయక వ్యవస్థలో ఉమ్మడి హక్కులు మరియు ప్రయోజనాలతో సహా పేర్కొన్న ఫ్లాట్‌కు జోడించబడ్డాయి. **దీనికి హద్దులు: తూర్పు:** యమ్.జోసెఫ్ యొక్క ఫ్లాట్ నెం.3 మరియు బాల్కానీ మరియు ఉమ్మడి గోడ; **పడమర:** శూన్యాకాశము, **ఉత్తరం:** ఫ్లాట్ నెం.5 మరియు ఉమ్మడి గోడ; **దక్షిణం:** శూన్యాకాశము.

పైన పేర్కొన్న రుణగ్రహీత(లు) మరియు / లేదా వారి హామీదారు (లు) ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి 60 రోజులలోపు బకాయి మొత్తాన్ని చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది. ఒకవేళ ఈ నోటీసు తేదీ నుండి 60 రోజుల గడువు ముగిసేలోపు మీరు బకాయి చెల్లించుటలో విఫలమైతే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(4) ప్రకారము నోటీసు యొక్క ప్రత్యామ్నాయ సేవ కోసం తదుపరి చర్యలు తీసుకోబడును.

తేది : 13.04.2026 — సం/- అధీకృత అధికారి
ప్రదేశము : హన్మకొండ — స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

# ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్ష



**సిద్ధిపేట బ్యూరో, మే 3 (నినాదం):** జిల్లాలో నీట్- 2026 పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. ఆదివారం రోజున జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. మొత్తం 937 మంది అభ్యర్థులకు గాను 916 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. 21 మంది గైర్ హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో నీట్ పరీక్షను జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. రెండు పరీక్ష కేంద్రాలలో సిద్దిపేట ఆర్డీఓ నేతృత్వంలోని, పగడ్బందిగా పోలీస్ సెక్యూరిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష విజయవంతంగా ముగిసిందని పరీక్ష నిర్వహణలో పాల్గొన్న అధికారులకు అందరికీ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.

# చెట్లు తొలగించి రాకపోకలు పునరుద్ధరణ

**సర్పంచుల తక్షణ స్పందన**






**కోదాడ,మే3(నినాదం):** అనంతగిరి మండలం బొజ్జగూడెం తండా గ్రామ శివారులో ఖమ్మం--కోదాడ రహదారిపై, అలాగే అనంతగిరి--శాంతినగర్--లక్కవరం మార్గంలో గాలి వాన కారణంగా చెట్లు కూలిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే గ్రామ సర్పంచులు గుగులోతు నీలాబాయి, వాడ కొప్పుల ఉమా లింగయ్య, మాజీ సర్పంచ్, సిపిఐ జిల్లా నాయకులు బద్దం కృష్ణారెడ్డి తక్షణమే స్పందించారు. జేసీబీల సహాయంతో చెట్లను తొలగించి రహదారిని క్లియర్ చేయించారు. దీంతో రాకపోకలు మళ్లీ సాధారణ స్థితికి వచ్చాయి.తక్షణ చర్యలతో సమస్యను పరిష్కరించిన సర్పంచులను గ్రామస్తులు ప్రశంసించారు.

# కల్వకుర్తిలో కో ఆప్షన్ లొల్లి



**కల్వకుర్తి మే 3 (నినాదం):** కల్వకుర్తి మున్సిపాలిటీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీలో ముసలం ఏర్పడ్డది, కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన కార్యకర్తలు అసంతృప్తిలో ఉన్నారు.మున్సిపాలిటీ విజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే అయితే కో ఆప్షన్ ఎన్నిక విషయంలో కాంగ్రెస్ పార్టీకి పనిచేసిన కార్యకర్తలకు కాకుండా కొత్తవారికి పదవులు కట్టబెట్టేందుకు కొంతమంది నాయకులు గుంపు కడుతున్నారని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సంవత్సరాల నుండి పనిచేస్తున్న కార్యకర్తల కాకుండా నిన్న మొన్న పార్టీలో చేరిన నాయకులకు పదవులను కట్టబెట్టడం సరైన పద్ధతి కాదని విమర్శిస్తున్నారు. ఇందులో భాగంగా కల్వకుర్తి మున్సిపాలిటీ 16వ వార్డుకు చెందిన ముస్లిం మైనార్టీ యూత్ మాట్లాడుతూ కో ఆప్షన్ పదవిని పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లేని పక్షంలో పార్టీ మారేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేస్తున్నారు .

## వడదెబ్బ మృతుల కుటుంబాలకు
# రూ. 4 లక్షల పరిహారం

### నిబంధనలపై అవగాహన ఉండాలి
### మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్ పాషా



**కొత్తగూడెం, మే 03(నినాదం):** జిల్లాలో భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్న తరుణంలో, వడదెబ్బ కారణంగా ప్రాణాలు కోల్పోయిన పేద కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ. 4 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేస్తుందని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యండీ. యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ ద్వారా అందే ఈ పరిహారం పొందాలంటే కొన్ని కీలక నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. వడదెబ్బతో వ్యక్తి మరణించిన వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో తప్పనిసరిగా పోస్టుమార్టం నిర్వహించాలని, మరణించిన రోజున వాతావరణ శాఖ రికార్డుల ప్రకారం ఆ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని స్పష్టం చేశారు. చనిపోయిన బాధితుని ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం రిపోర్ట్, మరణ ధృవీకరణ పత్రం, వారసుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంక్ వివరాలతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేసి నివేదికను జిల్లా కలెక్టర్ కు పంపడం జరుగుతుందని అనంతరం కలెక్టర్ ఆమోదంతో నేరుగా నామినీ ఖాతాలో నగదు జమ అవుతుందని వివరించారు. గతంలో ఈ పరిహారం 50,000 లు ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం దీన్ని 4 లక్షలకు పెంచడం జరిగిందని, అర్హులైన ఏ ఒక్కరూ సమాచార లోపం వల్ల నష్టపోకుండా ఈ పథకంపై క్షేత్రస్థాయిలో అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఈ పథకం పట్ల వివరాలకై 8520860785 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

## ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న
# సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి



**కల్వకుర్తి మే 3 (నినాదం):** తలకొండపల్లి మండలం, చౌదర్పల్లి గ్రామం హను మాన్ దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహో త్సవ కార్యక్రమానికి హాజ రైన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్ర మంలో పాల్గొని, స్వామి దర్శనం చేసుకొని, తీర్థ స్వీకరించడం జరిగింది,అనంతరం మాట్లాడుతూ ఆధ్యాత్మి కమైన, పవిత్రమైన ఇంత గొప్ప కార్యక్ర మానికి తనను ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ, స్వామి వారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ పాడి పంటలతో, సుఖ సంతోషాలతో, ఆయురా రోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,ఆలయ కమిటీ సభ్యులతో పాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిజేపి నెక్స్ టార్గెట్ తెలంగాణ

### తెలంగాణలో కేసీఆర్ శకంముగిసింది
### ఎంపీ ధర్మపురి అరవింద్



**నిజామాబాద్ ప్రతినిధి, మే 3 (నినాదం) :** బిజేపికి నెక్స్ టార్గెట్ తెలంగాణ అని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎంపీ అర్వింద్ విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఇటీవల జగిత్యాలలో జరిగిన బిఆర్ఎస్ సభకు ఐదారు వేల మంది మించి జనాలు లేరని జీవన్ రెడ్డిని ఎందుకుపార్టీ చేర్చు కున్నారో కెసిఆర్ కె తెలియదన్నారు. జగిత్యాల ప్రజలు అయోమయానికి గుర వుతున్నారు. కేసీఆర్ శకం ముగిసింద న్నారు. తెలంగాణ ప్రజలని మత్తుకు బానిసలను చేసింది కేసీఆర్ ప్రభుత్వ మని, వచ్చే ఎన్నికల్లో బిఅర్ ఎస్, కాంగ్రెస్ కొట్టుకుపోతాయని జోస్యం చెప్పారు.ధాన్యం కొనుగోళ్లలో రేవంత్ సర్కార్ ఫెయిల్. రేవంత్ పరిపాలన ఫెయిల్. పాలనపైరేవంత్ కు అవగాహన లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ రేవంత్ మర్చిపోయారు అనిఅరవింద్ అన్నారు. మహిళా రిజర్వేషన్లు కాంగ్రెస్ అడ్డుకున్నా మహిళలు మోసం చేసిందని గుర్తు చేశారు. జిల్లాలో '8 లక్షలమెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరగాలి ఇప్పటి వరకు 2 లక్షల మెట్రిక్ టన్నులు కూడాసెకరించలేదని అన్నారు. ఉచిత రేషన్ కేంద్రం ఇస్తుంది. అదే మాదిరిగా ప్రతి ధాన్యంగింజను ఎఫ్ సి ఐ కొంటుంది అన్నారు. పసుపు రైతులకు అధిక ధరలు రావడానికికారణం మోడీయే.ధాన్యం కొనుగోల్లాలో జాప్యం జరుగుతుంటే జిల్లాకు చెందిన ప్రభుత్వ సలహాదారులుఏం చేస్తున్నారు అని ప్రశ్నించారు. తెలంగాణలో రూ.7800 కోట్ల అభివృద్ధి పనులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కోసం మోదీ రాష్ట్రానికి వస్తున్నారు దానిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఐదు రాష్ట్రాలలో బీజేపీ గెలుస్తుందని సోమవారం వెలువడే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు బిజెపి గెలుస్తుందని మోడీసభ జిల్లా ప్రభారీ, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు.దేశ ప్రజలు మోదీ నాయకత్వంలో భద్రత ఫీల్ అవుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మోదీ తెలంగాణ పర్యటన సాగుతుందని ..ఈ నెల 10జరిగే మోడీ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ విలేఖరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ, జిల్లా అధ్యక్షుడు కుల చారి దినేష్, కార్పొరేటర్ స్రవంతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పంచముఖి సంఘం అభివృద్ధికి తోడ్పాటునందిస్తా



**నిజామాబాద్ ప్రతినిధి, మే 3 (నినాదం) :** పంచముఖి మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని 6 వ డివిజన్ కార్పొరేటర్ స్రవంతి రెడ్డి అన్నారు. ఆదివారం నిజామాబాద్ నగరంలోని వినాయక నగర్ పంచ ముఖి మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సంఘం భవనంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇటీవల 6 డివిజన్ కార్పొరేటర్ గా ఎన్నికైన స్రవంతి రెడ్డి, పదోన్నతి పొందిన సంఘ సభ్యులు చిట్టి నారాయణ రెడ్డి, స్వర్ణ లత లను శాలువ పూల మాలతో ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మిద్దె రవికుమార్, దారం పోతున్న లు మాట్లా డుతూ..సంఘం అభివృద్ధి కోసం నిధులు కేటాయిం చాలని కోరారు. సంఘం వరకు సీసీ రోడ్డు వేయాలని కోరారు. పంచముఖి మున్నూరు కాపు సంఘం తరపున పదోన్నతి పొందిన సభ్యులను, పదో తరగతి, ఇంటర్‌లలో ప్రతిభ చాటిన సభ్యుల పిల్లలను సన్మా నించనున్నామని మొదట గౌరవించుకోవలసిన బాధ్య త తమపై ఉన్నందున, ఈ ఉద్దేశంతోనే పదోన్నతి పొందిన చిట్టి నారాయణరెడ్డి, నగుర్త స్వర్ణ లత-రాజేందర్ లను సన్మానించుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్రవంతి రెడ్డి మాట్లాడు తూ.. ఆరో డివిజన్ లో భారీ మెజారిటీ అం దజేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. డివిజన్ అభివృద్ధితోపాటు ఎన్నికల్లో సహాయ సహ కారాలు అందించిన సంఘాలకు నిధులు కేటాయిస్తా మన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ లతో మాట్లాడి నిధులు అందేలా చూస్తామన్నారు. సంఘం వరకు సిసి రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యేలా చూస్తాననన్నారు. పంచముఖి మున్నూరు కాపు సంఘం ఐక్యత బాగుంటుందని తాను విన్నానని, ఈ రోజు సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేసిన పంచముఖి మున్నూరు కాపు సంఘం సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నా మన్నారు. కోశాధికారి కర్క రమేష్, గౌరవ అధ్యక్షులు ఆకుల శ్రీశైలం, ముఖ్య సలహాదారు చిట్టి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్ష

### -నీట్ పరీక్షకు 911 మంది అభ్యర్థుల హాజరు



**గద్వాల బ్యూరో మే 3( నినాదం):** జోగులాంబ గద్వాల జిల్లాలో నీట్ పరీక్షను ఆది వారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. గద్వాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాలలతో పాటు బాలుర, బాలికోన్నత పాఠశాలలలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాల్లో పరీక్షను సజావుగా నిర్వహించారు. మొత్తం 930 మంది అభ్యర్థులకు గాను 911 మంది పరీక్షకు హాజరైనట్లు నీట్ సిటీ కోఆర్డినేటర్ దేవేందర్ రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు అనుమతి ఇవ్వడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ, విద్యాశాఖ సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహించగా అభ్యర్థు లను మధ్యాహ్నం 1:30 గంటల వరకు కేంద్రా ల్లోకి అనుమతించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తమ పోలీసు బృందంతో ఆయా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును నియమించారు. బాలికల జూనియర్ కళాశాల కేంద్రాన్ని ఎస్పీ స్వయంగా పర్యవేక్షించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి నీట్ పరీక్షను విజయవంతం చేసినట్లు ఈ సందర్భంగా సిటీ కోఆర్డినేటర్ తెలిపారు.అదనపు ఎస్పీ శంకర్, డీఎస్పీ మొగిలయ్య, ముఖ్య పర్యవేక్షకులు వీరన్న, కృష్ణ, జహీరుద్దీన్, రేణుకా దేవి, పరిశీలకులు, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అధికారులు, తదితరులు పరీక్షను సజావుగా నిర్వహించేందుకు విధులు నిర్వహించారు.

## ఎవరెస్ట్ శిఖరాగ్రాన.. ఎదిగిన 'మమకారం'



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మే03 (నినాదం)** సాధారణంగా ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన వారు తమ దేశ జెండానో, లేక తమ విజయానికి గుర్తుగా ఏదైనా చిహ్నాన్నో అక్కడ ఉంచుతారు. కానీ, ఒక పర్వతారోహకుడు మాత్రం తాను ప్రపంచం గర్వించే స్థాయికి చేరడానికి నిచ్చెనగా నిలిచిన ఒక 'మమకారం' ఉన్న మనిషి ఫోటోను అక్కడ ఎగురవేశాడు. ఆ దృశ్యం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడమే కాకుండా, మానవ సంబంధాల గొప్పతనాన్ని చాటిచెబుతోంది.గురువుకు శిష్యుడి 'శిఖర సమాన' గౌరవం.. నిరుపేద కుటుంబంలో పుట్టి, కనీసం సరైన వసతులు లేని స్థితిలో ఉన్న మోతీ కుమార్ అనే పర్వతారోహకుడి ప్రతిభను గుర్తించి, అతని ఎదుగుదలకు తోడ్పాటునందించారు భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఎంవీఐ), తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సంఘం వెంకట పుల్లయ్య. మోతీ కుమార్ పర్వతారోహణలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులను తనవిగా భావించి, అతనికి వెన్నుదన్నుగా నిలిచిన వెంకట పుల్లయ్య - విజయలక్ష్మి దంపతుల ఫోటోను మోతీ కుమార్ ఎవరెస్ట్ శిఖరంపై ప్రదర్శించి తన కృతజ్ఞతను చాటుకున్నాడు.

## నిరుద్యోగ యువత ఉచిత శిక్షణ కేంద్రాలను వినియోగించుకోవాలి

### -ఆరవ ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రం ప్రారంభించిన సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి



**కల్వకుర్తి మే 3 (నినాదం):** వెల్దండ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లో నిర్వహిస్తున్న ఉచిత ఎస్ఐ కానిస్టేబుల్ శిక్షణ తరగతులను ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ యువతలో ఉన్న ప్రతిభను బయటకు తీసుకురావడానికి అవకాశాలే కీలకమని అన్నారు.అవకాశాల కొరత వల్ల ఎన్నో వారి లక్ష్యాలు మధ్యలోనే ఆగిపోతున్నాయని,డబ్బులేక చదువు ఆగకూడదు, కోచింగ్ లేక ఎంచుకున్న లక్ష్యాలకు దూరం కాకూడదు అనే సంకల్పంతోనే ఈ ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు,ఈ కేంద్రంలో విద్యార్థులకు సబ్జెక్ట్ బోధనతో పాటు స్టడీ మెటీరియల్, ఫిజికల్ ట్రైనింగ్, పరీక్షల ప్రిపరేషన్ అందిస్తామని చెప్పారు, పోలీస్ ఉద్యోగం సాధించాలంటే క్రమశిక్షణ, శ్రమ, నిబద్ధత అత్యవసరమని సూచించారు,"మీ విజయం మీ కుటుంబానికి గర్వకారణం కావాలి,మీ సాధన మీలాంటి ఎంతో మంది యువతకు స్ఫూర్తిగా నిలవాలి అని సూచించారు,అనంతరం అతిథులు మాట్లాడుతూ ఇలాంటి ఉచిత శిక్షణ కేంద్రాలు గ్రామీణ యువతకు మార్గద ర్శకంగా నిలుస్తాయని,ప్రత్యేకంగా పేద కుటుంబాల విద్యార్థులకు ఇది ఒక గొప్ప అవకాశం అని,పట్టణ ప్రాంతాలకు వెళ్లకుండా ఆర్థిక ఇబ్బందులను గుర్తించి, మారుమూల గ్రామీణ ప్రాంత యువతకు తమకు దగ్గరగా అందుబాటులోకి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెచ్చిన ఉచిత పోలీస్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని,అందరికి ఆదర్శంగా నిలవాలని సూచిస్తూ,గ్రామాలు తండాలో స్థితిగతులను అర్థంచేసుకుని శిక్షణ శిక్షణ తరగతుల సౌకర్యాన్ని ఉచితంగా అందిస్తున్న సుంకిరెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు,విద్యార్థులు మాట్లాడుతూఇలాంటి కోచింగ్ కోసం నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు అదే తమ ప్రాంతంలో అందుబాటు లోకి రావడం చాలా ఉపశమనం కలిగించిందన్నారు,ఈ అవకాశాన్ని వినియోగించుకుని తప్పక ఉద్యోగం సాధిస్తామని తెలుపుతూ, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు,ఈ కార్యక్రమంలోసర్పంచ్ కు గన్య నాయక్, రవీందర్,రమేష్ నాయక్,ఉప సర్పంచ్ విజయ్,మాజీ సర్పంచ్ లు నారాయణ,పంతుల నాయక్ లతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### మానవ సేవే మాధవ సేవ
## అని బాధితునికి ఆర్థిక సహాయం

### -జాజాల బిక్షపతి ని పరామర్శించిన కౌన్సిలర్ పాపిశెట్టి రాము



**కల్వకుర్తి మే 3 (నినాదం):** ఆమనగల్లు పట్టణానికి చెందిన నాయి బ్రాహ్మణ సేవ సంఘం నాయకులు తొమ్మిదో వార్డులో నివాసం ఉంటున్న జాజాల బిక్షపతి గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము బిక్షపతి నివాసానికి చేరుకొని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని అండగా ఉంటా అధైర్య పడొద్దు అని భరోసా కల్పించారు. 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సమాజంలో సేవ చేయడం గొప్ప అవకాశం అని పేద ప్రజలకు సేవ చేయడం మానవ సేవే మాధవ సేవ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో,శ్రీను నాయక్, రాకేష్ కుటుంబ సభ్యులు ఉన్నారు.

## 4నుంచి అలంపూర్ చౌరస్తాలో ప్రజావాణి



**గద్వాల బ్యూరో మే 3 ( నినాదం):** అలంపూర్ చౌరస్తా వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో ప్రతి సోమవారం ఆర్డీఓ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించను న్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి ఉంటుందని,అన్ని శాఖలకు చెందిన డివిజన్ స్థాయి అధికారు లందరూ అందుబా టులో ఉంటారని వివరించారు.ఈ కార్యక్రమం సజావుగా నిర్వహణ కోసం అలంపూర్ డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్ రెడ్డి మరియు ఉండవెల్లి డిప్యూటీ తహసీల్దార్ జి. వెంకట రమణలను పర్యవేక్షణ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. ప్రజల ఫిర్యాదులను సిజిజి ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి,అంగీకార పత్రం ఇవ్వ డం మరియు సంబంధిత శాఖలకు పంపించే ప్రక్రియను వీరు పర్యవేక్షిస్తారని తెలిపారు. సంబంధిత డిప్యూటీ తహసీల్దార్లు తమ మం డలాల నుంచి కంప్యూటర్ ఆపరేటర్లను నియమించి వివరాలు వెంటనే తెలియజేయాలని సూచించారు. అలంపూర్, ఉండవెల్లి తహసీల్దార్లు కార్యక్రమం కోసం కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇం టర్నెట్, స్టేషనరీతో పాటు ప్రజలకు నీడ, కూర్చునే సౌకర్యం మరియు తాగునీరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ విభాగాలకు చెందిన డివిజన్ స్థాయి అధికా రులను తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరు చేయాలని,వారు ప్రజల ఫిర్యాదులను స్వీకరించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి ఫిర్యాదుపై చర్యల నివేదికలు, మధ్యంతర సమా ధానాలు మరియు తుది నివేదికలను గరిష్టంగా 30 రోజుల లోపు పోర్టల్‌లో నమోదు చేయడం తప్పనిసరి అని ఆదేశించారు.

## మండలంలో పలు శుభకార్యాలకు హాజరైన కాంగ్రెస్ నాయకులు



**మధిర, మే 3(నినాదం):** ఆదివారం మధిర మండలం, ఖమ్మంపాడు గ్రామానికి చెందిన సైదులు, కాసింబి దంపతుల కుమారుడు భాషా, అమిద ల వివాహ వేడుకకు శ్రీరస్తు కళ్యాణమండపం నందు జరుగగా నూతన దంపతులను ఆశీర్వదించిన మధిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, నాయకు లు కర్నాటి రామారావు, అద్దంకి రవికుమార్, నిడమానూరు వంశీ తదితరులు. అనంతరం మధిర పట్టణానికి చెందిన రిటైర్డ్ అధ్యాపకులు లింగంపల్లి అప్పారావు దంపతుల మనుమళ్లు చిరంజీవిలు శ్రవణ్ కుమార్, లోహిత్ కుమార్ పంచల వేడుకకు మధిర రిక్రియేషన్ క్లబ్ లో హాజరై చిన్నారులను ఆశీర్వదించడం జరిగింది. తదనంతరం వంగవీడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బొగ్గుల జనార్దన్ రెడ్డి దేవతా మొక్కులు నిమిత్తం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగా హనుమంతరావు, జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిడమానూరు వంశీకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, రావిరాల సత్యనారాయణ, మీడియా మిత్రులు పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు, మధిర ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి మహంకాళి వెంకట శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షులు నకిరేకంటి గోవింద్, గడ్డం మల్లికార్జునరావు, గాలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేయండి..

**పాలేరు మే 03( నినాదం):** పాలేరు నియోజకవర్గం కూసు మంచి మండలం ను ఎడ్యుకేషనల్ హబ్ గా తీర్చిదిద్దండి.బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి ట్రిపుల్ ఐటీ క్యాంపస్ దగ్గరలో లేకపోవడం వలన ఇక్కడి బడుగు బలహీన వర్గాల, ఎస్సీ, ఎస్టీ మరియు పేద ప్రజల విద్యార్థులు దూరభారం కావడంతో తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. కొంత మంది విద్యార్థులు చదువులో అత్యు త్తమ ప్రతిభ కలిగిన, బాసర వంటి ప్రాంతాలకు వెళ్లలేక ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు అని,పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండల కేంద్రంలో ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేయడంతో పాటు మండల కేంద్రంలో ఉన్న వివిధ సమస్యలు త్వరితగతిన పరిస్కంచాలి అని ఈ రోజు కూసుమంచి మండల కేంద్రం లో ప్రజా దర్బార్ సమావేశంలో గౌరవ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి వినతి ఇవ్వడం జరిగింది.

1.బస్ స్టాండ్ నిర్మాణం చేపట్టండి.
ఇందిరమ్మ ఇళ్ల కమిటీ లు రద్దు చేసి, సర్పంచ్ మరియు పాలక వర్గ సభ్యులకు ఎంపిక ప్రక్రియ ఇవ్వండి
2.ప్రజావాణి కార్యక్రమంలో వినతులు పరిష్కారం చేయండి
3.కూసుమంచి మండల కేంద్రంలో నిర్మించిన క్రీడా ప్రాంగణం అందు బాటులోకి తేవాలి.

### రైతు సంఘాల ఆధ్వర్యంలో
## కల్లాల సందర్శన



**మధిర, మే 3 (నినాదం):** సిపిఎం, బి ఆర్ ఎస్, సిపిఐ ఎంఎల్ పార్టీల రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ముదిగొండ లోని మొక్కజొన్న మరియు ధాన్యం కల్లాలను రైతు ప్రతినిధులు సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేయాలని, కొనుగోలులో 26 క్వింటాల నిబంధనలు ఎత్తివేయాలని, ట్రక్ షీట్ పేరుతో కాలయాపన చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, లారీ వెయిటింగ్ చార్జి ఒక్కటికే 30 రూపాయలు వసూలు చేయటం రైతులకు అదనపు భారం పడుతుందని అన్నారు. వర్షం వస్తే మొక్కజొన్నలు తడుస్తాయని ఆందోళనతో రైతులు ఉన్నారని, రైతులకు సరిపడా సంచులు అందక, ఒకపక్క సరియైన సమయానికి లారీలు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దివాలా తీసిన మొక్కజొన్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘాల ప్రతినిధులు , జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, బట్టు పురుషోత్తం, కందుల భాస్కరరావు, కోలేటి ఉపేందర్ రావు, చెరుకూరు ఉపేందర్ (సిపిఎం) తోట ధర్మారావు, కోటి అనంత రాములు, కొమ్మూరి రమేష్, మల్లేపల్లి శంకర్, పోనుకుల కోటేష్ యాదవ్, బంక మల్లయ్య, కొత్తపల్లి నాగార్జున (బి ఆర్ ఎస్) రావులపాటి శ్రీనివాసరావు, ఇరుకు శ్రీకాంత్ (సిపిఐ) తదితర బృందం సందర్శించారు. అలాగే ముదిగొండ సొసైటీలో ఆన్లైన్లో జరుగుతున్న జాప్యం పై రైతులతో మాట్లాడారు. అలాగే రేపు కలెక్టర్ కార్యాలయం వద్దకు నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని, ఉదయం 9 గంటలకు జడ్పీ సెంటర్ నుండి రైతు సంఘాల ప్రతినిధులు హాజరై ద్విచక్ర వాహనాల ద్వారా నల్ల కండువాలు ధరించి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు చేరుకొని అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందని, ప్రతి పార్టీ రైతు సంఘం నుండి ప్రతినిధులు ఐదుగురు తగ్గకుండా ఒక్కొక్క మండలం నుండి హాజరు కావాలని ఈ సందర్భంగా రైతులను కోరడం జరిగింది

## దోరకుంటలో మసీదు పై పిడుగు

**కోదాడ,మే3(నినాదం):** కోదాడ మండలం దోరకుంట గ్రామంలో గాలి వానతో కూడిన వాతావరణంలో మసీదు పై పిడుగు పడింది. ఈ ఘటనలో పిడుగు ప్రభావానికి మసీదు మినార్ కొంత భాగం తెగిపడి నష్టం వాటిల్లింది.ఒక్కసారిగా శబ్దం రావడంతో గ్రామంలో కొంతసేపు భయాందోళన నెలకొంది. అయితే అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని స్థానికులు తెలిపారు. ఘటన అనంతరం గ్రామస్థులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

### నూతన వివాహ జంటలను
## ఆశీర్వదించిన మల్లిబాబు యాదవ్



**ఖమ్మం, మే 03(నినాదం):** ఖమ్మం రూరల్ మండలం మంగళ గూడెం గ్రామ సర్పంచ్ మేకల సత్యనారాయణ యాదవ్- నాగమణి దంపతుల కుమారుడు మనోజ్ యాదవ్ -రమ్యశ్రీ( వరంగల్ జిల్లా నెక్కొండ మండలం తోపన పెల్లి గ్రామానికి చెందిన వర్రె సాయిలు- సుజాత దంపతుల కూతురు ) ల వివాహం మంగళ గూడెం లోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఘనంగా జరిగింది. మరియు ఖమ్మం కార్పొరేషన్ 15వ డివిజన్ కొత్తగూడెం కు చెందిన మాజీ నీటిపారుదలసంఘం అధ్యక్షులు యర్రబోయిన శ్రీను - రేణుక దంపతులకుమారుడు యశ్వంత్ - విశ్వంతి( ఖమ్మం నగరం 15వ డివిజన్ కొత్తగూడెం కు చెందిన మరి మేకల ఉపేందర్ రావ్, గోపమ్మ దంపతుల కూతురు ) ల వివాహం కొత్తగూడెంలో జరిగింది. ఈ వివాహ కార్యక్రమాలలో మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని నూతన వధూవరుల జంటలకు అక్షింతలు వేసి కలకాలం చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తంగెళ్ల సాయి కృష్ణ శృతి మొరిమేకల కోటయ్య,సత్తి వెంకన్న,పొదిలి భూపతి, బంధుమిత్రులు మరియు తదితరులు పాల్గొన్నారు.

### మధిర రైతు వేదికలో
## రైతు వారోత్సవాలు

**మధిర, మే 3 (నినాదం):** తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో (99 రోజుల యాక్షన్ ప్లాన్) భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 04-5-2026 నుండి 09-5-2026 వరకు రైతు వారోత్సవం కార్యక్రమాలు నిర్వహిం చడం జరు గుతుంది. ఇందులో భాగంగా 04-5-2026 న ఉదయం 10 గంటలకు మధిర రైతు వేదిక నందు రైతు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా 1. నేల ఆరోగ్యం 2. సమగ్ర పోషక నిర్వహణ 3. ప్రకృతి వ్యవసాయం 4. వరిలో విత్తన రకాలు ఎంపిక పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుంది కాబట్టి ఈ కార్యక్రమానికి రైతులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని వినియోగించవలసిందిగా కోరుచున్నాము.

# అనాదిగా బీసీలకు అన్యాయం జరుగుతూనే ఉంది

**దానం నాగేందర్**
**మున్నూరు కాపు ఆత్మ గౌరవ భవన భూమిపూజ**





**హైదరాబాద్, మే3 (నినాదం):** అనాధిగా బీసీలను విభజించు పాలించు ధోరణిలోనే అగ్రవర్ణ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని మాజీ మంత్రి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు,గత ప్రభుత్వం కోకాపేటలో మున్నూరు కాపుల కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో ఆత్మ గౌరవ భవన భూమి పూజ నిర్వహించారు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో జరిగిన భూమి పూజ కార్యక్రమంలో దానం నాగేందర్ మాట్లాడుతూ బీసీలు కులాల వారిగా విడిపోతూ ఆయా కుల వర్గాల్లోనే గ్రూపులుగా విడిపోవడం వల్ల బీసీ వర్గాలు ఆయా కులాలకు చాలా నష్టం జరుగుతుందని ఇది అందరూ గ్రహించాలన్నారు, రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న మున్నూరు కాపులను అతి స్వల్పంగా చూపించడంలో లోపం ఎక్కడుందో గ్రహించాలన్నారు, కోకాపేటలో నిర్మించే భవనం భవిష్యత్ తరాలకు గొప్ప ఉపాధి సెంటర్ గా మారాలన్నారు, చాలామంది పేద కులస్తులు తమ పిల్లలను పట్టణాలకు పంపించలేక చదువులు మానేపిస్తున్నారని భవనం నిర్మించి విద్యార్థులకు మంచి హాస్టల్ వసతి కల్పించి గొప్ప విద్యావంతులను తయారు చేయాలన్నారు, మనలో ఐక్యమత్య లోపం వల్లే జనగణనలో మన సంఖ్య చాలా తగ్గించి చూపించారని జరిగిన తప్పిదాన్ని గుర్తించి సరిదిద్దాలన్నారు, గత ప్రభుత్వం స్థలం మంజూరు చేసి ఐదు కోట్ల కేటాయించినప్పటికీ నిధులు విడుదల చేయలేదని ఇటీవల తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి 20 కోట్లు కేటాయించాలని చెప్పానని అందుకు ఆయన సూత్రప్రాయంగా అంగీకరించారని త్వరలో ముఖ్యమైన నాయకులతో కలిసి మరోసారి ముఖ్యమంత్రిని కలుద్దాం అన్నారు, కార్యక్రమంలో వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ భవన నిర్మాణం కోసం ట్రస్ట్ బోర్డు సాయాశక్తుల కృషి చేస్తుందని అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు, కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మెదక్ పార్లమెంట్ సభ్యులుగా పోటీచేసిన గాలి అనిల్ కుమార్ మరో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పట్నం పురుషోత్తం రావు, రాష్ట్ర బోర్డు కార్యదర్శి రౌతు కనకయ్య, సభ్యులు మంగళారపు లక్ష్మణ్,తూడి ప్రవీణ్, పన్నాల విష్ణువర్ధన్,రమేష్ హజారి, మున్నూరు కాపు సంఘం తెలంగాణ ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య కోశాధికారి సత్యనారాయణ మహిళా అధ్యక్షురాలు బండి పద్మ, రాష్ట్రంలోని వివిధ సంఘాల ప్రతినిధులు వ్యాపార వాణిజ్య వేత్తలు పెద్ద పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# బయో సైన్స్ టీచర్ జాడ ఏది!

**రెండేళ్లుగా సబ్జెక్ట్ టీచర్ ఊసే లేదు**
**బై పోస్ట్ తో కాలయాపన**
**ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు**




**అమరచింత, మే3 (నినాదం):** ఆత్మకూరు పట్టణంలో గవర్నమెంట్ హై స్కూల్ నందు బయోసైన్స్ టీచర్ లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఒకప్పుడు ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన గవర్నమెంట్ హై స్కూల్ ఆత్మకూర్ నేడు బయోసైన్స్ టీచర్ లేక జిల్లా ర్యాంకుల్లో చివరి వరుసలో నిలుస్తుంది. ప్రతి సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో గవర్నమెంట్ హై స్కూల్ ఆత్మకూర్ చివరి స్థానంలో గత రెండేళ్లుగా నిలుస్తుంది. దానికి గల ప్రధాన కారణం అందుబాటులో లేని బయోసైన్స్ టీచర్ పోస్ట్ వల్ల. 2025 లో విద్యార్థులు సైన్స్ సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారు. 2026 లో కూడా ఏడుగురు విద్యార్థులు సైన్స్ సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారు. ఎన్నోసార్లు ఇట్టి విషయమై న్యూస్ పేపర్ కి వచ్చిన అధికారుల్లో చలనం లేకుండా పోయింది. బయో సైన్స్ టీచర్ పోస్టు ఖాళీగా ఎందుకు ఉందని గవర్నమెంట్ హై స్కూల్ ఆత్మకూర్ హెడ్మాస్టర్ మద్దిలేటి గారిని వివరణ కోరగా, కొత్తకోటలో గల గవర్నమెంట్ హై స్కూల్ కొత్తకోట నందు ఇద్దరు బయోసైన్స్ టీచర్ల స్థానంలో ముగ్గురు టీచర్లు పనిచేస్తున్నారు. అందులో ఒకరు బై పోస్టు తెచ్చుకొని గవర్నమెంట్ హైస్కూల్ ఆత్మకూరు కి రాకుండా కాలయాపన చేస్తున్నారనీ తెలిపారు. ఇట్టి విషయమై ఎన్నోసార్లు జిల్లా అధికారులకు బయో సైన్స్ టీచర్ పోస్టు సర్దుబాటు గురించి విన్నవించుకున్న ప్రయోజనం లేకుండా పోయిందని తెలిపారు. విద్యార్థులకు బయోసైన్స్ టీచర్ అందుబాటులో లేక మండలంలో గల వేరే స్కూల్ టీచర్లని రిక్వెస్ట్ చేసి క్లాసులు చెప్పించాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు కళ్ళు తెరిచి వెంటనే బయోసైన్స్ టీచర్ పోస్టు ఆత్మకూరులో సర్దుబాటు చేయగలరని ఆత్మకూరు పట్టణం వాసులు కోరుతున్నారా. ఒకప్పుడు ఎందరో విద్యార్థులను అద్భుతంగా తీర్చిదిద్దిన ఈ పాఠశాల ఇలా జిల్లాలో చివరి స్థానంలో నిలవడం బాధాకరమని తెలిపారు. వెంటనే జిల్లా విద్యాధికారులు ఈ సమస్య పైన దృష్టి పెట్టి తగు నిర్ణయం తీసుకోగలరు ఆత్మకూరు పట్టణవాసులు కోరుతున్నారు.

# వాసవి క్లబ్ సేవలు పేద ప్రజలకు మరింత చేరువుగా తీసుకెళ్తాం

**వాసవి క్లబ్ వైస్ గవర్నర్ రాయపూడి భవాని**




**మిర్యాలగూడ మే 2 (నినాదం ):** వాసవి క్లబ్ సేవలు పేద ప్రజలకు మరింత సేవ చేసే విధంగా ముందుకు తీసుకు వెళ్తామని వాసవి క్లబ్ వైస్ గవర్నర్ రాయపూడి భవాని అన్నారు. ఆదివారం స్థానిక అసోసియేషన్ భవనంలో హైదరాబాద్ కు చెందిన శ్రీకర హాస్పిటల్స్ సహకారంతో వాసవి క్లబ్ లు ఏర్పాటు చేసిన ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం అవసరమని అందుకు సేవా సంస్థలు ముందుకు వచ్చి ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీకర హాస్పిటల్ రోబోటిక్ ఆర్థోపెడిక్ సర్జన్ రాకేష్ కొమరవెల్లి వైద్య శిబిరంలో సమస్యలతో వచ్చిన వారికి తగు సూచనలు ఇచ్చి అవసరమైన వారికి ఇతర పరీక్షల నిమిత్తం సలహాలు ఇచ్చారు. ఈ శిబిరంలో సుమారు 300 మంది కి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిలుకూరు బాలకృష్ణ,గుడిపాటి నవీన్,జిల్లా గవర్నర్ వీరవల్లి సతీష్,తెడ్ల జవహర్ బాబు ,ఉప్పల విద్యాసాగర్, వీరవల్లి పద్మావతి, తిరునగరు పద్మావతి, లకుమారపు పాండురంగయ్య, నవీన్, సోమ వెంకటేశ్వర్లు, రీజియన్ కు చెందిన 9 వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ప్రతినిధులు హాజరయ్యారు

# అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కోసం ఆదివాసీల తరలింపును మానుకోవాలి

**మానవ హక్కుల వేదిక , దళిత బహుజన ఫ్రంట్ సంస్థలకు చెందిన ఆరుగురు సభ్యుల బృందం శ్రీశైలం టైగర్ రిజర్వ్ విస్తాపన విషయంలో 2026 మే 3 వ తేదీన నిజనిర్ధారణ చేపట్టింది**



**నాగర్ కర్నూల్,** నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతం కోసం జరుగుతున్న విస్తాపన, దానికి సంబంధించి జరుగుతున్న ప్రచారంలో ఉన్న అసత్యాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. సార్లపల్లి గ్రామ పంచాయతీ, దాని పరిధిలోని కుడిచింతలబయలు మరియు తాటిగుండల పెంట, వటవర్లపల్లి పంచాయతీ, కొల్లంపెంట గ్రామాలు మొదటి విడతలో విస్తాపనకు గురి అవుతున్నాయి. ఆ విస్థాపనకు ఆదివాసి తెగలే స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారన్న ప్రచారం రెవెన్యూ, అటవీ శాఖలు ముమ్మరంగా చేస్తున్నాయి. ఇప్పటికే స్వగ్రామం వదిలి పట్టణంలో స్థిరపడ్డ అది కొద్ది మంది ఆదివాసీలు తప్ప, దాదాపు ఆదివాసి, గిరిజనులెవ్వరూ వారి స్వగ్రామాలను వదిలి, అక్కడికి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న బాచారం వంటి మైదాన ప్రాంతాల్లోకి వెళ్ళటానికి సిద్ధంగా లేరు. ఈ మధ్య తాము తరలివెళ్లడానికి సిద్ధం అని తీసిన ర్యాలీ లో పాల్గొన్నది సార్లపల్లి సర్పంచ్ భర్త తప్ప మిగతావారంతా గిరిజనేతరులే. గత యాభై సంవత్సరాలుగా పులికీ మనుషులకు మధ్య అక్కడ ఏ ఘర్షణా జరగ లేదు. పులి వెళ్ళే దారులు, పులి అలవాట్లు చెంచులకు సాంప్రదాయ పరంగా వచ్చిన జ్ఞానం. ఇది పులికి మనిషికి మధ్య ఒక రక్షణ కవచాన్ని ఏర్పాటు చేస్తుంది. పులులను పెద్దమ్మ తల్లిగా కొలుస్తామని, తామెన్నడూ పులులకు హాని చేయలేదని, చేయమని ఆదివాసులు ముక్తకంఠంతో చెబుతున్నారు. పులుల సంరక్షణ కోసమని మా జీవించే హక్కుకూ , గౌరవానికీ విలువ ఇవ్వకుండా, మా జీవితాలను చిన్నాభిన్నం చేసే ఈ తరలింపుకు మేము వ్యతిరేకమని చెంచు ఆదివాసిలు ప్రకటిస్తున్నారు. అలా తరలించటం వల్ల షెడ్యూల్డ్ ప్రాంతపు మా హక్కులను కోల్పోతామని, అటవీ ఫలసాయాన్ని పొందే హక్కును, పశువుల మేతకు ఉపయోగపడే అడవిని కోల్పోతామని అంటున్నారు. ఇప్పటికే చాలా కుటుంబాలకు తగినంత వ్యవసాయ భూమి ఉంది. దాని ద్వారా పొందే ఆదాయాన్ని కోల్పోతామని, కొత్త ప్రాంతంలో మాకు ఉపాధి కూడా దొరకక అన్యాయం అయిపోతామని ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి చెంచు ఆదివాసి తెగ కేంద్ర ప్రభుత్వమే ప్రకటించిన పీవిటిజి తెగకు చెందిన అట్టడుగు వర్గపు ఆదివాసీ తెగ. అంతరించిపోవటానికి సిద్ధంగా ఉన్న ఇటువంటి తెగ ప్రజలకు ప్రత్యేక సంరక్షణ అందించాల్సింది పోయి, ఈ రకమైన విధానాలకు పాల్పడటం విచారకరం. అటవీ అధికారులు అక్రమ పద్ధతిలో గ్రామసభ తీర్మాలను చేయిస్తూ, గిరిజనేతరులను కూడగడుతూ, తరలింపుకు అందరూ సిద్ధంగా ఉన్నారని చేస్తున్న ప్రచారం పూర్తి నిజం కాదు. గ్రామ సభలు ఎక్కడా జరగలేదు. జరిగిన ఒక్కసార్లపల్లిలో డీఎఫ్వో ఆధ్వర్యంలో, వారికి అనుకూలంగా ఉన్న కొద్దిమందితో సంతకాలు చేయించుకున్నారు. అక్కడ కూడా గ్రామ సభకు కావలసిన కోరం లేనే లేదు. తరలింపుకు అనుకూలంగా లేని ఆదివాసులను రెవెన్యూ, పోలీసు , అటవీ అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. మొత్తం గ్రామాలు స్వచ్ఛందంగా తరలిపోతున్నట్టు, ఆ గ్రామాలకు ఇందిరమ్మ ఇళ్లు మొదలగు కొత్త ప్రభుత్వ పథకాలను నిలిపివేస్తున్నారు. మహిళా సంఘ భవనానికి అనుమతి ఇవ్వటం లేదు. రోడ్లు వేయటం లేదు. ప్రజలను చైతన్యం చేస్తున్న వారిని బెదిరిస్తూ, అక్రమ కేసులు బనాయిస్తున్నారు. అలగే, స్వచ్ఛందంగా వెళ్తామని ముందుకొచ్చిన గిరిజనేతురలతో ఇంగ్లీష్ భాషలో రాసిన అగ్రిమెంట్ మీద సంతకాలు పెట్టించుకోడం, 15 లక్షలు ఇస్తామని, భూములు ఇస్తామని , ఇళ్లు కట్టించి ఇస్తామని నోటిమాటగా చెప్పడం అభ్యంతకరం. పేరుకు స్వచ్ఛంద తరలింపు కానీ, వాస్తవంగా ఇది ప్రలోభ పూరిత, బలవంతపు తరలింపు. టైగర్ రిజర్వ్ ప్రాంతం నుంచి గ్రామస్థుల తరలింపుకు ప్రభుత్వం చేస్తున్న ఈ రకమైన ప్రయత్నాలను ఈ బృందం ఖండిస్తోంది. వన్య ప్రాణుల సంరక్షణ ఎంత అవసరమో, తరతరాలుగా అడవిలో నివసిస్తున్న మనుషుల హక్కులను పరిరక్షించటం కూడా అంతే అవసరం. నిజానికి, రాజ్యాంగపరంగా అంతకు మించిన అవసరం. ఆదివాసులకు రాజ్యాంగం కల్పించిన 5 వ షెడ్యూల్లు, పీసా చట్టం , వన్ ఆఫ్ 70 చట్టం, అటవీ హక్కుల చట్టాలను తుంగలో తొక్కటమే అవుతుంది. ఆదివాసుల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వమే, ఈ రకమైన నిర్లక్ష్యపు ధోరణిని అవలంబించటం సరైంది కాదు.

**మా డిమాండ్లు:**

1. టైగర్ రిజర్వ్ కోసం ఆదివాసుల విస్తాపనను నిలిపివేయాలి. 2. కోరం తో కూడిన గ్రామసభ తీర్మానాలు మాత్రమే పరిగణలోకి తీసుకోవాలి. తరలింపుకు తాము వ్యతిరేకమని ఆదివాసీ ప్రజలు చేసిన గ్రామసభ తీర్మానాలను ప్రభుత్వం గౌరవించాలి.
3. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో వాళ్లు పొందే హక్కులను పరిరక్షించాలి. పీసా చట్టాన్ని , అటవీ హక్కుల చట్టాన్ని వాటి స్ఫూర్తితో అమలు పరచాలి. వారు ఉన్న ప్రాంతంలోనే విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలను పెంపొందించాలి.
4. విస్తాపనకు సిద్ధంగా లేని ప్రజలపై ప్రత్యక్ష, పరోక్ష వేధింపులను మానుకోవాలి.
5. గ్రామాలను వదిలి వెళ్ళటానికి సిద్ధంగా ఉన్న వారికి ప్రభుత్వం నోటిమాటగా కాకుండా, ఆ హామీలకు చట్టబద్ధత కల్పించి మాత్రమే తరలించాలి. మా నిజనిర్ధారణ బృందంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్ళ రోహిత్, సంజీవ్, శ్రీధర్ , భరత్ మరియు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ పాల్గొన్నారు.

# ఈదురుగాలుల బీభత్సం

**రైస్ మిల్లుల దుమ్ముతో**
**పరిసర ప్రాంతాల్లో దుమ్ముమయం**



**మిర్యాలగూడ, మే3 (నినాదం):** మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో ఆకస్మాత్తుగా సంభవించిన ఈదురుగాలులతో బీభత్సం సృష్టించింది. దీంతో చెట్లు విరిగిపడగా విద్యుత్ స్తంభాలు, తీగలు తెగిపడి తద్వారా రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడింది. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు సంభవించిన ఈదురు గాలులా బీభత్సం ప్రయాణకులకు ఆటంకం కలిగించింది. ఇన్నాళ్లు లేనివిధంగా భారీ ఎత్తున ఈదురుగాలి సంభవించడంతో రోడ్లపై ప్రయాణించి ద్విచక్ర వాహన దారులను సైతం వెళ్లకుండా ఆటంకపరిచింది. ఒకానొక దశలో రోడ్లపై వెళ్లే ద్విచక్రవాహనదారులు గాలి బీభత్సానికి ద్విచక్ర వాహనంతో సహా గాలిలో లేచారు. ముఖ్యంగా నలగొండ రోడ్డులోని శెట్టిపాలెం. సాగర్ రోడ్ లోని వెంకటాద్రిపాలెం, తుంగపాడు, గుంటూరు రోడ్ లో గల గూడూరు, కోదాడ రోడ్డులో గల యాద్గర్ పల్లి, బాధలాపురం గ్రామాల్లో మిల్లుల ద్వారా ఒకేసారి పెద్ద ఎత్తున దుమ్ము లేవడంతో పరిసర గ్రామాలతోపాటు ప్రధాన రోడ్లు పయనించే వాహనాల్లో దారులకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా పరిసర గ్రామాలలోని ఇండ్లలోకి దుమ్ముచేరి తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. కొన్నిచోట్ల రోడ్లపై భారీ చెట్లు పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి కొన్నిచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి ఆటంకం ఏర్పడింది.

# నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**
**పటాన్చెరులో కన్యకా పరమేశ్వరి దేవాలయం నిర్మాణ పనులకు శంకుస్థాపన**





**పటాన్చెరు, మే3 (నినాదం) :** ప్రజలలో భక్తి భావం పెంపొందించడంలో భాగంగా నియోజకవర్గం వ్యాప్తంగా నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని పంచముఖి హనుమాన్ దేవాలయం ఎదురుగా నూతనంగా నిర్మించ తలపెట్టిన కన్యకా పరమేశ్వరి దేవాలయం నిర్మాణ పనులకు ఆదివారం ఉదయం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మాన సిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందిం చుకోవాలని విజ్ఞప్తి చేశారు. పటాన్చెరు నియోజకవర్గ వ్యాప్తంగా సొంత నిధులతో 220 కి పైగా దేవాలయాలు నిర్మిం చడం జరిగిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లోనూ మరిన్ని దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు, పాల్గొన్నారు.

# పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి

**ఎన్బి ఎంఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు రవి రాజ్ రాథోడ్**



**కీసర, మే3 (నినాదం) :** కీసర మండలం, పెండింగ్లో ఉన్న రూ. 8వేల కోట్ల ఫీజు బకా యిలను వెంటనే చెల్లించాలని ఎన్ బి ఎం ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు రవి రాజ్ రాథోడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల వద్ద పీజులు వసూలు చేసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్ కు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కోర్టు జారీ చేసిన జీవో నెం.7 ను వెంటనే ఉపసంహరించు కొని పాత పద్ధతినే కొనసాగించా లని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా రవి రాజ్ రాథోడ్ మాట్లాడుతూ ఫీజు బకాయిలు 8 వేల కోట్లు వెంటనే చెల్లించాల న్నారు. ఇటీవల హైకోర్టు సింగిల్ జడ్జ్ ఒక తీర్పులో విద్యార్థుల వద్ద పీజులు వసూలు చేసుకోవాలని తీర్పు చెప్పిందని, ఆ తరువాత అటు ప్రభుత్వం మంజూరు చేసిన తర్వాత వాపస్ ఇవ్వాలని తీర్పు చెప్పింద న్నారు. కోర్టు తీర్పు ప్రకారం చాలా కాలేజీలు విద్యార్థులను ఫీజులు కట్టాలని ఒత్తిడి తెస్తున్నార న్నారు. పీజులు వసూలు చేస్తున్నారని, కోర్టు తీర్పు ప్రభావం వలన శ్రీ ఇందు కాలేజీ యాజమాన్యం ఒత్తిడి వలన ప్రణీత అనే బి టెక్ 3 వ సంవత్సరం విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఇదే పరిస్థితి అన్ని కాలేజీలలో ఉన్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవో 7ను ఏప్రిల్ 30న జారి చేసిందని, ఈ జీవో చూడడానికి బాగానే ఉంది కాని పేద వర్గాల వారు చదువుకోకుండా చేసే కుట్ర ఇందులో ఉందన్నారు. ఈ జీవో ప్రకారం ఫీజులు, స్కాలర్ షిప్ విద్యా ర్థుల ఖాతాలో వేయాలని ఉందని మండి పడ్డారు. కొత్తగా జారీచేసిన జీవో నెం.7ను ఉపసంహరించుకోవాలని రవి రాజ్ రాథోడ్ డిమాండ్ చేశారు.

# గిరిజన నేత, మండల పార్టీ అధ్యక్షులు మంజుకు జన్మదిన శుభాకాంక్షలు

**హుజూర్నగర్,మే3 (నినాదం) :** మఠంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ భూక్యా మంజు నాయక్ జన్మదినోత్సవం సందర్భంగా హుజూర్ నగర్ లో మంచ్య తండా గ్రామ సర్పంచ్ శ్రీమతి మాలోతు భద్రమ్మ బాబు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రజల కోసం నిరంతరం పోరాడుతూ, మండలంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చడంలో మంజు నాయక్ కుటుంబ సభ్యుల పాత్ర కీలకమని ఆయన నాయకత్వంలో ప్రజల సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరుగుతుందని, గ్రామీణ అభివృద్ధికి ఆయన చేసిన కృషి అభినందనీయం అని కొనియాడారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మంజు నాయక్ కు



జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయనకు దీర్ఘాయుష్షు, మరింత రాజకీయ విజయాలు కలగాలని ఆకాంక్షించారు.



# న్యాయమైన హక్కుల సాధనకు ఐకమత్యంతో ముందుకు సాగుదాం

**బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,**
**మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్**
**ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే దానం మున్నూరుకాపులకు పిలు**





**హైదరాబాద్, మే3 (నినాదం):** రాజ్యాధికారంలో సము చిత వాటా, న్యాయమైన హక్కుల సాధనకు మనమందరం మరింత ఐకమత్యంతో ముందుకు సాగుదామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితర ప్రముఖులు మున్నూరుకాపులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్ కోకాపేటలో ప్రభుత్వం కేటా యించిన 5 ఎకరాలలో మున్నూరుకాపు టవర్స్ (ఆత్మగౌరవ భవనం) నిర్మాణానికి ఆదివారం ఉదయం భూమి పూజ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ రవి చంద్ర, ఎమ్మెల్యే నాగేందర్,లు మాట్లాడుతూ,రాష్ట్ర జనాభాలో మున్నూరుకాపులం గణనీయమైన సంఖ్యలో ఉన్నామని చెప్పారు. తెలంగాణలో పట్వారీలుగా, పోలీస్ పటేల్స్,మాలి పటేల్స్ గా సమాజానికి విశేష సేవలందించామని వివరిం చారు. ఇప్పుడు భూమి పూజ చేసుకున్న స్థలంలో మన ఆత్మ గౌరవం మరింత పెంపొందేలా టవర్స్ గొప్పగా నిర్మించు కుందామని,ఇందుకుగాను భూరి విరాళాలు అందజే యాల్సిందిగా దేశ, విదేశాలలో ఉన్న మున్నూరుకాపు, కాపు, బలిజ, తూర్పు కాపు,ఒంటరి కుల బంధువులు,శ్రేయో భిలాషులందరికి రవిచంద్ర, నాగేందర్ లు విజ్ఞప్తి చేశారు. రాజ్యాధికారంలో సముచిత వాటా దక్కించుకునేందుకు, న్యాయమైన హక్కుల సాధనకు మనమంతా ఏకతాటిపై ముందుకు సాగుదామని ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే దానం పిలుపునిచ్చారు.

**ప్రముఖులతో కలిసి కోకాపేటలో భవన నిర్మాణానికి భూమిపూజ**

మున్నూరుకాపు ఆత్మగౌరవ భవన (మున్నూరు కాపు టవర్స్) నిర్మాణానికి ఆదివారం ఉదయం భూమి పూజ ఘనంగా జరిగింది. బీసీ కులాల ఆత్మగౌరవ భవన నిర్మాణాలకు గాను హైదరాబాద్ శివార్లలోని కోకాపేటలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు స్థలాలు కేటాయించిన విషయం తెలిసిందే. మున్నూరుకాపు భవన నిర్మాణానికి కేటాయించిన 5 ఎకరాలలో జరిగిన భూమి పూజ కార్యక్రమానికి సంఘం గౌరవాధ్యక్షులు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,మాజీ మంత్రి, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితర ప్రముఖులు హాజరై కొబ్బరికా యలు కొట్టారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మున్నూరుకాపు టవర్స్ నిర్మాణం కోసం పలువురు ప్రముఖులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భారీ విరాళాలు ప్రకటించారు. ఎంపీ రవిచంద్ర,మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్,సంఘం ప్రముఖులు గాలి అనిల్ కమార్,తూడి ప్రవీణ్ లు కోటి రూపాయల చొప్పున ప్రకటించారు. ప్రముఖ బిల్డర్ పోతురెడ్డి రమేష్ బాబు,ఆయన కుమారుడు సందీప్ లు 10 లక్షల రూపాయలు నగదు అందజేయగా ఆయన్ను ఎంపీ రవిచంద్ర శాలువాతో సత్కరించారు. అలాగే,రూ. 5 లక్షల చొప్పున ప్రకటించిన సంఘం ప్రముఖులు సల్లా కృష్ణ,ఆకుల సత్యనారాయణ, మిరియాల రాఘవరావులను ఎంపీ వద్దిరాజు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ శుభ కార్యంలో చురుకైన పాత్ర పోషించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషో త్తమ రావు, ప్రముఖులు రమేష్ హజారే,రౌతు కనకయ్య, సత్తు మల్లేష్,మంగళారపు లక్ష్మణ్,విష్ణువర్ధన్,పెద్ది పెంట య్య,కంచి సత్యనారాయణ ,బండి పద్మక్క,పీఎల్ఎన్ పటేల్, లవంగాల అనిల్,ఊసా రఘు,భేతి శ్రీధర్ తదితర ప్రముఖు లను ఎంపీ రవిచంద్ర శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా "జై మున్నూరు కాపు జైజై మున్నూరుకాపు",' 'వర్ధిల్లాలి వర్ధిల్లాలి మున్నూరుకాపు,కాపుల ఐక్యత వర్ధిల్లాలి","జిందాబాద్ జిందాబాద్ పటేల్స్ జిందాబాద్"అనే నినాదాలు మిన్నంటాయి.

# డిగ్రీల మోత.. నైపుణ్యాల కొరత

**నేటి భారతదేశంలో ఒక విచిత్రమైన దృశ్యం మన కళ్లముందు కనిపిస్తోంది. చదువుకున్న యువత సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. యూనివర్సిటీలు ప్రతి ఏటా లక్షలాది పట్టభద్రులను సమాజానికి అందిస్తున్నాయి. చేతిలో మెరిసే బంగారు పతకాలు,మేధస్సును ప్రతిబింబించే డిగ్రీలు. కానీ మరోవైపు, ఆ పట్టాల వెనుక ఆశలు మసకబారుతున్నాయి. రేపటిపై ధీమా లేని అయోమయ స్థితిలో యువత కొట్టుమిట్టాడుతోంది.**

ఎడిటోరియల్

చదివిన చదువు ఉద్యోగంగా మారి కడుపు నింపలేకపోతే చేతిలో డిగ్రీ ఉన్నా ఆ చదువుకి విలువ ఏమిటి? అనే ప్రశ్న ప్రతి ఇంట్లో వినిపిస్తోంది.ఇది కేవలం ఒక వ్యక్తిగత బాధ కాదు, ఇది దేశ భవిష్యత్తుకు సంబంధించిన ఒక సామాజిక సంక్షోభం.

ఒకప్పుడు విద్య అంటే జీవితం మార్చే ఆయుధం. కానీ ఇప్పుడు అదే విద్య చాలా సందర్భాల్లో కేవలం సర్టిఫికెట్‌గా మారిపోయింది. పుస్తకాలు చదివి పరీక్షలు పాస్ అవ్వడం సులభమైంది... కానీ జీవితం అనే పరీక్షలో నిలబడటం మాత్రం కష్టంగా మారింది. కుంటి గుర్రం కింద పడుతుంది అన్నట్లుగా, నైపుణ్యం లేని విద్యార్థి ఉద్యోగాల పోటీలో వెనుకబడిపోతున్నాడు.

### విద్య మార్గమా? మాయాజాలమా?

మన దేశంలో విద్యను ఒక రక్షణ కవచంగా చూస్తారు. బాగా చదువు మంచి ఉద్యోగం వస్తుంది అనే మాట ప్రతి తల్లిదండ్రి నోట వినిపిస్తుంది. కానీ ఈ సూత్రం నేటి కాలానికి పూర్తిగా సరిపోవడం లేదు. ఎందుకంటే విద్యా వ్యవస్థ కాలానికి తగ్గట్టు మారలేదు. విద్యార్థులు నేర్చుకుంటున్నది ఒకటి మార్కెట్‌కి కావాల్సింది ఇంకొకటి. పుస్తకాలు చదివి మార్కులు తెచ్చుకోవడం సులభమైంది కానీ జీవితంలో నిలబడటం కష్టం.చెట్టు ఎత్తుకు పెరిగినా వేరు బలంగా లేకపోతే కూలిపోతుంది అన్నట్లుగా, విద్యార్థి ఎంత డిగ్రీలు సంపాదించినా అతని బేసిక్ స్కిల్స్ బలంగా లేకపోతే ప్రయోజనం లేదు. తెలుసుకోవడం వేరు, చేయగలగడం వేరు. ఒక ఇంజినీరింగ్ విద్యార్థి నాలుగేళ్లు చదివి పట్టతో బయటకు వస్తున్నా అతనికి ప్రాక్టికల్ నాలెడ్జ్ లేదు. యంత్రాన్ని పనిచేయలేకపోతే ఎంబీఏ చదివినా నలుగురితో మాట్లాడలేకపోవడం నేటి విషాదం. డిగ్రీ విద్యార్థి పది పుస్తకాలు చదివి పరీక్షలు రాస్తున్న అతనికి కమ్యూనికేషన్ స్కిల్స్ లేక ఇంటర్వ్యూలో మాటలు రావు. ఇది కేవలం వ్యక్తిగత వైఫల్యం కాదు వ్యవస్థలోని లోపం. విన్నది వేరే చూసింది వేరే చదివిన చదువుకు, చేసే పనికి' మధ్య ఉన్న ఈ అగాధమే నిరుద్యోగానికి అసలు కారణం.

### నైపుణ్యాల కొరత – ఉద్యోగాలకు అడ్డుకట్ట

విద్య అనేది మనిషిని వికసింపజేయాలి, కానీ మన విద్యావ్యవస్థ మనిషిని కేవలం ఒక 'మెమరీ కార్డు'లా మారుస్తోంది. ఇండస్ట్రీ 4.0 దిశగా ప్రపంచం పరిగెడుతుంటే, మన పాఠ్యాంశాలు ఇంకా పాత కాలపు సిద్ధాంతాల చుట్టూనే తిరుగుతున్నాయి

నేటి కాలంలో కేవలం చదువు సరిపోదు. ప్రపంచంలో తెలుసుకోవడం కంటే చేయగలగడం ముఖ్యం.పని తెలిసినవాడే పండుగ చేసుకుంటాడు. అనే సామెత నేటి పరిస్థితికి సరిపోతుంది. చాలా మంది విద్యార్థులు థియరీలో బాగుంటారు.కానీ ప్రాక్టికల్‌లో వెనుకబడిపోతున్నారు. కేవలం సర్టిఫికేట్‌తో ఉద్యోగం రావడం కష్టం.

ఇంటర్వ్యూల్లో అడిగే ప్రశ్నలు జీవితానికి సంబంధించినవి. కానీ మనం చదివింది పుస్తకాలకే పరిమితం. మన విద్యా వ్యవస్థ ఇంకా చదివినది చెప్పడం మీదే నిలిచి పోయింది.ల్యాబ్‌లో చేయాల్సిన ప్రయోగాలు కేవలం రికార్డుల్లోనే ముగుస్తున్నాయి. ప్రాజెక్టులు కాపీ పేస్ట్‌లుగా మారుతున్నాయి.

ఈ నేపథ్యంలో పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు యువతలో కనిపించడం లేదు.

ప్రశ్నలకు సమాధానం చెప్పడంలో చాలామంది యువత వెనుకబడుతున్నారు.

అంటే డిగ్రీ ఉన్నా, ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యం లేకపోతే అది పనికిరాదు.

### సాంకేతిక విప్లవం సవాలు విసురుతోంది

ప్రపంచం ఇప్పుడొక సాంకేతిక విప్లవ దశలో ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఆటోమేషన్ వంటి టెక్నాలజీలు ఉద్యోగాల స్వభావాన్ని పూర్తిగా మార్చేశాయి.

ఒకప్పుడు వందమంది చేసే పనిని ఇప్పుడు ఒక యంత్రమే చేస్తోంది. సంవత్సరాలు పట్టే పనిని ఇప్పుడు కొన్ని గంటల్లో పూర్తి చేస్తున్నారు. ఈ మార్పులకు అనుగుణంగా యువత తమను మార్చుకోవాలి. కానీ చాలా మంది ఇంకా పాత పాఠ్యప్రణాళికలతోనే ముందుకు సాగుతున్నారు. చదువు అయిపోయింది ఇక సరిపోతుంది అనే భావన పెద్ద ప్రమాదం.నేటి కాలంలో చదువు ఎప్పటికీ ఆగదు.కాలానికి అనుగుణంగా నడవని వాడు కాలం కింద పడిపోతాడు అనే మనం గుర్తుంచుకోవాలి. డిగ్రీ అనేది ప్రారంభం మాత్రమే అభ్యాసం జీవితాంతం కొనసాగాలి.ఇప్పటి పరిస్థితి కొత్త మేకలకు పాత గొర్రెల కాపరి పనికిరాదు అన్నట్లు ఉంది.

కాబట్టి నైపుణ్యాలు ఎప్పటికప్పుడు పెంచుకోవాలి.పాత చింతకాయ పచ్చడి లాంటి కోర్సులతో ఆధునిక కంపెనీల అవసరాలను తీర్చలేం. డిగ్రీ అనేది కేవలం ఎంట్రీ పాస్మాత్రమే, లోపల రాణించాలంటే నైపుణ్యం అనే 'ఆయుధం' ఉండాలి.

### ప్రభుత్వ ఉద్యోగాల మాయలో యువత

మన దేశంలో ఒక బలమైన మానసిక ధోరణి ఉంది ప్రభుత్వ ఉద్యోగమే అసలైన ఉద్యోగం.ఈ భావన చాలా మందిని ఒకే దారిలో నడిపిస్తోంది. ఒక చిన్న నోటిఫికేషన్ వస్తే లక్షలాది మంది దానికి అప్లై చేస్తారు. ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో సమయం గడుపుతారు. ఈ ప్రయాణంలో చాలా మంది తమ వయసు, సమయం, అవకాశాలను కోల్పోతున్నారు. ఒకే తలుపు ముందు లక్షల మంది నిలబడితే అందరికీ లోపలికి అవకాశం ఉండదు కదా! ప్రైవేట్ రంగం, స్టార్టప్స్, ఫ్రీలాన్సింగ్ వంటి అనేక అవకాశాలు ఉన్నా వాటిని చాలా మంది పట్టించుకోవడం లేదు. పాత బాటలో నడిచే వాళ్లకు కొత్త దారి కనిపించదు అనే మాట ఇక్కడ సరిగ్గా సరిపోతుంది.ఈ దృష్టికోణం మారాలి.ఒకవేళ ఉద్యోగం రాకపోతే, వారు అటు ప్రైవేట్ రంగానికి పనికిరాక, ఇటు స్వయం ఉపాధి చేపట్టలేక మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు.

### వ్యవస్థాగత లోపాలు

నిరుద్యోగ సమస్యకు కేవలం యువతనే బాధ్యులను చేయడం సరైంది కాదు. ఇందులో వ్యవస్థాగత లోపాలు పెద్ద పాత్ర పోషిస్తున్నాయి. దేశంలో పరిశ్రమల స్థాపన వేగం జనాభా పెరుగుదలకు సరిపోవడం లేదు.

కొత్త కంపెనీలు రావడం మందగించింది.దీంతో ఉద్యోగాల సృష్టి తగ్గింది. అవినీతి సమస్య పెరిగింది. అర్హత ఉన్నా అవకాశాలు రాకపోవడం యువతలో నిరాశను పెంచుతోంది. మెరిట్ కంటే సిఫార్సే ముఖ్యం అనే భావన పెరుగుతోంది.ఇది వ్యక్తిగత స్థాయిలో కాదు దేశ అభివృద్ధి స్థాయిలో కూడా ప్రమాదకరం.

### విద్యా సంస్కరణలు అవసరం

విద్యా వ్యవస్థలో మార్పులు లేకపోతే నిరుద్యోగ సమస్యను పూర్తిగా పరిష్కరించడం అసాధ్యం. డిగ్రీ స్థాయి నుంచే ప్రాక్టికల్ నాలెడ్జ్ ఇవ్వాలి. ఇంటర్న్‌షిప్‌లు తప్పనిసరి చేయాలి.

పరిశ్రమలతో విద్యాసంస్థలు కలిసి పనిచేయాలి. పుస్తకాల్లో ఉండే జ్ఞానం మాత్రమే కాదు జీవితంలో ఉపయోగపడే నైపుణ్యాలు నేర్పాలి. పాత విధానాలతో కొత్త ప్రపంచాన్ని ఎదుర్కోలేం. స్కిల్ డెవలప్మెంట్‌పై దృష్టి పెట్టాలి.

### నూతన నైపుణ్యాలే విజయానికి మంత్రం

నేర్చుకోవడం ఆపిన వాడు వెనుకబడిన వాడే కనుక నేర్చుకోవడమే నిజమైన సంపద అని గుర్తుంచుకోవాలి. డిగ్రీతో చదువు ముగియదు. కొత్త కోర్సులు, కొత్త నైపుణ్యాలు నేర్చుకుంటూ ఉండాలి. నిలిచిన నీరు కుళ్ళిపోయినట్లు అభ్యాసం ఆగితే అభివృద్ధి ఆగిపోతుంది.

ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌లు అనేక అవకాశాలను అందిస్తున్నాయి. వాటిని ఉపయోగించుకుని యువత తమ నైపుణ్యాలను పెంచుకోవాలి.

### మార్పు మన చేతుల్లోనే ఉంది

నిరుద్యోగం ఒక పెద్ద సమస్య . కానీ అది పరిష్కారం లేనిది కాదు. విద్యాసంస్థలు నైపుణ్యాలను పెంపొందించాలి. యువత తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలి.ప్రభుత్వం అవకాశాలను సృష్టించాలి. డిగ్రీ ఒక తలుపు మాత్రమే దాన్ని తెరవడానికి తాళం మాత్రం నైపుణ్యమే అని యువత గుర్తెరగాలి.

డిగ్రీ అనేది మేధస్సుకు ఇచ్చే ఒక గుర్తింపు మాత్రమే, అది మీ జీవితానికి భరోసా కాదు. నైపుణ్యం లేని డిగ్రీ తూటాలు లేని తుపాకీ వంటిది.

ప్రపంచం మ సర్టిఫికెట్లను చూడదు ఏం చేయగలరో చూస్తుంది. డిగ్రీలతో పాటు డిజిటల్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, మరియు నిరంతర అభ్యాసాన్ని అలవరచుకోవాలి. దిశ లేని యువతకు కావాల్సింది సానుభూతి కాదు సరైన మార్గదర్శకత్వం ,శిక్షణ అవకాశాలు కల్పించడం.ప్రభుత్వం, విద్యాసంస్థలు, మరియు యువత చేతులు కలిపితేనే దిశ లేని యువత కాస్తా దేశానికి దిశానిర్దేశం చేసే యువత'గా మారుతారు.



**దుప్పటి మొగిలి**
**8466827118**

# 75వ ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం

## సమాచార గుత్తాధిపత్యంపై కలం పోరాటం

***ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం 1991లో నమీబియాలోని 'విండ్‌హోక్' ప్రకటనతో ఆవిర్భవించింది. సమాచార వ్యవస్థలపై ప్రభుత్వాల గుత్తాధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, స్వతంత్ర మరియు బహుళత్వ పత్రికా రంగం కోసం జర్నలిస్టులు చేసిన పోరాట ఫలితంగా 1993లో ఐక్యరాజ్యసమితి దీనిని అధికారికంగా గుర్తించింది. 2026 నాటికి 75 ఏళ్ల మైలురాయిని చేరుకున్న ఈ ఉద్యమం, కేవలం వార్తల ప్రసారం కోసం మాత్రమే కాకుండా, పెట్టుబడిదారీ శక్తుల నియంత్రణ నుండి సమాచారాన్ని విడిపించి సామాన్యుడికి చేరవేయడమే లక్ష్యంగా కొనసాగుతోంది.***




ప్రస్తుత ఆర్థిక రాజకీయ వాతావరణంలో ఈ రోజు ప్రాముఖ్యత మరింత పెరిగింది. పత్రికా స్వేచ్ఛ అనేది కేవలం జర్నలిస్టుల హక్కు మాత్రమే కాదు, అది సమాజంలోని అట్టడుగు వర్గాల గొంతుకను వినిపించే మరియు పాలకుల జవాబుదారీతనాన్ని ప్రశ్నించే సాధనం.

కార్పొరేట్ శక్తుల లాభాపేక్ష వల్ల వార్తలు వక్రీకరించబడుతున్న తరుణంలో, నిజమైన పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవడం అంటే ప్రజాస్వామ్య మనుగడను మరియు సామాజిక చైతన్యాన్ని రక్షించుకోవడమే.

గత ఏడున్నర దశాబ్దాలుగా ప్రపంచం సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ, సమాచార ప్రసార వ్యవస్థలు మాత్రం నేడు కొద్దిమంది శక్తివంతుల చేతుల్లో బందీలుగా మారాయి.

ఆర్థిక బంధనాల మధ్య స్వేచ్ఛ పత్రికా స్వేచ్ఛపై అణచివేత అనేది ఇప్పుడు కేవలం సెన్సార్‌షిప్ రూపంలోనే లేదు. అది వ్యవస్థాగతంగా, ముఖ్యంగా ఆర్థిక మూలాల ద్వారా కొనసాగుతోంది. మీడియా సంస్థలు పెద్ద ఎత్తున పారిశ్రామిక వేత్తల చేతుల్లోకి వెళ్లడం వల్ల, పత్రికలు కేవలం లాభాలను ఆర్జించే వస్తువులుగా మారిపోయాయి.

ప్రభుత్వాలు మరియు కార్పొరేట్ సంస్థలు ఇచ్చే ప్రకటనల మీద పత్రికలు ఆధారపడటం వల్ల, వారి ప్రయోజనాలకు వ్యతిరేకంగా వార్తలు రాయడం అసాధ్యంగా మారింది. ఇది ప్రజలకు అందే సమాచారాన్ని వడపోసి, పాలకులకు అనుకూలమైన భావజాలాన్ని మాత్రమే వ్యాప్తి చేస్తోంది.

ప్రస్తుత సవాళ్లు మరియు జర్నలిజం తీరు ప్రస్తుతం జర్నలిజం ఒక సంక్షోభంలో ఉంది. అధికార పీఠాన్ని ప్రశ్నించే జర్నలిస్టులు వ్యక్తిగత దాడులకు, చట్టపరమైన ఇబ్బందులకు గురవుతున్నారు.

భారతదేశంలో పత్రికా స్వేచ్ఛా సూచికలో భారత దేశం వెనుకబడి ఉండటం అనేది ప్రజాస్వామ్య ఆరోగ్యానికి ప్రమాద సూచిక. క్షేత్రస్థాయిలో ప్రజల బాధలను చూపే జర్నలిజం కంటే, స్టూడియోలలో కూర్చుని పాలకుల ఎజెండాను మోసే మీడియా పెరిగిపోయింది.

ఇటువంటి క్లిష్ట సమయంలో కూడా పి. సాయినాథ్ వంటి వారు గ్రామీణ భారతంలోని దోపిడీని, ఆర్థిక అసమానతలను తన రిపోర్టింగ్ ద్వారా ప్రపంచానికి చాటుతున్నారు. ది హిందూ వంటి పత్రికలు లేదా న్యూస్ లాండ్రీ, ది వైర్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు కార్పొరేట్ ఒత్తిళ్లను తట్టుకుని స్వతంత్రంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నాయి.

సమాజంలో ప్రెస్ అనేది కేవలం వార్తలను మోసే వాహకం కాదు.అది ప్రజలను చైతన్యపరిచే సాధనం.

సమాజంలో సంపద సృష్టిస్తున్న కార్మికులు, రైతుల సమస్యలకు వేదికగా మారి, వారి హక్కుల కోసం మీడియా పోరాడాలి.

పాలకులు తీసుకునే నిర్ణయాలు ఎవరికి లాభం చేకూరుస్తున్నాయో (కొద్దిమంది సంపన్నులకా లేక సామాన్య ప్రజలకా?) ఎండగట్టడం మీడియా ప్రధాన బాధ్యత.

అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న తరుణంలో, నిక్కచ్చిగా నిజాలను బయటపెట్టడం ద్వారా వ్యవస్థాగత మార్పుకు మీడియా పునాది వేయాలి.

సమాచారం అనేది లాభం ఆర్జించే సరుకు కాకుండా, ప్రజలందరికీ అందుబాటులో ఉండే ప్రజా ఆస్తిగా మారాలి. శ్రమజీవుల పక్షం వహించి, వ్యవస్థలోని లోపాలను సరిచేసే దిశగా సాగే జర్నలిజమే నేటి అవసరం.

**జంపన్న**
**డెమోక్రటిక్ సోషలిస్ట్**



# దేశంలో వెలుగులు నింపుతున్న బొగ్గు గని కార్మికులు

## (4 మే "జాతీయ (భారతీయ) గని కార్మికుల దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచంలోనే చైనా తర్వాత రెండవ అతి పెద్ద బొగ్గు ఉత్పత్తి చేస్తున్న దేశంగా భారత్ నిలుస్తున్నది. ఏడాదికి 700 మెట్రిక్ టన్నుల బొగ్గును భారత ఉత్పత్తి చేస్తున్నది. మన దేశంలో విద్యుత్తు రంగం, స్టీల్ పరిశ్రమలు, స్పాంజ్ ఐరన్ పరిశ్రమలు, సిమెంట్ పరిశ్రమలు అధిక మొత్తంలో బొగ్గును వినియోగిస్తున్నాయి. భారత్‌లో ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత తక్కువగా ఉండడంతో స్టీల్ పరిశ్రమలకు విదేశాల నుంచి నాణ్యమైన బొగ్గును దిగుమతి చేసుకోవడం జరుగుతున్నది. బొగ్గు గనుల్లో అతి ఇరుకైన ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తున్న గని కార్మికుల తక్కువ వేతనాలకే పని చేయడం, త్యాగం, అంకిత భావం, అనారోగ్యాల బారిన పడుతున్న గని కార్మికుల కృషిని అభినందించడం, ఎక్కువ పని గంటలు కేటాయించడం, వారికి పౌర సమాజం సంఘీభావం తెలపడం లాంటి అంశాలను లేదా సవాళ్ళను చర్చించడానికి ప్రతి ఏట 04 మే రోజున "జాతీయ లేదా భారతీయ గని కార్మికుల దినోత్సవం (నేషనల్ లేదా ఇండియన్ కోల్ మైనర్స్ డే" నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

### భారత్‌లో బొగ్గు గని చరిత్ర:

గని కార్మికపు బొగ్గు గనుల్లో పని చేయడం తొలుత చైనా, రోమన్ సామ్రాజ్యంలో ప్రారంభం అయ్యింది. పారిశ్రామిక విప్లవ సమయంలో బొగ్గును స్టీమ్ ఇంజన్, విద్యుత్తు ఉత్పత్తి, ఉష్ణ భవనాల్లో బొగ్గు వాడడం ప్రారంభం కావడంతో బొగ్గు గని కార్మికుల అవసరం ఏర్పడింది. 1774లో భారత్‌లో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రారంభించిన బొగ్గు నేటి వరకు కొనసాగుతున్నది. 1850ల్లో సాలీనా ఒక మిలియన్ మెట్రిక్ టన్ను బొగ్గు ఉత్పత్తి చేయడంతో ఇండియాలో బొగ్గు గని కార్మికుల త్యాగాలు ప్రారంభం అయ్యింది. అదే క్రమంలో 1920ల్లో 6 మిలియన్ మెట్రిక్ టన్నులు, 1930ల్లో 18 మిలియన్ మెట్రిక్ టన్నులు, 1946 ప్రాంతంలో 30 మిలియన్ మెట్రిక్ టన్నులు, 1950ల్లో 33 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగేది. 1970ల్లో భారత ప్రభుత్వం ప్రైవేటీకరణను చేపట్టడం, 2015లో డీనేషనలైజేషన్ చేపట్టడం జరిగింది. ఇండియాలో ఝార్ఖండ్, ఒడిసా, చత్తీస్‌ఘడ్, పశ్చిమ బెంగాల్, ఎంపీ, తెలంగాణ, మహారాష్ట్రల్లో బొగ్గు గనులు అధికంగా ఉన్నాయి.

### బొగ్గు గని కార్మికపు ఎదుర్కొంటున్న సవాళ్ళు:

బొగ్గు గని కార్మికలు చేసే శ్రమ, అంకితభావం, భారత ఆర్థికాభివృద్ధిలో గని కార్మికులు పాత్రను శ్లాగించడం, శక్తి ఉత్పత్తికి ఊతం ఇవ్వడం జరుగుతోంది. బొగ్గు గని కార్మికలు ప్రమాదకర వాతావరణాల్లో పని చేయడం, వారి చెమటను శక్తిగా మార్చడం, ఇరుకైన ప్రదేశాల్లో పని చేయడంతో శ్వాసకోశ సమస్యలు రావడం, విష్ఫోటనాలు /లాండ్‌స్లైడ్స్/యంత్రాల లోపాలతో ప్రమాదాలు అధికంగా జరగడం, అధిక పని గంటలు కేటాయించడం, వైద్య ఆరోగ్య ఏర్పాట్లు తక్కువగా ఉండడం, భద్రతలో లోపాలు లాంటి సవాళ్ళతో గని కార్మికమగు మరణం అంచున పని చేస్తున్నారు.

గనుల్లో, బొగ్గుతో శరీరం నల్లబడడం, దేశ ప్రగతి రథ చక్రాలు పరుగులెత్తడానికి గని కార్మికులు చేస్తున్న త్యాగాలు అనన్య సామాన్యాలు. యాజమాన్యాలు తగు భద్రత చర్యలు తీసుకోవడం, వారి ఆరోగ్యానికి గొడుగులు పట్టడం కనీస అవసరం అని తెలుసుకోవాలి. అత్యంత ప్రమాదకర పరిశ్రమగా గుర్తించబడిన బొగ్గు గని పరిశ్రమ రానున్న రోజుల్లో కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం అవ్వాలి, గని కార్మికుల నల్లటి చేతులను ముద్దాడాలి.

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# ఆంధ్రదేశ చరిత్రకు సమగ్ర నిఘంటువు అక్కిరాజు

## తెలుగు సాహిత్యానికి అక్కిరాజు ఎనలేని సేవలు... మే 4... అక్కిరాజు రమాపతిరావు జన్మదినం

**ఆధునిక తెలుగు సాహిత్యంలో కథ, నవల, వ్యాసం అలా... వివిధ ప్రక్రియలలో తమ దైన శైలిలో విశిష్ట స్థానాన్ని పొందిన రచనా దురందరులు అక్కిరాజు రమాపతిరావు. ఆంధ్రదేశ చరిత్రకకు ఆయన ఒక పరిపూర్ణ నిఘంటువు. ఆయన చేసిన సారస్వత కృషి బహుముఖీన మైనది. గొప్ప రచయిత, కవి, పరిశోధనకర్త, ఎన్నో ప్రక్రియల్లో రచనలని ఆవిష్కరించిన సాహితీవేత్త.**



మంజుశ్రీ పేరుతో సుపరిచితులైన అక్కిరాజు రమాపతిరావు తెలుగులో ఒక గొప్ప రచయిత. మొదట్లో సృజనాత్మక రచనలు కొన్ని చేసినా, క్రమేపీ పరిశోధనా రచనలు, జీవిత చరిత్రలు, సంపాదక వ్యాసాలు, సాహితీ విమర్శ మొదలైన ప్రక్రియలలో – దరిదాపుగా 60 పుస్తకాలవరకూ రచించారు. డా. రమాపతిరావు గుంటూరు జిల్లాలోని వేమవరంలో 1936 మే నెల 4వ తేదీన పండితవంశజులైన అక్కిరాజు రామయ్య, అన్నపూర్ణ లకు జన్మించారు. ఉన్నత పాఠశాల చదువులు నరసరావు పేటలో పూర్తిచేసి ఎస్. ఎస్. ఎన్. కళా శాలలో బి.ఏ వరకు చదివారు. 1964 లోనే "వీరేశలింగం పంతులు – సమగ్ర పరిశీలన" థీసిస్ కోసం ఉస్మానియా విశ్వవిద్యాలయం వీరికి డాక్టరేట్ పట్టా ఇచ్చింది. ఆయన మొట్టమొదటి రచనే గొప్ప పరిశోధనా గ్రంథం అయ్యింది. రమాపతిరావు హైదరాబాదు న్యూసైన్సు కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా, తెలుగు అకాడమీలో పరిశోధనాకారిగా, ఉప సంచాలకులుగా పనిచేశారు. 34 సంవత్సరాలు పనిచేసి 1994లో పదవీ విరమణ పొందారు.2008 నించీ 2012 దాకా 5 సంవత్సరాలు సాహిత్య అకాడెమీ తెలుగు సమన్వయ కర్తగా పని చేశారు. నేషనల్ బుక్ ట్రస్టు కార్యనిర్వాహక మండలి సభ్యులుగా ఉన్నారు.

ఎనభై ఏళ్ల పైబడిన జీవితంలో రెండు వందల పైచిలుకు చిన్న, పెద్ద గ్రంథాలు రచించారు. ఆంధ్రదేశ సాంస్కృతిక పునరుజ్జీవనానికి దోహదం చేసిన కవుల, చరిత్ర కారుల, సాంఘిక సంస్కర్తల, భాషావేత్తల జీవిత విశేషాలు తెలుసుకోవాలన్నా, ఆంధ్రదేశ సాంస్కృతిక పునరుజ్జీవన సమగ్ర స్వరూపాన్ని దర్శించాలన్నా అక్కిరాజు రమాపతిరావు గ్రంథాలు సమగ్ర సమాచారాన్ని అందిస్థాయి.

కందుకూరి వీరేశలింగం సారస్వతాన్ని పరిశీలించిన వారిలో ప్రథములు రమాపతిరావు. ఆయన రచించిన 'సారస్వత ప్రబంధం 'దేశ, విదేశ విద్వాంసుల ప్రశంసలు పొందింది. ఆయన రచనలు సారస్వత, ఆధ్యాత్మిక రచనలు. జారుడు మెట్లు, ఋణాను బంధం ... మొదలైన పది నవలలు, మైథిలి, మంచు కురిసిన రాత్రి ... మొదలైన ఆరు కథా సంపుటాలు రచించారు.పాల్కురికి సోమనాథుడి పండితారాధ్య చరిత్ర లోని దీక్ష, పురాతన ప్రకరణాలను 2003 సంవత్సరంలో తెలుగు వచనంలోకి అనువదించారు.

ప్రముఖ సాహిత్య సామాజిక వార పత్రిక– 'తెలుగు స్వతంత్ర' లో 1953లో మొదలై, సుమారు 65 ఏళ్ల సాహిత్య కృషిలో వివిధ దైనిక, వార,మాస పత్రికల్లో నాలుగు వేల పైచిలుకు ప్రచురింపబడ్డాయి..

వ్యావహారిక భాషా వికాసం – చరిత్ర" అనే పరిశోధవా గ్రంథానికి 1971లో ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. వివిధ ప్రక్రియలకు సంబంధించి 140 (నూట నలభై) గ్రంథాలు వీరివి ప్రచురితమయ్యాయి. ప్రతిభా మూర్తులు' అనే పేరుతో 150 మంది తెలుగు సాహిత్య సామాజిక మూర్తులను చిత్రించారు. 200 పైగా రేడియో కార్యక్రమాలు చేశారు. వీరి రెండు నవలలు ఆకాశవాణి విజయవాడ, హైదరాబాదు, చెన్నై కేంద్రాలనుంచి ధారావాహికంగా ప్రసారమయ్యాయి. అక్కిరాజు సాహిత్యంలో చేసిన అవిరళ కృషిని గుర్తించి ఎన్నో సంస్థలు అవార్డు లిచ్చి సత్కరించాయి. కలకత్తాలోని భారతీయ భాషా పరిషత్తువారి సమగ్ర రచనా పురస్కారం, అమెరికా వంగూరి ఫౌండేషన్ వారి పురస్కారాలు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అవార్డ్, తెలుగు విశ్వవిద్యాలయం ఇచ్చిన మూడు పురస్కారాలు (మూడుసార్లు) వంటివి పేర్కొనదగినవి.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# బాల్యం ఒక పాలపుంత

బాల్యం ఒక జ్ఞాపకాల పాలపుంత
అదొక మధురమైన ఒక పులకింత
భుజాలకు బరువేంటో
కష్టాల కావడేంటో తెలియకుండా
దూది పింజల్లా ఎగిరిపోయి
మట్టిలో వాలిపోయిన రోజులు .ఇంకా
మనసు పొరలపై మెల్లంగ నడుస్తున్నాయి

తొక్కుడు బిల్ల, దోపుడు పుల్ల
ఉప్పు బేరలు, దాగుడుమూతల తోటి
నడిరేతిరైనా నారాజుగానే ఇంటి తోవ పట్టేది పిడ్సను మర్చి
పిక్కలాట ఆడి బడి తోవ మర్చితే అవ్వ చేతిలో ఈపు
పైన శింత బరిగెలు ఇరిగిన రోజులు
ఇంకా కండ్ల ముందు కద్లుతూనే ఉన్నాయి

శిర్రగోనె , శిక్కుడు పుల్ల శితం ఆటల తోటి
ఇంటిని , వంటిని మరిచిన రోజులు తాటి ముంజల బండ్ల
తోటి ఊరంతా ఉత్సాహం గా ఉరకలేసిన రోజులు
తాటాకుల తోటి గాలి గిరకలు చేసి
గమ్మత్తుగా లేడి గంతులేసిన రోజులు
ఇంకా ఎదలపై తేలియాడుతూనే ఉన్నాయి

నీడలు భయపడి చెట్ల కిందకు చేరుతుంటే
ఈత బెండ్లను కట్టకొని బాయిల్ల దూకి
మునిగీత కొడ్తాంటే నీరు గట్టే ఎదురొచ్చి
నాకేసి చూసిన రోజులు నయనాల ముందు
ఇంకా నానుతూనే ఉంది

రేగి పండ్లు , పరిక పండ్ల కోసం పాణం పెడితే
ఉన్నొక్క అంగి పర్రెలు పాశిన రోజులు
ఈత పండ్ల కోసమని రువ్విన రాయి
దోస్తుగాని కంతకు తలిగి రక్తమోడిన రోజులు
కోతి కొమ్మచ్చి ఆడుతుంటే అదుపుతప్పి
బొక్క తేలి కాలు కదపని రోజులు ఇంకా
మస్తిష్కంలో మెదులుతూనే ఉన్నాయి

కాసులు రాశులు పోసినా కాలం వెనక్కిరాదు
పసిడిని కుప్పలు పోసినా పసితనం మళ్ళీరాదు అందుకే
బాల్యపు పరిమళాలు వాడిపోకుండా అప్పుడప్పుడూ కొన్ని
నీళ్లను చిలకరిస్తుండాలి. తీపి గుర్తులను ముందరేసుకొని
అప్పుడప్పుడు తడుముతూ ఉండాలి
బాల్యపు తేనె చినుకులను ఆస్వాదిస్తుండాలి

**✍ తాటిపాముల రమేశ్ (తార) 7981566031**

# అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాల నియంత్రణ

## మే 4 నుండి అంతర్జాతీయ అగ్నిమాపక వారోత్సవముల సందర్భంగా...

వేసవి కాలం వచ్చిందంటే అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. వేసవిలో నీటి కొరత కూడా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు నష్టం కూడా ఎక్కువగానే జరుగుతుంది.1999 నుండి ప్రతి సంవత్సరం మే 4 న అగ్ని మాపక దళ దినోత్సవం జరుపుకుంటారు. అగ్నిమాపక సిబ్బంది తమ సంఘాలు మరియు పర్యావరణం సాధ్యమైనంత సురక్షితంగా ఉండేలా చేసే త్యాగాలను గుర్తించి గౌరవించటానికి ఈ రోజును జరుపుకుంటారు. 2 డిసెంబర్ 1998 న ఆస్ట్రేలియాలో జరిగిన ఒక అగ్నిప్రమాదంలో ఐదుగురు అగ్నిమాపక సిబ్బంది విషాదకర పరిస్థితులలో మరణించిన తరువాత ఈ రోజును జరుపుకోవడం ప్రారంభించారు.అంతర్జాతీయ అగ్నిమాపక దినోత్సవాన్నితీసుకురావడానికిఆస్ట్రేలియాలోనివిక్టోరియాలో స్వచ్ఛంద లెఫ్టినెంట్ మరియు అగ్నిమాపక సిబ్బంది అయిన జెజె ఎడ్మండ్సన్ ను ప్రేరేపించింది. జెజె ఎడ్మండ్సన్ 1999 జనవరి 4 న ప్రపంచవ్యాప్తంగా ఒక ఇమెయిల్ పంపబడిన తరువాత అంతర్జాతీయ అగ్నిమాపక దళ దినోత్సవం ఏర్పాటైంది. ఈ ఇమెయిల్ లో అంతర్జాతీయ అగ్నిమాపక దినోత్సవాన్ని ఏర్పాటు చేయడానికి తగిన తేదీ, చిహ్నం ఎన్నుకొవడంలో సలహాలను కోరింది అగ్నిమాపక దళ దినోత్సవంని ప్రోత్సహించడంలో సహాయపడగల ఎవరికైనా ఈ ఇమెయిల్ ను కాపీ చేసి ఫార్వార్డ్ చేయమని ప్రజలను కోరింది.అగ్నిమాపక దళ దినోత్సవం చిహ్నంగా ఎరుపు



మరియు నీలం రంగులు కలిగిన రిబ్బన్ ను జె. జె ఎడ్మండ్సన్ ఎంచుకుంది. ఎందుకంటే ఎరుపు రంగు అగ్నిని, నీలం రంగు నీటిని సూచిస్తాయి. ఎరుపు మరియు నీలం రంగులను అత్యవసర సేవలను సూచించడానికి ప్రపంచవ్యాప్తంగాఉపయోగిస్తారు. అందువల్ల అంతర్జాతీయ అగ్నిమాపక దళాన్ని ను గుర్తించడానికి ఎరుపు మరియు నీలం రంగులు ఉత్తమ ఎంపిక అనిచెప్పవచ్చు.1944 ఏప్రిల్ 14న అప్పటి బాంబే నౌకాశ్రయం లోని విక్టోరియా డాక్ వద్ద ఎస్ఎస్ ఫోర్ట్ స్టికిన్ ఓడలో జరిగిన అగ్ని ప్రమాదంలో వందలాది మంది మృతి చెందారు. అక్కడ అగ్నిని ఆర్పడానికి ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బందిలో 71 మంది ప్రాణాలు కోల్పోయారు.

సహాయక చర్యల సమయంలో ప్రాణాలను అర్పించిన అగ్నిమాపక సిబ్బంది జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం మన దేశంలో ఏప్రిల్ 14 న జాతీయ అగ్నిమాపక దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారు.ఈ కార్యక్రమాలు ఏప్రిల్ 20వరకు జరుగుతాయి.డ్యూటీలో ఉండగా ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక దళ సిబ్బందికిదేశంలోనిఅగ్నిమాపక కేంద్రాల వద్ద నివాళి అర్పించి, గౌరవ సూచకంగా అగ్నిమాపక సిబ్బంది రెండునిమిషాలపాటు మౌనాన్ని పాటిస్తారు.బస్టాండ్, రైల్వేస్టేషన్, పార్కు, పాఠశాలలు, సినిమా థియేటర్లు, ఫంక్షన్ హాల్స్, ఆస్పత్రులు, గ్యాస్ గోడౌన్, పరిశ్రమలలో మాక్ డ్రిల్స్ నిర్వహిస్తారు.అగ్నిప్రమాదాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుత పరిస్థితులలో టపాసులు కూడా ఎక్కువగా కాలుస్తున్నారు. వీటి వల్ల శబ్ద కాలుష్యం కూడా పెరుగుతుంది. వివిధ వేడుకలని నిర్మలంగా, ప్రశాంతంగా చేసుకోవడం ద్వారా చాలా ప్రమాదాలని నివారించవచ్చు.ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు చెప్పాలి. ఇందుకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలి.వారం రోజుల పాటు వీనిని నిర్వహిస్తారు

**కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా**
**9848445134**

## పాఠశాల టాపర్‌కు ఘన సన్మానం



**మిరుదొడ్డి, మే 3 (నినాదం):** మార్చి 2026 లో నిర్వహించిన పదవతరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి 544/600 మార్కులు సాధించిన మొగుళ్ళ వరుణ్ ను ఆదివారం రోజున తన స్వగృహంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సాన యాదగిరి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి అత్యధిక మార్కులు సాధించడం హర్షణీయమని అన్నారు. తల్లి దండ్రుల కలలు నెరవేరేలా పట్టుదలతో ఉన్నత చదువులు అభ్యసించి అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా జీవిత లక్ష్యం దిశగా కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మంచి భావి భారత పౌరులుగా ఎదిగినపుడే తల్లి దండ్రులు గర్వపడుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తు. రాజిరెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ తీసుకొచ్చిన సంక్షేమమే తెలంగాణకు మణిహారం

**ప్రజా పాలనను తిరస్కరిస్తూ**
**బిఆర్ఎస్‌కు జై కొడుతున్న ప్రజలు**
**కాంగ్రెస్‌కు చెందిన 150 మంది**
**యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరిక**
**మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి**





**జవహర్‌నగర్, మే 3 (నినాదం):** కెసిఆర్ తీసుకువచ్చిన సంక్షేమమే తెలంగాణకు మణిహారమైందని కాంగ్రెస్ పై ప్రజల్లో ఆదరణ తగ్గిందని ప్రజా పాలనను తిరస్కరిస్తూ బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ప్రజా సమస్యలపై కొట్లాడుతూ ప్రజల సమస్యలను తీర్చేది రాబోయే బిఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ శాంతినగర్ ప్రాంతానికి చెందిన తమిళనాడు నుండి వచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్న తమిళ సోదరులు 150 మంది కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీ జవహర్ నగర్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బోయిన్పల్లి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ జాతిపిత కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి ప్రస్తుతం కనిపించడం లేదని తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన ఘనత ఒక్క కేసీఆర్ కే దక్కుతుందన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలతో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను ఇచ్చి గద్దెనెక్కిందని అలవి కాని హామీలు నెరవేరని పథకాలతో ప్రజలను మభ్యపెట్టి ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. ప్రజాపాలనను తెలంగాణ ప్రజలు తిరస్కరిస్తున్నారని రాబోయేది కేసీఆర్ ఆధ్వర్యంలోని బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. దేశానికి దిక్సూచిగా తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందన్నారు. తెలంగాణ వాసులనే గాక వలస కార్మికులను అక్కున చేర్చుకొని ఉపాధి చూపించిన ఉద్యమ నేత మన కేసిఆర్ యే అని అన్నారు.

ఆదివారం దాదాపు 150 మంది తమిళులు కార్యకర్తలు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గులాబీ కండువా కప్పుకొని బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మేకల కావ్య, జిల్లా నాయకుడు ఆలూరి రాజశేఖర్, మాజీ కార్పొరేటర్ పల్లపు రవి, జిట్టా శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యులు శోభా రెడ్డి, ఉపాధ్యక్షుడు రంగుల సతీష్, ప్రధాన కార్యదర్శి రెడ్డి శెట్టి మహేష్, యూత్ జనరల్ సెక్రటరీ దిలీప్, అహ్మద్, విలాసాగర్ రవి, సతీష్, మురుగన్, సాగర్, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలు పరిష్కరించాలని
## కూన శ్రీశైలం గౌడ్‌కు వినతి



**కుత్బుల్లాపూర్, మే 3 (నినాదం):** కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ను ఆదివారం షాపూర్ నగర్ లోని ఆయన నివాసంలో శ్రీ వెన్ ఎన్క్లేవ్ నూతన అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు తమ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం కల్పించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కూనా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వీలైనంత తొందరలో మున్సిపల్ అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బుచ్చిరెడ్డి, శ్రీ వెన్ ఎంక్లేవ్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, సభ్యులు సోమరాజు, శ్రీనివాస్ రెడ్డి, రవీంద్రనాథ్, శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 12వ వార్డులో పనులు చేపట్టిన సఫాయి కార్మికులు



**వెల్దుర్తి, మాసాయిపేట/ మే 3 (నినాదం):** మాసాయిపేట మండలం కేంద్రంలోని గల మాసాయిపేట పట్టణంలోన శ్రీనివాస్ నగర్ కాలనీ 12 వ, వార్డులో, మురికి కాలువలు, సఫై కార్మికులు, పనులు చేపట్టడం జరిగింది. అని మాసాయిపేట గ్రామ సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి అన్నారు. అనంతరం గ్రామంలో ఎలాంటి డ్రైనేజీలు పైప్లైన్ లీకేజీలు పెద్ద పెద్ద మేజర్ సమస్యల పనులు ఎక్కడెక్కడ ఉన్నాయో త్వరలోనే చేపట్టడం జరుగుతుంది. అదేవిధంగా గల్లీలలో ఎలాంటి చెత్త చెదారం ఉండకుండా దుర్వాసన రాకుండా కాలనీలలో ఉన్న కుటుంబాల నివాసులకు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అదే విదంగా ఎండలు బాగా ఉన్నందున గ్రామ ప్రజలు సమయానికి పనులు చేసుకొని ముగించుకొని క్షేమంగా ఇంటికి చేరాలని గ్రామ సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.

## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

**పట్టణ సిఐ శివశంకర్**



**కోదాడ, మే 3(నినాదం):** యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి అలవాటులను అలవర్చుకోవాలని పట్టణ సీఐ కె శివశంకర్ అన్నారు కోదాడ పట్టణ బాలల ఉన్నత పాఠశాలలో జిల్లా యువజన శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత వాలిబాల్ శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించి యువకులతో క్రీడాకారులతో మాట్లాడారు. గ్రౌండ్‌ని నమ్ముకున్న వారు ఎప్పుడు చెడిపోరని మంచి అలవాటుకు దగ్గరగా ఉంటారని మీరందరూ ప్రతిరోజు క్రీడ కోసం సాధన చేయటం అభినందనీయమని అన్నారు అదేవిధంగా ప్రతిరోజు క్రీడాకారులకు పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ సీనియర్ సిపిఐ నాయకులు భద్రం భద్రారెడ్డినీ ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచులు సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు వాకర్ సభ్యులు పాల్గొన్నారు

## బండ్లగూడ జాగీర్‌లో చలివేంద్రం ప్రారంభం

**బాటసారులకు ఉపశమనం**



**రాజేంద్రనగర్ మే 3 (నినాదం):** బండ్లగూడ జాగిర్‌లో చలివేంద్రం ప్రారంభించిన ఆర్యవైశ్య సంఘం వేసవి కాలం దృష్ట్యా పెరుగుతున్న ఎండల తీవ్రత నుండి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ఆర్యవైశ్య సంఘం బండ్లగూడ జాగీర్ సేవా దృక్పథంతో ముందుకు వచ్చింది. గిరిధారి అవిజ్ఞ అపార్ట్మెంట్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని ఆదివారం గిరిధారి అవిజ్ఞ అపార్ట్మెంట్ కమిటీ అధ్యక్షులు నర్సింహారెడ్డి ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా సుమారు వంద మందికి పైగా బాటసారులకు, స్థానికులకు చల్లటి మజ్జిగను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రావికంటి వినయ్ మాట్లాడుతూ త్వరలోనే కాళిమందిర్ సమీపంలో శ్రీ వెంకట రమణ జువెలర్స్ అధినేత పలబట్ల సతీష్ ఆధ్వర్యంలో మరో చలివేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు, అపార్ట్మెంట్ రావికంటి వినయ్ కుమార్ అధ్యక్షుడు, సుంకు లక్ష్మీనారాయణ ప్రధాన కార్యదర్శి, వినోద్ కుమార్ కొక్కుళ్ళ కోశాధికారి, రావికంటి ఆదిత్య జాయింట్ సెక్రెటరీ, కార్యవర్గ సభ్యులు అమరవాది నరేష్ కుమార్, మద్దెర్ల శ్రావణకుమార్, బెస్త వేముల సుదర్శన్, విట్టా వీరేందర్. ఐవీఎఫ్ ప్రతినిధులు: కట్కూరి వీరేశం, చిగుళ్ళపల్లి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### నేడు రైతు వార్షికోత్సవం



**వికారాబాద్, మే 3 (నినాదం):** తెలంగాణ ప్రభుత్వం నిర్వ హిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక, 99 రోజుల ప్రణాళికలో భాగంగా నేడు నిర్వహించనున్న రైతు వారోత్సవం కార్యక్రమాన్ని నవాబుపేట రైతు వేదిక కార్యాలయంలో నిర్వహించబడుతుందని ఏ వో జ్యోతి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట చించల్ పేట, పులుమాండి, ఎల్లకొండ , మినపల్లి కలాన్ గ్రామాల రైతులు హాజరు కావాలని అన్నారు. సమయం ఉదయం 8:30 గంటలుగా నిర్ణయించామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాపతినిధులు, అధికారులు, ఏ ఎం సి చైర్మెన్, డైరెక్టర్లు, వ్యవసాయశాఖ అందించే సలహాలను రైతులు అంది పుచ్చుకుని మెరుగైన దిగుబడులు సాధిస్తారని ఆశిస్తున్నామని ఆమె చెప్పారు.

## కుప్పకూలిన రియల్ భూమ్

**• అధిక వడ్డీలు భరిస్తున్న వైనం**




**వికారాబాద్, మే 3(నినాదం ):** వికారాబాద్ జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలింది. పెట్టుబడులు పెట్టిన వారు వ్యాపారం లేక కొట్లాది రూపాయలు స్థంభించి పోయాయి. వడ్డీలు చెల్లించలేక నానా తంటాలు పడుతున్నారు. జిల్లా లో ముఖ్యంగా పరిగి, నవాబుపేట, మోమిన్ పేట, మర్పల్లి, వికారాబాద్ మండలాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం గతంలో దేదీ ప్యమాణంగా కొనసాగింది. దీంతో అనేకమంది ఈ ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేశారు. గత రెండు సంవత్సరాలనుండి భూముల క్రయ విక్రయాలు పూర్తిగా మందగించడంతో పెట్టుబడి దారులు ఛతికలబడ్డారు. దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. ఎంతో కొంత భూమి విక్రయించి ఉన్న అప్పులు చెల్లించి ఏదైనా పనులు చేసుకుందామంటూ పూర్తి భరోసాతో ఉన్న వారి నడ్డి విరిగింది. చేసిన అప్పులకు వడ్డీ పెరుగుతోంది. చేయాలనుకున్న పనులులు ముందుకు సాగటం లేదు అంటూ తలపట్టుకుంటున్న వారు కొండరైతే, భూములు రిజిస్ట్రేషన్ చేయించి అధిక వడ్డీకి డబ్బులు తీసుకుని పనులు గడుపుతున్న వారు కొందరు. ఈ విధానానికి మధ్యవర్తులు ఉంటున్నారు. అప్పు ఇప్పించినందుకు కూడా కమిషన్ పొందుతున్న తీరు కోన సాగుతున్నది. ముందుగానే మూడు నెలల వడ్డీ తీసుకుని అప్పులు ఇస్తూ వ్యాపారం చేసుకునే విధానం కొనసాగుతున్నది. ఉన్న భూమిని పై పూర్తి హక్కులు కల్పిస్తూ అప్పుతీసుకుంటున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. ఇద్దరిమధ్య బాండు పేపరు ఒప్పందము తప్ప భూమిపై అప్పు ఇచ్చిన వారికి పూర్తి హక్కు కల్పిస్తూ చేస్తున్న అప్పు ముప్పుగా మారుతుందని భయాందోళన చెందుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పరిస్థితి ఇలాగే ఉంటే పరిస్థితి చేతులు దాటుతోందని భావిస్తున్నారు. మూడు రూపాయల నుండి నాలుగు రూపాయల వరకు వడ్డీ కి అప్పులు తీసుకుంటున్న తీరు ఆందోళన కరంగానే మారిందని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ సారి వేసవిలో స్థానిక ఎన్నికల అనంతరం రియల్ ఎస్టేట్ పుంజుకుంటుందని భావించి అప్పులు చేసిన వారు తీవ్ర ఆందోళన చెబిడుతున్నారు. పాపం పెరిగినట్లు వడ్డి పెరుగుతుందని అప్పు తీసుకున్న వారు, అప్పు ఇచ్చిన అసలు, వడ్డీకి రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమి విలువ సరిపోలేని స్థితి కూడా ఉన్నదని అప్పు ఇచ్చిన వారు ఆందోళన వ్యక్తం చెందుతున్నారు. ఇద్దరిని దరి చేర్చేది రియల్ ఎస్టేట్ వ్యాపారమే ఎం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రేపు సన్మానం




**మిరుదొడ్డి, మే 3 (నినాదం):** మండల పరిధిలో మార్చి 2026 పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గౌరవించేందుకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు పెద్దిరాజు, తుమ్మల బాలరాజు, అందె రాంచంద్రం తెలిపారు. ఆదివారం రోజున మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ 500కు పైగా మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉత్తమ ప్రతిభ విద్యా పురస్కారాలు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 5వ తేదీ ఉదయం 9 గంటలకు మిరుదొడ్డి మండల కేంద్రంలోని రామాలయం కళ్యాణ మండపంలో ప్రభుత్వ విద్యా పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నమన్నారు . ఈ కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథులుగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి ప్రవీణ్ బాబు హాజరవుతారన్నారు . విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించడం, ప్రతిభను ప్రోత్సహించడం, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు విద్యాభిమానులు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విద్యా పరిరక్షణ వేదిక సభ్యులు అందే ప్రవీణ్, మొగుళ్ళ ఐలయ్య, దశరథం, శ్రీనివాస్, కనకరాజు, స్వామి, నరేష్, కుమార్, లచ్చయ్య, ప్రశాంత్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి వడ్ల కుప్పలు కనబడతలేవా?

**• మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి**



**కొడంగల్, మే 3(నినాదం):** రాష్ట్రంలో రైతులు వరి కోతలు కోసి నెల రోజులు గడుస్తున్న, వడ్లు కొనుగోలు చేయకపోవడం ఏంటని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. వడ్లు కోసి కుప్పలు పెట్టుకున్నటువంటి రైతులు అకాల వర్షాలు గనుక కురిస్తే ధాన్యం తడిసిపోతుందేమోనని దిగులు చెందుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ వడ్లకుప్పలు కనిపించడం లేదా అని హెచ్చరించారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరవాలని తక్షణమే గ్రామ గ్రామాన వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వడ్ల కొనుగోలును ప్రారంభించాలని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల ప్రేమ లేదని సన్నవడ్ల కు బోనస్ ఇవ్వలేదని మద్దతు ధర ప్రకటించలేదని వడ్ల కొనుగోలు ఆలస్యం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటిదాకా పూర్తి స్థాయిలో రుణమాఫీ జరగలేదని కోడంగల్ నియోజకవర్గం లో ఏ ఒక్క గ్రామంలోనైనా 100% రుణమాఫీ జరిగితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీని ఒప్పించి పోటీలో నుంచి తప్పుకుంటానని దమ్ముంటే తన సవాల్ ను స్వీకరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతి ఏటా రెండు పంటలకు రైతుబంధు ఇచ్చామని, అప్పట్లో మూడు పంటలకు ఇవ్వాలన్న రేవంత్ రెడ్డి రైతు భరోసా ఇచ్చేందుకు ఆసక్తి చూపడం లేదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి అధికారం చేపట్టిన తర్వాత మూడు పంటలు కాదు కదా ఒక పంటకు కూడా రైతు భరోసా ఇవ్వడం లేదని పూర్తిస్థాయిలో రైతు భరోసా నిధులు అందడం లేదని అసహనం వ్యక్తం చేశారు రాష్ట్రంలో ప్రతి రైతు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని ప్రజలు ఎక్కడ కూడా సంతోషంగా లేరని వచ్చే ఎన్నికల్లో 100% బిఆర్ ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో కోట్ల యాదగిరి చాంద్ పాషా మహేందర్‌రెడ్డి చేరి నారాయణరెడ్డి, గుండుగారి తిరుపతయ్య, రమణారెడ్డి బండ శ్రీనివాస్ రవి గౌడ్ మహేందర్ నరేష్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేకపూజలు నిర్వహించిన సాయికుమార్ లింగాయత్



**మల్కాజిగిరి, మే 3 (నినాదం):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ సఫీల్ గూడా కి చెందిన శెట్టి సాయి కుమార్ లింగాయత్ పుట్టినరోజు సందర్భంగా కమల నగర్ లోని శివాలయం గుడి లో శివాయ కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి చేతుల మీదుగా ఆశీర్వాదం తీసుకొని శివ స్వామి కి శంకర స్వామి కి వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

**చిలుక ఉపేందర్ రెడ్డి**



**ఎల్ బినగర్, మే 3 (నినాదం):** వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆర్ కెపురం డివిజన్ పరిధిలోని ఎన్ టినగర్ లో వేసవి కాలంలో మంచి నీటి సమస్య తీవ్రతను తెలుసుకున్న ఉపేందర్ రెడ్డి సంబంధిత అధికారులను పిలిపించి ఎన్టీఆర్ నగర్ లో విస్తృతంగా పర్యటించి సమస్యలను తెలుసుకొని వెంటనే స్పందించి పాడైపోయిన పాత మోటార్ స్థానంలో తన స్వంత నిధులతో కొత్త మోటర్ పంపు సెట్ ను ఏర్పాటు చేశారు. రాబోయే రోజుల్లో కొత్త బోర్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం చంద్రు నాయక్, దుబ్బాక శేఖర్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ నబీ, పెద్దవూర సైదులు, కందుకూరి సుదర్శన్, షఫీ, గుణగంటి రమేష్ గౌడ్, సంతోష, విజయ్, శ్రవణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్డీఓ కార్యాలయాలలో ప్రజావాణి



**సిద్ధిపేట, బ్యూరో, మే 3 (నినాదం):** జిల్లా స్థాయిలో ఐడిఓసి తో పాటు హుస్నాబాద్, సిద్ధిపేట, గజ్వేల్ ఆర్డీవో కార్యాలయాలలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నందున ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఏ డివిజన్ వారు అక్కడే ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఆర్జీలను సమర్పించాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదివారం రోజున పత్రికా ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం "ప్రజావాణి" కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రెవెన్యూ డివిజన్ స్థాయిలో కూడా ప్రతీ సోమవారం నిర్వహించాలని జి ఓ 3 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. ప్రజలు ఏ సమస్యనైనా రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలో ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కూడా జిల్లా కేంద్రం ఐడిఓసి తో పాటు (3) రెవెన్యూ డివిజన్లలో సిద్ధిపేట, గజ్వేల్ మరియు హుస్నాబాద్ లలో కూడా ఆయా రెవెన్యూ డివిజన్ అధికారుల కార్యాలయాలలో "ప్రజావాణి" కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, జిల్లా అధికారులందరూ కలెక్టరేట్ లో జరిగే ప్రజావాణి కి హాజరవడం తో పాటు డివిజన్ స్థాయి అధికారులందరూ ఆయా డివిజన్లలో ప్రతీ సోమవారం ఉదయం 10 గంటలకు హాజరవుతారని, జిల్లా స్థాయిలో ఐడిఓసి తో పాటు హుస్నాబాద్, సిద్ధిపేట, గజ్వేల్ ఆర్డీవో కార్యాలయాలలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నందున ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఏ డివిజన్ వారు అక్కడే ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఆర్జీలను సమర్పించాలని జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజలకు సూచించారు.

### ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్



**మల్కాజిగిరి, మే 3 (నినాదం):** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బండ చెరువు వాకింగ్ ట్రాక్ వద్ద సుమారు 16 లక్షల తో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ను మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బండ చెరువు వాకింగ్ ట్రాక్ అసోసియేషన్ సభ్యులు శివరాజ్, పెంటయ్య, రమేష్, బోజీ రెడ్డి, ఆగమయ్య, సుబ్బారావు, రామ్మోహన్ రావు, యాదగిరి, గోపి, ప్రసాద్, లవకుమార్, హరిక్రిష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, ఉమేష్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

### మానసిక వికలాంగురాలికి ఆర్థిక సహాయం



**మల్కాజిగిరి, మే 3 (నినాదం):** మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు శనివారం వినాయక నగర్ డివిజన్ లోని ఒక నిరుపేద కుటుంబానికి చెందిన సంగీత (22 సంవత్సరాలు) అంగవైకల్యంతో బాధ పడుతున్న మానసిక వికలాంగురాలు కి కాంగ్రెస్ పార్టీ వినాయక్ నగర్ డివిజన్ అధ్యక్షులు పిట్టల నాగరాజు రూ. 5 వేల రూపాయలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండా నిరంజన్ రూ. 3 వేల రూపాయలు, చిన్న రూ. 2 వేల రూపాయలు మొత్తం రూ. 10 వేల రూపాయల ఆర్థిక సాయం కాంగ్రెస్ పార్టీ తరపున బాధితురాలికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వినాయక నగర్ డివిజన్ లోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళలు, యూత్, ఎన్ ఎస్ యు ఐ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 'రెనే'లో మోకాలి మార్పిడి శస్త్రచికిత్సల ప్రత్యక్షశిక్షణ విజయవంతం

రెండు రాష్ట్రాల నుంచి 220 మంది ఆర్థోపెడిక్ వైద్యులు .

అస్పత్రి చైర్మన్ ప్రొఫెసర్ డా. బంగారి స్వామి



**కరీంనగర్, మే 3(నినాదం):** రెనే ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన మోకాలి కీలు మార్పిడి శస్త్రచికిత్సల ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి రెండు రాష్ట్రాల నుంచి సుమారు 220 మంది ఎముకల వైద్య నిపుణులు హాజరై శస్త్రచికిత్సలను ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఆరు మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి, వాటిని అత్యాధునిక సాంకేతికతతో ఉత్సవ్ హాల్‌కు ప్రత్యక్ష ప్రసారం చేశారు. పాల్గొన్న వైద్యులు నిపుణుల సూచనలు, సాంకేతిక అంశాలను తెలుసుకునే అవకాశం పొందారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టోసా అధ్యక్షుడు ప్రొఫెసర్ డా. రామ్ కుమార్ రెడ్డి హాజరై ప్రసంగించారు. గౌరవ అతిథులుగా డా. అఖిల్ దాడి, డా. రజిని ప్రియదర్శిని పాల్గొన్నారు. పలువురు ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డా. బంగారి స్వామి మాట్లాడుతూ, హైదరాబాద్‌కు బయట రోబోటిక్ పద్ధతిలో మోకాలి మార్పిడి చికిత్సను అందుబాటులోకి తీసుకువచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ఖరీదైన ఈ చికిత్సను తక్కువ వ్యయంతో ప్రజలకు అందించడం తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలలో తాజా పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం పై వైద్యులకు విస్తృత అవగాహన లభించిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్యులు, అతిథులు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టోసా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డా.రామ్ కుమార్ రెడ్డి, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డా.ఆర్ముగం, డా.రత్నాకర్ రావు, డా.కృష్ణ కిరణ్, డా.అఖిల్ దాడి, డా. ఆదర్శ అన్నప రెడ్డి, డా.అఖిల సుందర్, కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షులు డా.ఆకుల శైలజ, తానా కరీంనగర్ కోశాధికారి డా .వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 12న హిందూ ఏక్తా యాత్ర, ఘన విజయానికి పిలుపు

ఇంటింటికీ ఆహ్వానం, విస్తృత ప్రచారం

భారీ జన సమీకరణపై నాయకులకు దిశానిర్దేశం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్, మే 3(నినాదం):** కరీంనగర్‌లో ఈ నెల 12న నిర్వహించనున్న "హిందూ ఏక్తా యాత్ర"ను అపూర్వంగా విజయవంతం చేసి చరిత్ర సృష్టిద్దామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా జరిగే ఈ యాత్రలో వయస్సు, వర్గ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ పాల్గొని హిందువుల ఐక్యతను ప్రదర్శించాలని ఆయన కోరారు. ప్రజలు స్వచ్ఛందంగా యాత్రకు రావడానికి సిద్ధంగా ఉన్నారని, వారికి తగిన రవాణా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. యాత్రపై మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని, నాయకులు తమ తమ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ప్రజలను ఆహ్వానించాలని పేర్కొన్నారు. ప్రతి వార్డు, గ్రామం, మండలం స్థాయిలో పెద్ద ఎత్తున జన సమీకరణ జరగాలని ఆదేశించారు. యాత్ర ఏర్పాట్లు జన సమీకరణపై కరీంనగర్‌లో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు మేయర్ కొలగాని శ్రీనివాస్, ఉపమేయర్ సునీల్ రావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. మే 12న సాయంత్రం 4 గంటలకు వైశ్య భవన్ నుండి యాత్ర ప్రారంభమవుతుందని, ఈ విషయాన్ని ప్రజలందరికీ చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి ప్రాంతంలో ఫ్లెక్సీలు, గోడలపై నినాదాలు ఏర్పాటు చేయాలని, గ్రామాలు, మండలాలు, పోలింగ్ కేంద్రాల వారీగా సమావేశాలు నిర్వహించాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన హిందూ సమ్మేళనాల విజయోత్సాహంతో ఈ యాత్రను కూడా పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని బండి సంజయ్ ఆకాంక్షించారు.

## 5న కరీంనగర్‌లో మెగా ఉద్యోగ మేళా

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పాల్గొంటున్న 100 కంపెనీలు



**కరీంనగర్, మే 3(నినాదం )** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మే 5న మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో జరగనున్న ఈ ఉద్యోగ మేళాకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, టాస్క్, డీఈఈటీ సమన్వయంతో సుమారు 100 ప్రముఖ సంస్థలు పాల్గొననున్నాయని వెల్లడించారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు విద్యాసంస్థలతో సమన్వయం చేసి డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే వాట్సాప్ గ్రూపులు, సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం విస్తృతంగా చేరేలా చూడాలని సూచించారు. కాలేజీల పూర్వ విద్యార్థుల వివరాలు సేకరించి నిరుద్యోగులకు సమాచారం అందించడంతో పాటు, టాస్క్‌లో నమోదైన యువతకు కూడా సమాచారాన్ని పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా యువజన మరియు క్రీడాశాఖ అధికారి సమన్వయం చేస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలోని నిరుద్యోగ పట్టభద్రులు ఈ ఉద్యోగ మేళాను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

తక్షణ సాయం, ప్రభుత్వ సహాయం కోసం డిమాండ్

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు



**కరీంనగర్, మే 3 (నినాదం):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలోని బుడిగ జంగాల కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక ఇల్లు పూర్తిగా దగ్ధమై తీవ్ర నష్టం జరిగింది. గృహోపకరణాలు సహా సమస్త ఆస్తి కాలిపోవడంతో బాధిత కుటుంబం ఇబ్బందుల్లో పడింది. సమాచారం అందుకున్న వెంటనే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు, మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్ సంఘ టన స్థలాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సహాయంగా ఆర్థిక సాయం అందజేసి వారికి ధైర్యం కల్పించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే సహాయం అందించి పునరావాసానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోంద్ర సాయిశ్రీ, బోడ రాజశేఖర్, వార్డు సభ్యుడు కడమంచి చందు, మాజీ ఉప సర్పంచ్ నెల్లి మురళి, మాజీ ఎంపిటిసిలు ఉండింటి సులోచన, శ్యామ్సన్, పిట్టల కవిత, మధు మరియు బీఆర్ఎస్ నాయకులు నూనె మల్లయ్య, గుర్రం కిరణ్ గౌడ్, పిండి సందీప్ పాల్గొన్నారు.

## హుజూరాబాద్‌లో హాకీ సమ్మర్ క్యాంప్‌కు క్రీడా సామగ్రి పంపిణీ



**హుజూరాబాద్, మే 3(నినాదం):** కి.శే. మోతపోతుల రమేష్ జ్ఞాపకార్థం హుజూరాబాద్‌లో నిర్వహిస్తున్న హాకీ సమ్మర్ క్యాంప్‌లో క్రీడాకారులకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. రమేష్ కుమారులు విక్రమ్, వినయ్, వైపుల్, వినీత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్యాంప్‌లో పాల్గొంటున్న క్రీడాకారులకు కోన్స్, బాల్స్‌తో పాటు అరిటిపండ్లను అందజేశారు. యువ క్రీడాకారులు క్రీడల్లో మెరుగైన ప్రదర్శన చేయాలని ఆకాంక్షిస్తూ వారు ప్రోత్సాహం అందించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ క్లబ్ సెక్రటరీ బోడిగే తిరుపతి, వైస్ ప్రెసిడెంట్ బుసరపు శంకర్, సీనియర్ క్రీడాకారులు సాధుల శామ్, సజ్జు, మాటూరి రాజేష్, పల్లపు సంబరాజు, వంశీ, రాజు తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి ప్రతిభను వెలికితీయవచ్చని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. రమేష్ సేవలను స్మరించుకుంటూ ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలని వారు తెలిపారు.



## ప్రజలకు కష్టం వస్తే... నేను ముందుంటా

డంపింగ్ యార్డ్ స్థల మార్పిడి కోసం పట్టుబట్టిన ప్రణవ్

ప్రభుత్వ పెద్దల హామీతో దీక్ష విరమణ






**జమ్మికుంట, మే 3 (నినాదం):** హుజురాబాద్ నియోజకవర్గం లోని ప్రజలకు కష్టం వస్తే తాను ముందు ఉండి పోరాడుతానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ బాబు అన్నారు. హుజురాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసే డంపింగ్ యార్డ్ ప్రాజెక్ట్ తమకు వద్దు అని దాని స్థల మార్పిడి కోసం ప్రభుత్వ పెద్దల మనసు తట్టేలా ప్రాజెక్టు గురించి దానివల్ల కలిగే అనర్థాలను గురించి నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు వివరించారు. ప్రణవ్ తెలియజేసిన అంశాలతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి హామీ ఇవ్వడంతో పాటు ప్రజలకు హాని చేసే పని కాంగ్రెస్ ప్రభుత్వం చేయదని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. 42 రోజులుగా జేఏసీ దీక్షలకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి ప్రణవ్ బాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ పై ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదన లేదని హుజురాబాద్ బిడ్డగా ఈ ప్రాంతానికి పదవి ఉన్నా లేకపోయినా నిరంతరం సేవ చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజల కష్టాలలో భాగస్వామ్య ఉంటానని వెల్లడించారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఈ విషయంపై సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయకుండా ఆదేశాలు జారీ చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హుజరాబాద్ మున్సిపల్ చైర్మన్ రెంటాల సుహాసిని జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నం పెట్టిన ఇల్లుకే కన్నం వేసే రకం ఎంపీ అరవింద్

ఎంపీగా ఎదగడానికి ఎక్కిన కొమ్మనే నరికే రకం

నేటి నీ ఈ స్థాయి కాంగ్రెస్ పార్టీ పెట్టిన భిక్ష

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు



**మెట్ పల్లి, మే 3(నినాదం):** నిజామాబాద్ ఎంపీ అరవింద్ అన్నం పెట్టిన ఇల్లుకే కన్నం వేసే రకం అని, ఎంపీగా ఎదగడానికి ఎక్కిన కొమ్మనే నరికే రకం అని నేటి నీ ఈస్థాయి కాంగ్రెస్ పార్టీ పెట్టిన భిక్షని ఆయన తండ్రి ఆ కుటుంబం అంతా కాంగ్రెస్ పార్టీ వల్లే అభివృద్ధి చెందారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు కృష్ణారావు తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. ఆదివారం మెట్ పల్లి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ రాహుల్ గాంధీ వస్త్రధారణపై నిజామాబాద్ ఎంపీ అరవింద్ చేసిన విమర్శలను తప్పుపడుతూ అగర్భ శ్రీమంతుడు రాహుల్ గాంధీ సాధారణ జీవనం గడుపుతారని, ఓ చాయ్ వాలా గా చెప్పుకునే వ్యక్తి లక్షలు ఖరీదు చేసే వస్త్రాలు ధరించడం సరైనదా అని ప్రశ్నించారు. ఎంపీ అరవింద్ కుటుంబం కాంగ్రెస్ పార్టీ వల్లనే అభివృద్ధి చెంది నేడు కాంగ్రెస్ పార్టీ నే విమర్శించే స్థాయికి ఎదిగారా? అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్లమెంటులో తెలంగాణ ఏర్పాటు గురించి తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని విమర్శించారని మొన్నటికి మొన్న బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనేది దేశ విభజనతో పోలుస్తూ పాకిస్తాన్ ఏర్పాటు లాంటిదిగా అభివర్ణించి నా దీనిని ఖండించలేదని కానీ రాహుల్ గాంధీ వేసుకున్న బట్టల గురించి విమర్శించడం నీవెంత దిగజారేవో సూచిస్తుంది అన్నారు. రాష్ట్రానికి పనికి వచ్చే మాటలు మాట్లాడాలి నియోజకవర్గానికి ఇప్పటి వరకు చేసిన పనులు ఎంటో చెప్పాలని పార్లమెంటు సభ్యులుగా ఎంపీ లాడ్స్ నిధులు ఎక్కడ ఖర్చు పెట్టారని నిలదీశారు. కోరుట్ల శాసనసభ నియోజకవర్గం నుంచి నీవు ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో నీకు పని చేసిన కార్యకర్తలని పట్టించుకో లేదని, నీకు పని చేసిన కార్యకర్త మెట్పల్లి మండలం వేంపేట మాజీ సర్పంచ్ శ్రీనివాస్ మరణిస్తే నేటికీ ఆ కుటుంబాన్ని పరామర్శించ లేదని బీజేపీ జిల్లా అధ్యక్షునిగా పని చేసిన నాయకుడు మృతి చెందిన ఆ కుటుంబాన్ని నేటి వరకు కూడా పరామర్శించని ఏకైక ఎంపీ అరవింద్ ఒక్కడేనన్నారు. మీది సంస్కారం అనిపించుకుం టుందా? వీటిని వదిలిలేసి రాహుల్ గాంధీ వస్త్రధారణ విషయంలో విమర్శించడం తగదని, మరోసారి ఇలాంటి విమర్శలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు హెచ్చరించారు. ఈ సమావేశంలో కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ భూస రాజేశ్వర్, మాజీ సర్పంచ్ గడ్డం లింగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బెజ్జారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గురువు అడుగుజాడ... విద్యార్థికి పూలబాట...

నవభారతి విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సందడి



**హుజురాబాద్, మే 03 (నినాదం):** గురువు లేని విద్య గుడ్డి విద్య" అన్న నానుడిని నిజం చేస్తూ.. హుజురాబాద్ పట్టణంలోని నవభారతి విద్యాలయం ఆదివారం నాటి స్మృతులతో కళకళలాడింది. 2003 ఎస్.ఎస్.సి బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన 'ఆత్మీయ సమ్మేళనం' విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య అనుబంధాన్ని చాటి చెప్పింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పూర్వ విద్యార్థి డాక్టర్. కందుకూరి సాయి కృష్ణ ఆహ్వానం మేరకు, ప్రధానోపాధ్యా యులు తిప్పర్తి రమణారెడ్డి, అధ్యాపక బృందం సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకను ప్రారంభించారు. మరణించిన తమ తోటి విద్యార్థులు మతిన్, జైపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు సమ్మిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యులు మాట్లాడుతూ.... "మొక్కై వంగనిది మానై వంగునా...?" అన్నట్లు, చిన్నతనం నుంచే క్రమశిక్షణ, మంచి నడవడిక అలవరుచుకుంటేనే ఉన్నత శిఖరాలను అధిరో హిస్తారని హితవు పలికారు. నాటి విద్యావిధా నంలోని విలువలను గుర్తు చేస్తూ, ఉపాధ్యా యుడి పాత్ర సమాజ నిర్మాణంలో కీలకమని పేర్కొన్నారు. "మాతృదేవోభవ" అనే సూక్తిని స్మరిస్తూ.. లోకానికి మొదటి గురువు తల్లి అని, ఆమె మార్గదర్శకత్వంలోనే విద్యార్థి ప్రాథమిక విషయాలు నేర్చుకుంటాడని ఉపాధ్యాయులు ఉద్ఘాటించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులు నిష్ణాతులు కావాలని పిలుపునిచ్చారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను మర్చిపోకుండా, విద్యార్థులందరూ ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించి, మెమొంటోలను అందజేశారు. ఇది చూస్తుంటే "శిష్యుడి గెలుపే గురువుకు అసలైన బహుమతి" అనిపించింది. ఇదే వేదికపై పూర్వ విద్యార్థి మూషం సందీప్ జన్మదిన వేడుకలను ఉపాధ్యాయుల సమక్షంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించడం విశేషం. "గత కాలము మేలు సద్గౌరవమున" అన్నట్లుగా, విద్యార్థులందరూ తమ పాఠశాల నాటి మధుర స్మృతులను నెమరువేసుకుంటూ కాసేపు చిన్న పిల్లలై గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు కామరపు శ్రీనివాస్, కేసరి మధుకర్ రావు, డింగరి సుప్రసన్న చార్యులు, బత్తిని వేణుగోపాల్, కె రవీందర్ రెడ్డి, మంతెన బిక్షపతి, అజ్జురి మేడం, మాడిశెట్టి వీరన్న, అజ్మత్ అలీ, వెంకట ముత్యం, నేపాల్ రెడ్డి, తిరుపతితో సహ పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు. కార్యక్రమ విజయవంతానికి మూషం సందీప్, బండ ప్రవీణ్, హబీబ్ అలీ, అప్రోచ్, ఫయాజ్ తదితరులు విశేష కృషి చేశారు.

## కౌన్సిలర్‌ను పరామర్శించిన ప్రణవ్..



**జమ్మికుంట, మే 3 (నినాదం):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఐదో వార్డ్ కౌన్సిలర్ యాట్ల సునీత అశోక్ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించిన నియోజకవర్గ ఇంచార్జ్ ప్రణవ్. ఆదివారం అశోక్ నివాసానికి చేరు కున్న ప్రాణం ప్రమాదానికి గల కారణాలు తెలుసు కొని ఆయనను పరామర్శించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశీ నీ కోటి ములుగురి సదయ్య సాయిని రవి పొన్నగంటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రం విజయను పరామర్శించిన ప్రణవ్



**జమ్మికుంట, మే 3 (నినాదం):** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి మాతృమూర్తి అనారోగ్యంతో బాధ పడుతుండగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించిన నియోజకవర్గం ఇంచార్జ్ ప్రణవ్ బాబు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని కొత్త పెల్లిలో నివాసం ఉంటున్న సతీష్ రెడ్డి నివాసానికి చేరుకున్న ప్రణవ్ ఎర్రం విజయ పక్షవాతంతో బాధపడుతుందని తెలుసుకొని వారిని పరామర్శించారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సరైన వైద్యాన్ని తీసుకుంటూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు పొన్నగంటి మల్లయ్య దేశినీ కోటి మహమ్మద్ సజ్జు వీరన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కారు బోల్తా... ఇరువురికి తీవ్ర గాయాలు



**హుస్నాబాద్ ఏప్రిల్ 3 (నినాదం):** హుస్నాబాద్ మండలం పందిల్ల వంతెన సమీపంలో ఒక దారుణ మైన కారు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నగరం నుండి శ్రీరాములపల్లికి ప్రయాణిస్తున్న ఒక కారు, మార్గమధ్యలో ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాద సమయంలో కారులో మొత్తం నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. దురదృష్టవశాత్తూ, ఈ ప్రమాదంలో దివ్య తేజ (32) మరియు ఆమె కుమారుడు నిహాన్ రెడ్డి (11) తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో కారులో ఉన్న గంగం శ్రీధర్ రెడ్డి (40) మరియు అతని కుమార్తె శ్రీనిక (6) స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన దివ్య తేజ , నిహాన్ రెడ్డిలను మెరుగైన వైద్య చికిత్స అందించడం కోసం వెంటనే హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు అక్కడ చికిత్స పొందుతున్నారు.

## నగరంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులకు భూమిపూజ..

అన్ని డివిజన్ల సమగ్ర అభివృద్ధే లక్ష్యం : మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, మే 3(నినాదం)** కరీంనగర్ నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం పాలకవర్గ ప్రధాన లక్ష్యమని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా ఆదివారం 21వ డివిజన్‌లో పర్యటించిన ఆయన, డ్రైనేజీ మరియు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ పనులు నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి రూ.17.20 లక్షలతో చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో నగరంలోని అన్ని 66 డివిజన్లను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలు, విలీన గ్రామాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అర్బన్ ఛాలెంజ్ నిధుల ద్వారా ప్రతి డివిజన్‌కు నిధులు కేటాయించి సమగ్ర అభివృద్ధి సాధిస్తామని చెప్పారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## నేటి నుండి హుజరాబాద్‌లో ప్రజావాణి...

డివిజన్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

హుజరాబాద్ ఆర్డీవో రమేష్ బాబు




**జమ్మికుంట, మే 3 (నినాదం)** హుజురాబాద్ డివిజన్ లో ఇకనుండి ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని హుజురాబాద్ ఆర్డిఓ రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం తో పాటు వివిధ మండల కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది. కానీ డివిజన్స్ పై అధికారులంతా ఒకే చోట ఉండే విధంగా ఏర్పాటు చేసి ప్రజావాణి కార్యక్రమాన్ని హుజురాబాద్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించడానికి ఏర్పాటు చేశారు. హుజురాబాద్ డివిజన్ పరిధిలోని ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లకుండా వారి సమస్యల పరిష్కారం కోసం హుజురాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో పరిష్కరించుకోవాలని వారు సూచించారు. మండల తాసిల్దార్ కార్యాలయాలతో పాటు రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో కూడా ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం కొనసాగుతుందని ఈ అవకాశాన్ని హుజురాబాద్ డివిజన్ పరిధిలో గల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## ధాన్యం కొనుగోలులో జాప్యం వహిస్తున్న ప్రభుత్వం
## ఇబ్బందులకు గురవుతున్న రైతులు
### మాజీ మంత్రి రెడ్యానాయక్

**డోర్నకల్ /మరిపెడ మే 03(నినాదం):** రైతులు ఆరుగాలం కష్టం పండించిన ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయడంలో జాప్యం వహిస్తూ రైతులకు ఇబ్బందులకు గురి చేస్తుందని మాజీ మంత్రి డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత రెడ్యానాయక్ అన్నారు. ఆదివారం రోజున మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ గోదాం సమీపన సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి రెడ్యానాయక్,జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు తో కలిసి పర్యవేక్షించారు. నెల 15 రోజులు కావస్తున్న ధాన్యాన్ని కొనుగోలు చేసేవారు లేక ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టించి పండించిన



పంటను అమ్ముకోవడంలో కూడా రైతులు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు పంట పండించడం అధిక ఖర్చులతో కూడిన భారం అవుతుందని,అందులో ధాన్యం అమ్ముడుపోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. మాజీ మంత్రి రెడ్యానాయక్ కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్న సొసైటీ వారిని మందలించి త్వరితగతిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని అన్నారు. సరిపోను గోనె సంచులను రైతులకు అందజేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు తీవ్ర ఇబ్బందులు పెడుతుందని,ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతుల ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయక ఇబ్బందులకు గురి చేయడం సరి కాదన్నారు. పెట్టుబడి సహాయంగా రైతు భరోసా అందించకుండా సమయాన్ని పెంచుతూ ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చకుండానే,ఆరా కొర రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. ఇప్పటికైనా రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలన్నారు. వారితోపాటుగా వార్డ్ బీఆర్ఎస్ నాయకులు,కౌన్సిలర్లు,సర్పంచులు,వార్డ్ మెంబర్లు,కార్యకర్తలు ఇంకా తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్ పట్టా అందుకున్న మౌనిక



**అమరచింత, మే 3, (నినాదం):** అమరచింత పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు మహిపాల్ కూతురు డాక్టర్ మౌనిక సంగారెడ్డి జిల్లాలో మహేశ్వర మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ఆదివారంకళాశాలలో ఏర్పాటుచేసిన స్నాతకోత్సవ కార్యక్రమంలో మౌనిక కు కళాశాల డైరెక్టర్ డాక్టర్ కృష్ణారావు చేతుల మీదుగా డాక్టర్ పట్టాను మౌనికకు అందజేశారు. డాక్టర్ మౌనికకు, కుటుంబ సభ్యులకు ప్రజా ప్రతినిధులు విద్యాభిమానులు పట్టణ ప్రజలు అభినందనలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మున్సిపల్ చైర్పర్సన్



**అమరచింత, మే 3, (నినాదం):** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 5 వార్డు లో నూతనంగా నిర్మించిన లబ్ధిదారుల ఇందిరమ్మ ఇంటిని ఆత్మకూరు మున్సిపల్ చైర్పర్సన్ నాగమణి, వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు శశి వారి కలలను సాకారం చేస్తున్నామని అన్నారు. మక్తల్ నియోజకవర్గంలో మంత్రి వాకిటి శ్రీహరి గతంలో ఏ ప్రభుత్వము చేయనంత విధంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దండు శ్రీనివాసులు కోట్ల తిరుపతి సద్దల తులసి వెంకటరములు అజ్మతుల మహేష్ తో పాటు ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా నిర్విరామంగా కృషి చేస్తున్నా..
### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
### అంతర్గత రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**హనుమకొండ, మే3 (నినాదం):** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధే ప్రధాన అజెండాగా నిరంతరం శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కాజీపేట 63వ డివిజన్ పరిధిలో రూ.163 లక్షల వ్యయంతో చేపట్టిన అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సంబంధిత కాంట్రాక్టర్లు పనుల్లో అలసత్వం ప్రదర్శించకుండా సకాలంలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. గడిచిన రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రతి డివిజన్లో గతంలో ఎన్నడూ జరగని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని ఆయన స్పష్టం చేశారు. గత పాలకుల పాలనలో నియోజకవర్గం కేవలం శంకుస్థాపనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నారని అందుకు ప్రజల సహకారం కూడా అవసరమని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల నాటికి కాజీపేటను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి నూతన రూపంలో తీర్చిదిద్దే బాధ్యతను తీసుకుంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## నూతన దంపతులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం



**చింతపల్లి, మే 3(నినాదం):** అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ కుమారుడి వివాహ మహోత్సవ కార్యక్రమం మన్నెగూడలోని బి ఎస్ ఆర్. ఫంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ వివాహ వేడుకలో పాల్గొని, కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు నేనావత్ దేవరన్ నాయక్ కూడా పాల్గొని, వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

# గొడ్డు ఏడ్చిన ఏదొడ్డి బాగుపడలే..
# రైతు ఏడ్చిన ఏ రాజ్యం బాగుపడలే

### మునుగోడు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి

**మునుగోడు, మే 3 (నినాదం):** మునుగోడు నియోజకవర్గం,చౌటుప్పల్ మండలం. చిన్న కొండూరు గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి. అనంతరం రైతుల పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ, “గొడ్డు ఏడ్చిన ఏ దొడ్డి బాగుపడలే... రైతు ఏడ్చిన ఏ రాజ్యం బాగుపడలే” అని వ్యాఖ్యానిస్తూ, ప్రభుత్వం ధాన్యం కొనుగోలు వ్యవహారంలో తీవ్ర జాప్యం చేస్తూ రైతులను నయవంచనకు గురిచేస్తోందని మండిపడ్డారు. మండుతున్న ఎండలో రైతులు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోకుండా కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడం దారుణమన్నారు. ధాన్యం కేంద్రాలకు తీసుకొచ్చి 30 రోజులు గడిచినా తూకాలు వేయకపోవడం, అరకొరగా కొనుగోలు చేయడం, తాలు పేరుతో క్వింటాకు 8 కిలోల వరకు కోత విధించడం ద్వారా రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ యంత్రాల లోపాలు, సిబ్బంది కొరత కారణంగా కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతోందని పేర్కొన్నారు. అధికారులను నిలదీస్తూ తక్షణమే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, తాలుతూకాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు. రైతులకు తాగునీరు, నీడ, విశ్రాంతి కోసం షెడ్లు,సదుపాయాలు వంటి కనీస సౌకర్యాలు వెంటనే ఏర్పాటు



చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా సమయానికి నేరుగా వారి ఖాతాల్లో జమ చేయాలని, మధ్యవర్తుల జోక్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే ఈ ప్రాంతం గానీ, రైతుల సమస్యలు గానీ పట్టించుకోవడం లేదని, రైతు కుటుంబం నుంచి వచ్చానని చెప్పుకోవడం తప్ప రైతుల కోసం ఎప్పుడూ పోరాడలేదని తీవ్రంగా విమర్శించారు. రైతుల పక్షాన నిలబడి సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. అబద్ధాలు ఆడి అధికారంలోకి వచ్చింది కాక రైతుల పట్ల నిర్లక్ష్యం కొనసాగితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, అవసరమైతే రైతులతో కలిసి పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

## ఘనంగా పత్రికా స్వేచ్ఛ దినోత్సవం..
### జర్నలిస్టుల క్రికెట్ సందడి



**కోదాడ,మే 2(నినాదం):** ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా కోదాడ పట్టణంలోని జర్నలిస్టులు ఆదివారం క్రికెట్ ఆడుతూ ఉత్సాహంగా గడిపారు. రోజువారీ వార్తా సేకరణ పనిలోనుంచి కొంత విరామం తీసుకుని క్రీడల ద్వారా స్నేహభావం, ఐక్యతను మరింత బలపరిచారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కూడా పాల్గొని యువ జర్నలిస్టులను ప్రోత్సహించారు. ఆట సందర్భంగా సరదా క్షణాలు చోటుచేసుకుని వాతావరణం ఆనందంగా మారింది. ఈ కార్యక్రమం జర్నలిస్టుల మధ్య అనుబంధాన్ని మరింత పెంచింది.

## ప్రతి సోమవారం రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి

- నేటినుండి ప్రారంభం
- జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి మే 3 (నినాదం):** ఇకపై ప్రతి సోమవారం ఆర్డిఓ కార్యాలయాలలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ స్థాయి ప్రజావానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన ఆర్ డి ఓ లను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లా కేంద్రంలో మాత్రమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని, అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక పై ప్రతి సోమ వారం ఆర్డిఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు. డివిజన్ సాయి ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ డివిజనల్ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు .డివిజన్ పరిధిలోని డివిజనల్ అధికారులు అందరూ డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశించారు. డివిజనల్ పంచాయతీ అధికారి, డిప్యూటీ డిఎంహెచ్ఓ, వ్యవసాయ సహాయ సంచాలకులు, డిస్కాం డీఈలు,ఆర్ అండ్ బి,ఆర్ డబ్ల్యు ఎస్,హౌసింగ్ డి ఈ ఈ లు,సీడీపీవో లు,సహాయ ఎస్ సి,ఎస్ టి,బి సి అభివృద్ధి అధికారులు, డివిజన్ స్థాయి ప్రజావాణి



కార్యక్రమానికి హాజరుకావాలని ఆదేశించారు. జిల్లా అధికారులందరూ వారి శాఖకు సంబంధించిన అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరయ్యేలా,ఆదేశించారు. డివిజన్ స్థాయిలో నిర్వహించే ప్రజావానికి వచ్చిన పిటిషన్లు అన్నింటిని ఆన్లైన్ చేయాలని, ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని చెప్పారు.. ఫిర్యాదులన్నింటినీ సాధ్యమైన త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

## పంట పొలాల్లో సీసీ కెమెరాలు
### సిఐ చరమందరాజు



**హుజూర్నగర్ మే 03 (నినాదం):** హుజూర్ నగర్ పరిధిలో పంట పొలాల్లో దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అప్పన్నపేట, కీతవారిగూడెం శివారుల్లో సోలార్ సీసీ కెమెరాల ద్వారా నిఘా పెంచారు. మోటర్లు, కేబుల్ వైర్లు, వ్యవసాయ పరికరాల దొంగతనాలు పెరగడంతో ఈ చర్యలు చేపట్టారు. రాత్రి వేళ రైతులు జాగారం చేయాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. ఈ సాంకేతిక నిఘాతో రైతులకు భద్రత పెరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు, రైతులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వం

### సిపిఐ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు

**అమరచింత, ఏప్రిల్ 3, (నినాదం):** 141వ సంవత్సరాల క్రితం చికాగో నగరంలో ప్రాణాలు బలిపెట్టి సాధించుకున్న 8 గంటల పని దినాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తు 18 గంటలు పని చేయించుకుంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి కె విజయ రాములు ఆరోపించారు. అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని సిపిఐ జెండా కట్ట వద్ద ఆదివారం సిపిఐ ఆధ్వర్యంలో 141 వ మే డే నేడే ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్యాంసుందర్ మే డే నువ్వు పురస్కరించుకొని కార్మికులతో తలచిన ఎర్ర దుస్తులనే గుర్తు జెండాగా ఎగురవేశారు. అనంతరం విజయరాములు మాట్లాడుతూ 1886లో అమెరికాలోని చికాగో నగరంలో ఎనిమిది గంటల పని దినం కోసమే కార్మికులు పేద ఎత్తున ఉద్యమాన్ని లేవదీయగా అప్పుడు జరిపిన పాల్పుల్లో వందలాదిమంది మృతి చెందగా వారి రక్తంతోనే తడిసిన గుడ్డలనే నేడు ఎర్రజెండా తో మే డే ఉత్సవాలను జరుపుతున్నామని అన్నారు. భారత దేశంలో పాలక ప్రభుత్వాలని కార్మికుల హక్కులను వస్తున్నాయని నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల రైతుల అనేక రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల చెమటను దోచి కార్పొరేట్ శక్తులకు అప్పనంగా గడ్డబెడుతున్నారని ఆరోపించారు. నేడు దేశవ్యాప్తంగా రైతులు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్య చేసుకుంటున్నారని వ్యవసాయ కూలీలు పనిచేస్తున్న ఉపాధి కూలీ పై ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని అన్నారు. ఆనాడు కార్మికులు చూపిన తెగువతో పాలక ప్రభుత్వాలపై పోరాటాలు




నిర్వహించాలని పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లాలోని అనేక రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల హక్కుల కోసం సిపిఐ అలుపెరుగని పోరాటం నిర్వహిస్తుందని అన్నారు. వీడి కార్మికులకు చాలీచాలని వేతనాలు ఇస్తూ యాజమాన్యాలు వారి శ్రమను దోచుకుంటున్నాయని ఆరోపించారు. హక్కుల కోసం సిపిఐ నిర్వహించే ప్రతి పోరాటంలో కార్మికులు కర్షకులు కూలీలు కలిసి రావాలని అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గీతాలను ఆలపించి పట్టణ ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి రవీందర్,, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు శ్రీహరి, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ లక్ష్మీనారాయణ ఎర్రన్న రఘు అంజి సౌలు తోపాటు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రతి మనిషికి ఆరోగ్యమే గొప్ప సంపద






### జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పి శరత్ చంద్రపవర్

**నల్లగొండ ప్రతినిధి మే 3 (నినాదం):** మనిషికి ఆరోగ్యమే గొప్ప సంపద అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ అన్నారు. శారీరక, మానసిక దృడత్వం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం ,ఆరోగ్యం పట్ల ప్రజలలో అవగాహన కల్పించే నిమిత్తం సొసైటీ ఫర్ తెలంగాణ రన్ ఆధ్వర్యంలో అవంతిక కన్స్ట్రక్షన్స్, ఆరోగ్య హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానం నుండి ఏర్పాటుచేసిన 2 కె,5కే ,10 కే రన్ లను ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో ప్రజల ఆరోగ్య విషయమై ఇలాంటి రన్ లు నిర్వహించడం సంతోషమని అన్నారు. త్వరలోనే యోగా దినోత్సవం రానందని, ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో అలవాటుగా మార్చుకోవాలని, అప్పుడే మన పనులు మనం ఎలాంటి ఒత్తిడి లేకుండా నిర్వర్తించుకోగలుగుతామన్నారు. సమాజంలోని ప్రజలందరూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యంగా ఉండటమే ముఖ్య ఉద్దేశమని, అలాంటి భావనను ప్రజల్లో తీసుకొచ్చేందుకు ఇలాంటి రన్ లు ఉపయోగపడతాయని అన్నారు. వీటివల్ల మనం ఏ పని చేసినా విజయం సాధించేందుకు అవకాశం ఉంటుందని, ఆరోగ్యానికి మించిన గొప్ప సంపద మరొకటి లేదని అన్నారు. సొసైటీ ఫర్ తెలంగాణ మగ్గారి శ్రీనివాసరావు, వాకర్స్ అసోసియేషన్ బండారు ప్రకాష్, డాక్టర్ పుల్లారావు ,డాక్టర్ రమేష్, అనితా రాణి ,డిఎస్పి శివరామిరెడ్డి, ఇతర అధికారులు, తదితరులు, ప్రజలు పెద్ద ఎత్తున 10 కే, 5 కే, 2 కే రన్ లో పాల్గొన్నారు . సుమారు వెయ్యి మంది వరకు ఈ రన్ లో పాల్గొన్నారు.

## కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా స్నాతకోత్సవం

**కోదాడ,మే 3(నినాదం):** కోదాడ పట్టణంలో కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం స్నాతకోత్సవ (గ్రాడ్యుయేషన్ డే) వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ డాక్టర్ నీలా సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవ విలువలతో కూడిన విద్యను అలవరచుకోవడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని పట్టభద్రులకు సూచించారు. గ్రామీణ ప్రాంతం నుంచి ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేయడం గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. గ్రామీణ విద్యార్థినులకు ఉన్నత ప్రమాణాలతో సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతోనే కళాశాలను స్థాపించినట్లు ఆయన వివరించారు. అనంతరం పట్టభద్రులకు స్నాతకోత్సవ పట్టాలను చైర్మన్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్ళపల్లి గాంధీ, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాగార్జున రావు, విభాగాధిపతులు రమేష్, నరేష్ రెడ్డి, స్రవంతి,



శివాజీ, లక్ష్మణ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## లక్ష్మీనరసింహస్వామికి వసంతసేవ, చక్రతీర్థం

**హుజూర్నగర్ (మఠంపల్లి) మే 03 (నినాదం):** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం మట్టపల్లి మహాక్షేత్రములో శ్రీ స్వామివారి కళ్యాణమహోత్సవములు సందర్భముగా ఆదివారం యాజ్ఞిక సహాయకులు హరికిరణా చార్యులు మరియు దేవాలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, శ్రీనివాసాచార్యులు, బ్రహ్మాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, మూర్తి లక్ష్మీనరసింహమూర్తి వారలచే శాస్త్రోక్తముగా ఉదయం 8-00 గం”ల నుండి శ్రీ స్వామి వారికి వసంత సేవ, చక్రతీర్థము, అన్తహోమం, తదుపరి పూర్ణాహుతి, సాయంత్రం 6-00 గంలకు స్వామి వారికి దోపు ఉత్సవం, ధ్వజావరోహణం కార్యక్రమములు అత్యంత వైభవముగా నిర్వహించబడినవి. ఇట్టి కార్యక్రమములో చెన్నూరు , మట్టపల్లిరావు, విజయకుమార్ కార్యనిర్వహణాధికారి బి. జ్యోతి సర్పంచ్ రామిశెట్టి విజయశాంతి అప్పారావు ఆలయ సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.



## ఈదురు గాలులతో కూడిన వర్షం
### కల్లాల మీద తడిసి ముద్దయిన మిర్చి
### నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



**హుజూర్ నగర్ (మఠంపల్లి) మే 03 (నినాదం):** మఠంపల్లి మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. మిర్చి రైతులు మిర్చిని కూలీలతో పంటను తీసి కల్లాలలో ఆరబెట్టడం జరిగింది. అకాల వర్షంతో రైతులు పట్టాలు తీసుకుని పరుగు పరుగున వెళ్లి మిర్చి పైన కప్పిన ఫలితం లేకపోయింది లాస్ట్ దశలో అరకొర పంట చేతికి వస్తుంది అన్న ఆశతో ఉన్న రైతు అకాల వర్షంతో మిర్చి తడిసి ముద్దయింది. రైతులు కన్నీరు మున్నీరు పెట్టుకున్నారు. బలమైన గాలుల దాటికి అనేక చెట్లు రోడ్లపై పడడంతో ప్రయాణికులకు కొంతమేర ఇబ్బంది కలిగింది. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి దీంతో మండలంలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది పెద్ద ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారూ.

## పొనుగు పాటి రవి కుటుంబానికి ఆర్థికసాయం



**హుజూర్నగర్, మే 03 (నినాదం):** హుజూర్నగర్ మండల కేంద్రంలో 15 వ వార్డులో ఆనారోగ్యం కారణంగా చనిపోయినటువంటి పొనుగు పాటి రవి పార్థివ దేహానికి నివాళులర్పించి అతని భార్య ఉష కి అర్థిక సాయం అందించడం జరిగింది. ప్రతి ఒక్క కార్యకర్తకి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటదని రఘు తెలియ జేయడం జరిగింది. ప్రస్తుతం మాకు తోచిన సహాయం చేస్తున్నాము మాజీ మంత్రి జగదీష్ అన్న సహకారంతో ముందుకు వెళుతున్నామని ప్రతి ఒక్క కార్యకర్త కుటుంబానికి ఏ ఆపద వచ్చినా బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటదని తెలియజేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చంటి, చిట్టి పోతుల భద్రమ్మ, రమేష్, రామిశెట్టి రాము, పోనుగుపాటి అశోక్, కోట హరిబాబు, పొందూరి సత్యనారాయణ, పోనుగుపాటి శ్రీనివాస్, చిన్నం శీను, దొంతగాని శ్రీను మరి కొంతమంది బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కోతులను తరుముతున్న గొరిల్ల

12వ వార్డు కౌన్సిలర్ వినూత్న ప్రయత్నం

కౌన్సిలర్ అమ్మిరి శెట్టి శ్రావణి రాకేష్



**సుల్తానాబాద్, మే 03(నినాదం):**
మున్సిపల్ 12వ వార్డు పరిధి కోతుల బెడద రో జురోజుకు ఎక్కువ అవుతుండడంతో వాటిని త రిమి వేయడానికి పలు ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రంలోని 12వ వార్డు కౌన్సిలర్ అమిరిశెట్టి శ్రావణి రాకేష్ కోతుల బెడద ను అరికట్టడానికి వినూత్న ప్రయ త్నం చేశారు. ఆది వారం సుల్తానాబాద్ మున్సి పల్ కేంద్రంలోని 12 వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ అమిరిశెట్టి శ్రావణి రాకేష్ , మాజీ వార్డు సభ్యులు అమిరిశెట్టి తిరుపతి ఆధ్వర్యంలో ఆయా ప్రాంతా లలో కోతులను తరిమికొట్టెందుకు ఒక యువకు డికి కొండెంగా వేషాధరణ డ్రెస్ వేసి కోతులను త రిమి వేశారు. ప్రస్తుతం ఫలించిన కొత్త పథకం, కో తుల ఆగడాలకు గిరిల్లతో చెక్ పెట్టారు. దీంతో వార్డు ప్రజలు కౌన్సిలర్ ను అభినందించారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపిటీసీ అమిరిశెట్టి రా జలింగం,మాటేటి సంజీవ్, వినయ్, ఎండి నయీ మ్, టింకు, దొడ్ల సందీప్, పుప్పాల సురేష్ , నో ముల రాకేష్ , లక్ష్మణ్, కుమార్, స్వామి, చైతన్య, సమీర్, కొలిపాక రాజకుమార్, జూపక స్వామి, సాయి, రాహుల్, శ్రీనివాస్ కాలనీ కి చెందిన మ హిళలు యూవకులు సుమారు 50 మంది కి పైగా పాల్గొన్నారు.

# లక్షెట్టిపేట రూపురేఖలు మారుస్తా



**మంచిర్యాల, మే 3(నినాదం):**
లక్షెట్టిపేట మున్సిపాలిటీ రూపురేఖలు మారుస్తామని మంచిర్యాల శాసనసభ్యులు శ్రీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలోని లక్షెట్టిపేట్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. పట్టణంలోని ఉత్కూర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు 80 ఫీట్ల రహదారి వెడల్పును తగ్గించేది లేదని ఆయన స్పష్టం చేశారు. లక్షెట్టిపేట్ పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలను, ప్రమాదాలను తగ్గించడానికి రోడ్ల వెడల్పు అత్యవసరమని, పట్టణ రూపురేఖలను మార్చి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన బాధ్యత మాపై ఉందని, రోడ్ల వెడల్పు వల్ల పట్టణంలో ట్రాఫిక్ జామ్‌లు తగ్గుతాయి, ప్రయాణ సమయం ఆదా అవుతుందన్నారు. ఇది వ్యక్తిగత నిర్ణయం కాదని, పట్టణ అభివృద్ధి కోసం కొద్దిపాటి అసౌకర్యాన్ని భరించి, మాకు సహకరించాలని కోరారు.

## ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం... మహాధర్నాకు పిలుపు

**అశ్వాపురం, మే 03 (నినాదం):**



రాష్ట్ర ప్రభుత్వం రైతులపై అవలంభిస్తున్న నిర్లక్ష్య ధోరణికి, ధాన్యం కొనుగోళ్లలో జరు గుతున్న జాప్యానికి వ్యతిరేకంగా సోమవారం అశ్వాపురం మండలంలోని మొండికుంట గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి దాదాపు నెలరోజులు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోళ్లను ప్రారంభించడంలో జాప్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. నిర్ణీత తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయకుండా, ఎఫ్ ఏ క్యూ ప్రమాణాల పేరిట అనవసర అడ్డంకులు సృష్టిస్తూ రైతులను నష్టపరిచేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ధాన్యం అమ్మకాలు లేక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. నిద్రావస్థలో ఉన్న ప్రభుత్వాన్ని నిద్రలేపేందుకు ఈ మహాధర్నా నిర్వహిస్తున్నామని, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా జరగనున్న ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

# కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

యార్డుల్లో నిలిచిపోయిన ధాన్యం... రైతుల తీవ్ర ఆవేదన

కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలి

బిఆర్ఎస్ మండల కార్యదర్శి మర్రి మల్లారెడ్డి





**అశ్వాపురం, మే 03(నినాదం):**
మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బిఆర్ ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మొండికుంట సర్పంచ్ మర్రి సంధ్య తోపాటు బీఆర్ఎస్ నాయకులు సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. యార్డులో కొనసాగుతున్న కొనుగోలు ప్రక్రియను సమీక్షిస్తూ,ధాన్యం తీసుకువచ్చిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు ధాన్యం తూకం ఆలస్యం, తేమ శాతం కొలతలో ఇబ్బందులు, చెల్లింపుల ఆలస్యం వంటి అంశాలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. కొనుగోలు ప్రక్రియ లేకపోవడం వల్ల యార్డుల్లో రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సర్పంచ్ మర్రి సంధ్య మాట్లాడుతూ, రైతులు యార్డుల్లో ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, తూ కం, తేమ శాతం విషయంలో ఎటు వంటి అన్యాయం జరగకుండా అధికా రులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవా లని అన్నారు. "బీఆర్ఎస్ ప్రధాన కార్య దర్శి మర్రి మల్లారెడ్డి మాట్లాడు తూ,"కాటా పెట్టిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే లోడ్ చేసి మిల్లర్లకు పంపాలని, యార్డుల్లో ధాన్యం పేరుకుపోకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి. కొనుగోలు కేంద్రా ల్లో జరుగుతున్న ఆలస్యాలను అధికా రులు వెంటనే సరిదిద్దాలని అధికారు లకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకతతో పనులు నిర్వహించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కోరారు. ధాన్యం కొనుగోలు చేయకపోవటంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని,తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని,లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులను పెద్దఎత్తున సమీకరించి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మొండికుంట ఉప సర్పంచ్ చల్లమల్ల శివారెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పాటి మన్మధ రెడ్డి, రామగిరి భాస్కర్, రామాచారి,బిక్షం రెడ్డి,చిన్నూరి రమేశ్, సుడి వీరారెడ్డి,శ్యామల పుల్లారెడ్డి, నాయకులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత చేరువలో సేవలు

**నిర్మల్ ప్రతినిధి, మే 03 (నినాదం):**
ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'ప్రజావాణి' కార్యక్రమాన్ని ఇకపై డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించనున్నట్లు ఆదివారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఒక ప్రకటన లో తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం నుండి నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం, భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. కలెక్టరేట్‌లో ఇప్పటికే నిర్వహిస్తున్న ప్రజావాణితో పాటు, ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. డివిజన్ స్థాయి అధికారులు హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. జిల్లా కేంద్రానికి రాలేని మారుమూల గ్రామాల ప్రజలు తమ సమస్యలను స్థానికంగానే విన్నవించుకునే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. భూ భారతి, భూ వివాదాలు, విద్యా, వైద్యం, పించన్లు, రేషన్ కార్డులు, ఇతర పౌర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు.



అందిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# 11 నుంచి జిల్లాలో ప్రత్యేక విద్యా వారోత్సవాలు

నిర్మల్ ప్రతినిధి, మే 03 (నినాదం):
జిల్లాలో ఈ నెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో 'ప్రత్యేక విద్యా వారోత్సవాల'ను ఘనంగా నిర్వహించ నున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి (ఇజుూ) ధర్మం భోజన్న ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం నిర్వహించబడే ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు మండల విద్యాశాఖ అధికారులు, ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ప్రస్తుతం విద్యాశాఖ సిబ్బంది సెన్సస్ ఎనీమరేషన్ డ్యూటీలో ఉన్నారని, అదేవిధంగా పదవ తరగతి ఫలితాల విడుదల నేపథ్యంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విధులకు హాజరవుతున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ క్రమంలోనే విద్యా వారోత్సవాల నిర్వహణకు ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల వారీగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని, ఈ విద్యా వారోత్సవాలను దిగ్విజయంగా నిర్వహించాలని



డీఈఓ భోజన్న కోరారు.

# వేసవిలో.. కురిసిన వర్షం

**మంచిర్యాల, మే 3 (నినాదం):**
మంచిర్యాల జిల్లాలో వాతావరణంలో ఆకస్మిక మార్పులు చోటు చేసుకున్నాయి. గత కొన్ని రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు ఆదివారం కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం కలిగించాలి. ఒక్కసారిగా వర్షం కురవడంతో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లినవారు తడిచారు. వాతావరణం చల్లబడంతో జిల్లావాసులు అధిక ఉష్ణోగ్రతల నుంచి కాస్త సేదా తీరారు. కొన్ని ఏరియాల్లో గాలి వాన బీభత్సం సృష్టించాయి. మందమర్రి, రామకృష్ణాపూర్ ప్రాంతాల్లో గాలి వాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులకు, భారీ వర్షానికి రోడ్లపై చెట్లు నేలకూలాయి. విరిగిపడిన చెట్ల కొమ్మలు రహదారులను మూసి వేశాయి. రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తూ జనజీవనాన్ని స్తంభింపజేసింది. ఈ సంఘటనలు స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగించాయి. కొన్ని ప్రదేశాల్లో స్తంభాలు కింద పడడంతో



విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

# రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, మే 3(నినాదం) :**



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతల మానేపల్లి మండలం కర్జెల్లి గ్రామానికి చెందిన రైతు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... కుబిడే శ్యాంసుందర్ (30) తన స్వగ్రామం నుంచి కౌటాల వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా, కౌటాల మండలం నాగేపల్లి శివారులో ఉదయం సుమారు 8 గంటల సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు వెంటనే మంచిర్యాల పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 11 గంటల సమయంలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తమ్ముడు కుబిడే సుమియోన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కౌటాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఇదిలా ఉండగా, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని ఎస్సై చంద్రశేఖర్ సూచించారు.

## జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్ ప్రతినిధి, మే 03 (నినాదం):**
నిర్మల్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ తో పాటు సారంగాపూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్లో జొన్న కొనుగోలు కేంద్రాలను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. కనీస మద్దతు ధర క్వింటాల్ కి రూ. 3699/- ఉందనీ, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పంటలను అమ్మకానికి వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులని అన్ని విధాల ఇబ్బందులకు గురిచేస్తుందని పేర్కొన్నారు. అకాల వర్షాలు, ఈదురు గాలులతో ఒక వైపు చేతికొచ్చిన పంట నష్టం వాటిల్లితే, కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేసి, ఈ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. పంట నాణ్యతను పక్కనపెట్టి అన్ని రకాల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు,రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అరులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తా

**–దేగాం సర్పంచ్ శిరం సుష్మారెడ్డి**

**నిర్మల్ ప్రతినిధి, భైంసా: మే 03 (నినాదం):**



ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సహకారం తో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు పాటు పడ తానని దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి అన్నారు. ఆదివారం దేగాం గ్రామం లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఉందన్నారు.. ప్రతి పేదవారీ కి స్వంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వ హయం లో పదేళ్ల లో ఒక్కరికి ఇల్లు నిర్మించి ఇవ్వలేదన్నారు. అర్హులందరికీ దశల వారిగా ఇల్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమం లో పాటు వార్డు సభ్యులు .. పాతర్ల నరేశ్ ముదిరాజ్, పోల్కం కవిత ముదిరాజ్ లక్కడి ఆనంద్ ముదిరాజ్ అయిశీడ్ల మోహన్ రెడ్డి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## రైతుల అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోండి

**–మండల వ్యవసాయ అధికారి పైడితల్లి**

**–హాజరవుతున్న వ్యవసాయ నిపుణులు**



**సుల్తానాబాద్, మే 03 (నినాదం):**
నేటి నుండి రైతు వేదికలలో జరిగే రైతు అవగాహ న సదస్సును గ్రామాల్లోని రైతులందరూ సద్విని యోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అ ధికారి పైడితల్లి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించుటకు వ్యవసాయ అనుబంధ శాఖ ల ఆధ్వ ర్యంలో రైతు వేదికల వద్ద ప్రత్యేక కార్య క్రమాలు నిర్వ హించబడనున్నవి.మే 4వ తేదీ కనుకుల రైతు వేదిక, మే 5వ తేదీ సుద్దాల రైతు వేదిక,మే 6వ తేదీ అల్లీపూర్ రైతు వేదిక,మే 7వ తేదీ కాట్నపల్లి రైతు వేదిక,మే 8వ తేదీ గర్రెపల్లి రైతు వేదిక,మే 9వ తేదీ చిన్నకలువల రైతు వేదిక లో అవగాహన సదస్సు నిర్వహించబడునని అన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల ని ర్వహణ ఇతర సం బంధిత అంశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రామా ల్లోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నిర్మల్‌లో వెలుగులోకి 150 ఏళ్ల నాటి "మోడీ లిపి"దస్తావేజులు

**నిర్మల్ ప్రతినిధి, మే 03 (నినాదం ):**
జిల్లా పరిసర ప్రాంతాల్లో చారిత్రక ప్రాధాన్యత కలిగిన అరుదైన మోడీ లిపి దస్తావేజులు బయల్పడ్డాయి. ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ తుమ్మల దేవరావ్ సుమారు 150 సంవత్సరాల నాటి ఒక ఫర్మానాను సేకరించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ మరియు మహారాష్ట్ర ప్రాంతాల సామాజిక, రాజకీయ చరిత్రలో మోడీ లిపికి ఉన్న విశిష్టతను వివరించారు.

**చారిత్రక నేపథ్యం మరియు ప్రాముఖ్యత:**
13వ శతాబ్దంలో దేవగిరిని పాలించిన యాదవ రాజుల కాలంలో మంత్రిగా పనిచేసిన హేమాద్రి పండితుడు (హేమాడ్ పంత్) దర్బారుల్లో రహస్య భాషగా ఉపయోగించడానికి ఈ లిపిని అభివృద్ధి చేశారని పరిశోధకులు చెబుతున్నారు. మరాఠీ భాషకు అనుబంధంగా ఉన్న ఈ లిపిని గతంలో రాజుల ఆజ్ఞలు, గెజిట్లు, శాసనాలు మరియు భూమి శిస్తు పత్రాలు నమోదు చేయడానికి వినియోగించేవారు. ఛత్రపతి శివాజీ మహారాజ్



కాలంలో బాలాజీ అవచి చిట్నీస్ ఈ లిపిని సంస్కరించి, రాజ్యాంగపరమైన ఆదేశాలను వేగంగా పంపడానికి ఉపయోగించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. శివాజీ మహారాజ్ కంకపూర్ సందర్శనలో జారీ చేసిన 'సనద్' కూడా ఇదే లిపిలో ఉండటం గమనార్హం.

**గొలుసుకట్టు రాతల విశిష్టత:**
మరాఠీలోని 'మోడణే' (వంచడం లేదా మడవడం) అనే పదం నుంచి 'మోడీ' అనే పేరు వచ్చింది. పెన్నును కాగితం మీద నుంచి ఎత్తకుండా వేగంగా గొలుసుకట్టు రాతలా రాయడం ఈ లిపి యొక్క అతిపెద్ద ప్రత్యేకత. నిర్మల్ జిల్లాలో 1950 వరకు కూడా వ్యాపారస్తులు, కర్ణాలు తమ దస్తావేజులను, వంశవృక్షాలను ఈ లిపిలోనే భద్రపరిచేవారని డాక్టర్ దేవరావ్ గుర్తుచేశారు.

**అంతరిస్తున్న కళ.. సంరక్షణకు పిలుపు**
ఒకప్పుడు నిర్మల్ జిల్లాలోని అనేక గ్రామాల్లో మోడి లిపిని చదివేవారు ఉండేవారని, ప్రస్తుతం ఈ విద్య తెలిసిన వారు కనుమరుగైపోవడం ఆందోళ కరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో విలువైన శిలాశాసనాలు, ప్రాచీన పత్రాలు ఇప్పటికే కాలగర్భంలో కలిసిపోగా, ప్రస్తుతం లభిస్తున్న దస్తావేజులనైనా భవిష్యత్తు తరాల కోసం ప్రభుత్వం సేకరించి, భద్రపరచాల్సిన అవసరం ఉందని డాక్టర్ తుమ్మల దేవరావ్ కోరారు.

## తర్లపాడులో పల్లె ప్రకృతి వనం అగ్నికి ఆహుతి



**నిర్మల్ ప్రతినిధి,ఖానాపూర్ : మే 03 (నినాదం):**
ఖానాపూర్ మండలం పాత తర్లపాడ్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనానికి ఆదివారం నిప్పు అంటుకుంది. దీంతో అక్కడున్న చెట్లు, మొక్కలు కాలిపోగా నర్సరీ మొక్కలు మొలక దశల్లోనే అగ్ని ధాటికి గురయ్యి మొలకెత్తకుండా పోయాయి. సమీపాన అడవిలో అగ్గి రాజుకుని క్రమక్రమంగా పల్లె ప్రకృతి వనానికి అంటు కుంది. పల్లె ప్రకృతి వనంలో మంటలు చెలరేగుతున్నప్పటికి వీబీజీ రామ్ జీ సిబ్బంది, స్థానికులు,గ్రామస్తులు,గుర్తించకపోవడంతో మొక్క లు అగ్నికి ఆహుతి అయ్యాయి. ప్రభుత్వం అంతలా నిధులు కేటాయించి పల్లె ప్రకృతి వనం పేరిట పచ్చదనాన్ని పెంపొందించి ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు తీసుకొచ్చిన కార్యక్ర మాన్ని అధికారులు నిర్వీర్యం చేయడం విమర్శలకు దారితీ స్తుంది. అధికారుల సమన్వయ,పర్యవేక్షణ లోపం మూలన వేలాది మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి.

# భక్తిశ్రద్ధలతో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

నాగారం గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



**హుస్నాబాద్ ఏప్రిల్ 3 (నినాదం);-**
హుస్నాబాద్ మండల పరిధిలోని నాగారం గ్రామం ఆదివారం నాడు ఆధ్యాత్మిక శోభతో పుల కించిపోయింది. జై శ్రీరామ్ మరియు మారుతీ నామస్మరణలతో గ్రామ వీధులన్నీ మారుమోగు తుండగా, హనుమాన్ దీక్షా స్వాములు అత్యంత నిష్ఠతో అంగరంగ వైభవంగా హనుమాన్ శోభాయా త్రను ఘనంగా నిర్వహించారు. ఈ శోభాయాత్రలో భాగంగా ఆంజనేయ స్వామి వేషధారణలో స్వాము లు చేసిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకు న్నాయి, వారి భక్తి పారవశ్యం చూస్తుంటే సాక్షాత్తు ఆ హనుమంతుడే అక్కడ కొలువై ఉన్నాడా అన్నట్లుగా గ్రామంలో భక్తి చైతన్యం వెల్లివిరిసింది. ఈ పవిత్రమైన వేడుకను పురస్కరించుకుని భక్తులం దరికీ అత్యంత శ్రద్ధతో ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామస్తులు మరియు భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవడంతో నాగారం వీధులన్నీ ఆధ్యాత్మికతతో నిండిపోయాయి. ఈ విశేషమైన కార్యక్రమంలో హనుమాన్ దీక్షలో ఉన్న గ్రామ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ కూడా తోటి స్వాములతో కలిసి భక్తిశ్రద్ధలతో పాల్గొని ఈ శోభాయాత్రను విజయవంతం చేశారు.

## మంథనిలో జెకెఏ షోటో ఖాన్ కరాటే గ్రేడింగ్ టెస్ట్



**మంథని టౌన్ మే 03 (నినాదం):**
మంథని మున్సిపల్ పరిధిలో గల శ్రీ లక్ష్మి భారతి ఫంక్షన్ హాల్ లో శనివారం విద్యార్థులకు మంథని షోటో ఖాన్ కరాటే గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. కరాటే మాస్టర్ కోంద్ర నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో ఈ టెస్ట్ కి 40 మంది క్రీడాకారులు పాల్గొని, ఉత్తీర్ణత కావటం జరిగింది. ఇట్టి గ్రేడింగ్ టెస్ట్ కి పర్యవేక్షులు గా జె. కె. ఏ షాటో ఖాన్ కరాటే రాష్ట్ర ఉపాధ్యక్షులు నూకల బానయ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కరాటే తో పాటు చదువులో కూడా అత్యంత ప్రతిభను కనబడచడం హర్షించదగ్గ విషయమని ఆయన తెలిపారు. అనంతరం పదవ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన వడ్లకొండ శ్రీనిత 576, అక్షిత 560, , సాయి కారుణ్య 525, మౌనిక 508 అలాగే ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో హాసిని 458, మణిదీపిక 420 మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ 2 వార్డు కౌన్సిలర్ నూకల కమల్, మాజీ మార్కెట్ కమిటి చెర్మన్ అజీమ్ ఖాన్, సీనియర్ కరాటే మాస్టర్ మారగోని శంకర్ గౌడ్, సంజీవ్, రాజేందర్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# సంస్కృతిని ప్రతిబింభించిన ఓణీల అలంకరణ వేడుక

–బాలికలకు ఆశీస్సులు అందించిన ఎమ్మెల్యే పాయం



**అశ్వాపురం, మే 3 (నినాదం):**
అశ్వాపురం మండలం నెల్లిపాక బంజర గ్రామంలో ఓణీల అలంకరణ వేడుక ఘనంగా నిర్వహించబడింది. గ్రామానికి చెందిన చామంచుల శ్రీనివాస రావు వెంకటలక్ష్మి దంపతుల కుమార్తెలు భువన మరియు సాయి ప్రసన్నల ఓణీల అలంకరణ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ వేడుకకు పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై బాలికలకు ఆశీస్సులు అందించారు. వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులను అభినందించారు. సంప్రదాయాలను కాపాడుతూ ఇటువంటి కార్యక్రమాలను ఆనందంగా జరుపుకోవడం ఆనందదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, బూరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుక్కాని మధుసూదన్ రెడ్డి, లంకమల్ల కొండలరావు, ఏనుగు కృష్ణారెడ్డి, బిక్కసాని సత్యనారాయణ, అక్కిన శ్రీను, ఓబిలినేని శ్రీలత, పర్శబోయిన రాధాకృష్ణ, తూము వీరరాఘవులు, మొగిల్ల పెద్ద వీరారెడ్డి, కొండాబత్తుల ఉపేందర్, బచ్చు వెంకటరమణ, బరాజు సంపత్, మాచిరెడ్డి వెంకటరెడ్డి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

# మోదీ సభకు స్వచ్ఛందంగా తరలిరండి

**కరీంనగర్ లో బీజేపీ జిల్లా కార్యాలయ నూతన భవనానికి కేంద్ర మంత్రి భూమిపూజ**

**కరీంనగర్ నుంచి భారీ జన సమీకరణకు ఆహ్వానం**

**మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు సహా ముఖ్య నేతలు హాజరు**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**



**కరీంనగర్, మే3 (నినాదం) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 10న హైదరాబాద్ రానున్న సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభను ఘనంగా విజయవంతం చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి కార్యకర్త స్వచ్ఛందంగా సభకు హాజరుకావాలని, ముఖ్యంగా కరీంనగర్ జిల్లా నుంచి భారీ సంఖ్యలో ప్రజలను తరలించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లో గాయత్రినగర్‌లో బీజేపీ జిల్లా కార్యాలయ నూతన భవనానికి బండి సంజయ్ భూమిపూజ నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని, మోదీ సభ విజయవంతం కోసం చేపట్టాల్సిన చర్యలపై నాయకులతో చర్చించారు. సమావేశంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. సభ విజయానికి గ్రామాలు, మండలాలు, పట్టణాల స్థాయిలో ప్రచారం చేపట్టాలని, గోడలపై నినాదాలు రాయించాలని, సభకు వచ్చే వారికి రవాణా, భోజన సౌకర్యాలు కల్పించాలని ఆయన సూచించారు. ఈ సభతో రాష్ట్రంలో బీజేపీ విజయ సంకేతాలు వెళ్లాలని ఆకాంక్షించారు. ఇక జ్యోతినగర్‌లో కేడీఆర్ పార్కు పరిసరాల్లో రూ.16 లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. ఇందులో సీసీ రహదారి, కాలువ నిర్మాణ పనులు ఉన్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో స్థానిక కార్పొరేటర్ సరస్వతి, కచ్చాకాయల రాజేంద్రప్రసాద్, గుగ్గిళపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ అధికారుల అలసత్వం!

**కనుమరుగైపోతున్న పంట కాలువ**

**హద్దులు తొలగించినా.. ప్రేక్షక పాత్ర వహిస్తున్న అధికారులు**

**రైతు ట్రాక్టర్ పై కేసు నమోదు**

**తూము ఉంది....కాలువ ఎక్కడ ఉందంటున్న అధికారులు**

**కబ్జా దారులపై చర్యలు ఏవీ**

**లోపలి పొలాలకు దారి లేక అవస్థలు పడుతున్న రైతుల**

**రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా.. స్పందించని క్షేత్ర స్థాయి అధికారులు**

**ప్రజావాణిలో ఫిర్యాదు**

**తహశీల్దార్ ప్రమేయంతో పంట కాలువను సర్వే చేసిన సర్వేయర్**







**మిరుదొడ్డి / సిద్ధిపేట బ్యూరో (నినాదం) :** చెరువులను, పంట కాలువలను పరిరక్షించవలసిన ఇరిగేషన్ శాఖ అధికారుల అలసత్వం వల్ల పంట కాలువలు కనుమరుగైపోతున్న దుస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే మిరుదొడ్డి మండల కేంద్రంలోని సంతరాజ్ చెరువు తూము నుండి బొమ్మరాజ్ చెరువు వరకు ఉన్న చెరువు కాలువ ఇరువైపుల గల కొందరు రైతులు చెరువు కాలువను కబ్జా చేసుకోవడంతో లోపలి పొలాలకు వెళ్లవలసిన రైతులకు దారి లేక నానా అవస్థలు పడవలసిన దుస్థితి ఏర్పడుతుంది. చెరువు కాలువ ఉంటే కాలువ వెంబడి లోపలి పొలాలకు వెళ్లి వ్యవసాయ పనులు పూర్తి చేసుకునే అవకాశం ఉండేది. కాలువ కబ్జా కావడం వల్ల లోపలి పొలాల రైతులు వెళ్లడంతో మా పంట పొలాన్ని ట్రాక్టర్ తో దున్నేస్తున్నారంటూ స్థానిక పోలీస్ స్టేషన్ లో కొందరు ఫిర్యాదు చేయడం వల్ల ఓ రైతు ట్రాక్టర్ పై కేసు నమోదు చేసి గత ఆరు నెలల నుండి ట్రాక్టర్ పోలీస్ స్టేషన్ లోనే ఉన్నట్లు సమాచారం. బాధిత రైతులు చెరువు కాలువను పునరుద్ధరించాలంటూ సంబంధిత ఏ ఈ కి, ఈఈకి, డీఈకి ఎన్ని సార్లు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాధుడే లేరు .రాష్ట్ర స్థాయి ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేయాలని క్షేత్ర స్థాయి ఇరిగేషన్ అధికారులకు సూచించినా క్షేత్ర స్థాయి అధికారులు స్పందించకపోవడం పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు ఉన్నాయి. ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా ఎట్టకేలకు స్పందించిన ఇరిగేషన్ అధికారులు కాలువ ఉన్నట్లు మండల సర్వేయర్ తో సర్వే మ్యాప్ ఇస్తే చెరువు కాలువ పునరుద్ధరిస్తామంటూ చెప్పడం వల్ల బాధితులు స్థానిక తహశీల్దార్ కు విషయం తెలియజేయగా తహశీల్దార్ ప్రమేయంతో సర్వేయర్ తో సర్వే నిర్వహించి చెరువు కాలువ ఉన్నట్లు మ్యాప్ ఇవ్వడంతో స్పందించిన ఇరిగేషన్ అధికారులు కాలువ నిర్మాణం పనుల కోసం హద్దులు ఏర్పాటు చేయగా కాలువను కబ్జా చేసిన రైతులు ఏ ఈ ఏర్పాటు చేసిన హద్దులను తొలగించినా ఇరిగేషన్ అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వానికి జవాబుదారిగా ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించవలసిన ప్రభుత్వ అధికారుల పని తీరుపై భిన్నాభిప్రాయాలు వెలువడుతున్నాయి. చెరువులను కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్ఆర్ఆర్ , మిషన్ కాకతీయ పథకాలను ప్రవేశ పెడుతూ చెరువుల పరిరక్షణ కోసం కోట్ల బడ్జెట్ కేటాయించినా ఇరిగేషన్ అధికారుల అలసత్వం వల్ల నిధులు నీళ్ల లాగా కరిగి పోయినా చెరువులు అభివృద్ధికి నోచుకోలేక పోతున్నాయంటూ విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# పదిలో అత్యధిక మార్కును సాధించిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, మే 3 (నినాదం) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన షాపూర్ నగర్ శారదా విద్యాభవన్ హై స్కూల్ విద్యార్థులను కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించి రానున్న రోజుల్లో విద్యార్థులు మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి ఉజ్వల భవిష్యత్తును రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ సి భూపాల్ రెడ్డి, సందీప్ బల్లెం, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సామాజికవేత్త, వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ డైరెక్టర్ మధుబాబు చికిలే, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ విజయ గణపతి స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పాల్గొన్న శంభీపూర్ క్రిష్ణ

**కుత్బుల్లాపూర్, మే 3 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ మల్లంపేట్ ఏపీఆర్ సిగ్నేటర్ విల్లాస్ నందు ఆదివారం శ్రీ విజయ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంలో ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ విజయ గణపతి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ షామీర్పేట్ హనుమంతరావు, నాయకులు రమేష్, రవి, అరుణ్, సుబ్బారెడ్డి, కాలనీ సభ్యులు వంశీకృష్ణ, రాజశేఖర్, సతీష్, కిరణ్, సంజీవరెడ్డి, చందు, సాయి, ప్రశాంత్, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.



# వేసవి తాపం తీర్చుకో ఈత నేర్చుకో..

**వికారాబాద్, మే 3(నినాదం):** మండుతున్న ఎండలకు ఉపశమనం కోసం ప్రాణకోటి తహతహలాడు తోంది. చల్లబడటానికి అందుబాటులో ఉన్న ప్రయత్నాలన్ని చేస్తూ చల్లబడుతున్న తీరు కొనసాగుతున్నది. పట్టణాలు, పల్లెలల్లో భానుడి తాపానికి విరుగుడు, చల్లబడటంతో పాటు ఈత నేర్చుకునే విధానినికి ఆసక్తి చూపుతూ పల్లెల్లో వ్యవసాయబావులను, పట్టణాలలో ఈత కొలనులను ఎంపిక చేసుకుని నిత్యం ఉపక్రమిస్తూ సేదతీరుతున్నారు. ఈ పద్ధతితో స్వకార్యం స్వామీకార్యం రెండు ప్రాపితిస్తున్నాయి. కొందరు పచ్చని చెట్లవద్దకు చేరి సేదతిరితున్నారు. ఇదిలాఉండగా వాడుతున్న గొంతుకలను చల్లబరచడానికి సీతల పానీయాలను సేవిస్తున్నారు. చల్లటి నీటితో చల్ల బడుతున్నారు. వివిధ రకాలుగా ఎండ వేడిమి నుండి రక్షించుకునేందుకు సకల చర్యలు చేపడుతున్నారు. ఏ ఎండకు ఆ గొడుగు అన్న ఛందంగా కాలానుగుణంగా వ్యవహరించడం ప్రాణులకు పరిపాటి.



N NADAM CINEMA

# ప్రభాస్-రాజమౌళి అలాంటి వారు...

## షాకింగ్ కామెంట్స్ చేసిన జగపతిబాబు



తెలుగు చిత్ర పరిశ్రమలో మంచి గుర్తింపును సంపాదించుకున్న నటులలో జగపతిబాబు ఒకరు. హీరోగా అనేక సంవత్సరాలు కొనసాగిన ఆయన 'లెజెండ్' సినిమాతో విలన్‌గా కొత్త ఇమేజ్‌ను సంపాదించుకున్నారు. ప్రస్తుతం ఆయన సినిమాల్లో విలన్ పాత్రలతో పాటు కీలక పాత్రల్లో నటిస్తూ తన కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. తాజాగా జగపతిబాబు ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభాస్, రాజమౌళి గురించి కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. జగపతిబాబు మాట్లాడుతూ, "కొన్ని సంవత్సరాల క్రితం నేను ఆర్థికంగా చాలా కష్టాల్లో ఉన్నాను. అలాంటి సమయంలో ఎందుకో ప్రభాస్ గుర్తుకొచ్చాడు. వెంటనే ఆయనకు ఫోన్ చేశాను. ఆ సమయంలో ఆయన విదేశాల్లో షూటింగ్‌లో ఉన్నారు. అయినప్పటికీ ఆయన నాతో చాలా బాగా మాట్లాడారు. 'ఇండియాకు వచ్చాక తప్పకుండా కలుస్తాను సార్' అని చెప్పారు. నేను ఆయన బిజీ షెడ్యూల్‌లో మర్చిపోతారేమో అనుకున్నాను. కానీ షూటింగ్ పూర్తయ్యాక ఇండియాకు వచ్చిన వెంటనే నన్ను కలిశారు. నా సమస్యలను తెలుసుకొని నాకు సహాయం చేశారు. అంత పెద్ద స్టార్ అయినప్పటికీ నన్ను గుర్తుంచుకొని కలవడం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది" అని తెలిపారు. అలాగే రాజమౌళి గురించి మాట్లాడుతూ, "ఆయన ఫ్యామిలీ ఆయనకు పెద్ద బలం. వారంతా కలిసిమెలిసి ఉంటారు. వెకేషన్‌కు వెళ్లినా కూడా సినిమా గురించే ఆలోచిస్తుంటారు. వారి డెడికేషన్ కనీసం 20% అందరికీ ఉన్నా కూడా ప్రతి సినిమా హిట్ అవుతుంది. రాజమౌళి ఎన్నో విజయాలు సాధించినా ఎప్పుడూ వినయంగా, సాదాసీదాగా ఉంటారు. ఆయన కుటుంబంలో ఎంతోమంది నటులు ఉన్నప్పటికీ, అవసరం లేని పాత్రల్లో వారిని పెట్టరు. పాత్రకు సరిపోయే వారినే ఎంపిక చేస్తారు. అందుకే ఆయన వరుస విజయాలతో దూసుకుపోతున్నారు" అని జగపతిబాబు పేర్కొన్నారు.

## అందాలు ఆరబోసిన

# మిల్కీ బ్యూటీ



మిల్కీ బ్యూటీ తమన్నా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి చాలా సంవత్సరాలు అయ్యింది. ఈమె ఇప్పటివరకు అనేక భాషల సినిమాల్లో నటించి భారతదేశవ్యాప్తంగా మంచి గుర్తింపును సంపాదించుకుంది. ముఖ్యంగా తెలుగు చిత్రాల ద్వారా పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ పొందిన ఈ బ్యూటీ ఈ మధ్యకాలంలో పెద్దగా తెలుగు సినిమాల్లో కనిపించడం లేదు. కొంతకాలం క్రితం తమన్నా 'ఓదెల 2' చిత్రంలో ప్రధాన పాత్రలో నటించింది. మంచి అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధించలేకపోయింది. ప్రస్తుతం తమన్నా ఎక్కువగా హిందీ సినిమాలపై దృష్టి పెట్టింది. సినిమాల్లో తన గ్లామర్‌తో యువతను ఆకట్టుకున్న ఈ బ్యూటీ అప్పుడప్పుడు సోషల్ మీడియాలో కూడా తన హాట్ ఫోటోలతో అభిమానులను అలరిస్తోంది. తాజాగా సమ్మర్ సీజన్ సందర్భంగా తమన్నా స్విమ్మింగ్ పూల్‌లో తీసుకున్న కొన్ని ఫోటోలను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. ఈ ఫోటోల్లో ఆమె స్విమ్‌సూట్‌లో కనిపిస్తూ, కురులను వెనక్కి వేసుకొని స్టైలిష్ అండ్ హాట్ లుక్స్‌తో పోజులు ఇచ్చింది. ఇందులో తమన్నా చాలా గ్లామరస్‌గా కనిపించడంతో ఈ ఫోటోలు నెట్టింట పెద్ద ఎత్తున వైరల్‌గా మారాయి.

# అడిగి మరీ కొట్టించుకున్న రవిబాబు..



టాలెంటెడ్ నటుడు, దర్శకుడు రవిబాబు తాజాగా 'రేజర్' చిత్రంలో ప్రధాన పాత్రలో నటించారు. ఈ సినిమాకు సంబంధించిన కొన్ని ప్రచార చిత్రాలు ఇప్పటికే విడుదల కాగా వాటిని పరిశీలిస్తే ఇది పవర్ఫుల్ స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని స్పష్టంగా అర్థమవుతోంది. ఈ సినిమా మే 8న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో రవిబాబు వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ సినిమాను ప్రమోట్ చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన చేసిన పని వైరల్ గా మారింది. ఆ ఇంటర్వ్యూ సమయంలో రవిబాబు యాంకర్‌ను "నా పొట్టపై కొట్టు" అని అన్నారు. మొదట కంగారుపడిన యాంకర్ మెల్లగా కొట్టాడు. దాంతో రవిబాబు, "నీ పవర్ ఇంతేనా? గట్టిగా కొట్టు" అని అన్నారు. యాంకర్ భయంతో మళ్లీ మెల్లగా కొట్టగా, రవిబాబు మరోసారి "నీకు ఎంత పవర్ ఉందో అంత పవర్‌తో కొట్టు" అని ప్రోత్సహించారు. దీంతో యాంకర్ గట్టిగానే కొట్టాడు.

# అందాల సీరత్ కపూర్

## హాట్ లుక్‌లో ఆకట్టుకుంటున్న బ్యూటీ



మోస్ట్ బ్యూటిఫుల్ నటి సీరత్ కపూర్, శర్వానంద్ ప్రధాన పాత్రలో రూపొందిన 'రన్ రాజా రన్' చిత్రంతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా మంచి విజయాన్ని సాధించడంతో ఆమెకు తెలుగులో మంచి గుర్తింపు లభించింది. దాంతో ఈ బ్యూటీకి వరుసగా తెలుగు సినిమాల్లో అవకాశాలు దక్కాయి. అయితే 'రన్ రాజా రన్' తర్వాత ఆమెకు పెద్ద విజయాలు దక్కలేదు. దాంతో టాలీవుడ్‌లో అవకాశాలు క్రమంగా తగ్గాయి. సీరత్ కపూర్ కేవలం తెలుగు సినిమాలకే పరిమితం కాకుండా ఇతర భాషా చిత్రాల్లో కూడా నటించింది. ప్రస్తుతం ఈ బ్యూటీ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటూ తన అభిమానులతో అనేక విషయాలను పంచుకుంటోంది. అలాగే తనకు సంబంధించిన గ్లామరస్ ఫోటోలను కూడా తరచూ షేర్ చేస్తోంది. తాజాగా సీరత్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని ఫోటోలను పోస్ట్ చేసింది. అందులో ఆమె పర్పుల్ కలర్ సారీ ధరించి, దానికి తగిన స్టైలిష్ బ్లౌజ్‌లో కనిపించింది. ఈ లుక్‌లో ఆమె తన ఎద అందాలను హైలైట్ చేస్తూ ఫోటోలకు పోజులు ఇచ్చింది. మెడలో పెద్ద హారం ధరించి, కురులను వదిలేసి గ్లామరస్‌గా కనిపించింది. మొత్తంగా ఈ ఫోటోలలో సీరత్ కపూర్ గార్జియస్ లుక్‌లో మెరిసిపోవడంతో ఈ పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి.

## ఆ క్రేజీ చిత్రంలో ఛాన్స్

# కొట్టేసిన నివేతా పేతురాజ్



టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న హీరోయిన్ నివేతా పేతురాజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పటికే పలు తెలుగు చిత్రాల్లో నటించిన ఆమె కొన్ని విజయాలతో మంచి క్రేజ్‌ను దక్కించుకుంది. అయితే ఇటీవల కాలంలో సినిమాల విషయంలో కాస్త స్లో అయిన ఈ భామకు ఇప్పుడు ఓ క్రేజీ ప్రాజెక్ట్‌లో అవకాశం వచ్చినట్లు సమాచారం. టాలీవుడ్ సీనియర్ స్టార్ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందుతున్న 'సింగ్ గీతం' చిత్రంలో నివేతా పేతురాజ్ కీలక పాత్రలో నటించే ఛాన్స్ కొట్టేసినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశముంది. 94 ఏళ్ల వయసులో కూడా సింగీతం శ్రీనివాసరావు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండటం ఈ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తోంది. ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు.

# రీ రిలీజ్ కానున్న రుద్రమదేవి



అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటించిన రుద్రమదేవి చిత్రం 2015లో విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో రానా దగ్గుబాటి, అల్లు అర్జున్ కీలక పాత్రల్లో నటించారు. దర్శకుడు గుణశేఖర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించడం మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా వ్యవహరించాడు. ఇటీవల కాలంలో తెలుగు సినిమా పరిశ్రమలో పలు హిట్ చిత్రాలు రీ రిలీజ్ అవుతున్న నేపథ్యంలో రుద్రమదేవి చిత్రాన్ని కూడా మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మూవీ బృందం నిర్ణయించింది. ఈ మేరకు ఈ సినిమాను మే 22వ తేదీన భారీ స్థాయిలో థియేటర్లలో రీ రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఇప్పుడు ఈ రీ రిలీజ్ సందర్భంగా రుద్రమదేవి చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభావం చూపిస్తుందో చూడాల్సి ఉంది. ఇప్పటికే ఈ చిత్రానికి మంచి క్రేజ్ ఉండటంతో రీ రిలీజ్ లో కూడా ప్రేక్షకుల నుండి మంచి స్పందన వచ్చే అవకాశం కనిపిస్తోంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028 Published at Plot S11,
3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787